ప్రజాపక్షం 8th ANNIVERSARY 22nd October, 2026

ప్రతి అక్షరం ప్రజల కోసం www.prajapaksham.in

# ప్రజాపక్షం

PRAJAPAKSHAM ★

బల్గేరియా తీరంలో డ్రోన్ దాడి: నౌక మునక

08

ఉక్రేన్ – రష్యా యుద్ధ పరిష్కారానికి ప్రణాళిక!

సంపుటి 09, సంచిక: 314 | బుధవారం | 14-10-2026 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# విద్యుత్ సౌధ వద్ద భారీ ధర్నా

రూ.59 వేల కోట్ల బకాయిలు తక్షణమే చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) డిమాండ్






- లేనిపక్షంలో జెన్‌కో, ట్రాన్స్‌కోకు బొగ్గు సరఫరా నిలిపివేస్తామని హెచ్చరిక
- అవసరమైతే బొగ్గు బావుల వద్దే ఆందోళనకు దిగి ఉత్పత్తిని స్తంభింపజేస్తామని స్పష్టీకరణ
- బకాయిలు పేరుకుపోవడంతో వేతన చెల్లింపులకు అప్పులు చేయాల్సి వస్తుందని వాసిరెడ్డి సీతారామయ్య మండిపాటు
- జెన్‌కో ఫైనాన్స్ డైరెక్టర్ వీరమహేందర్‌కు వినతి పత్రం అందజేత

ప్రజాపక్షం/హైదరాబాద్

సింగరేణి బకాయిలు రూ.59 వేల కోట్లకు చేరినా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఎఐటియుసి కార్మిక సంఘం సమర భేరి మోగించింది. బకాయిలను తక్షణమే విడుదల చేయక పోతే జెన్‌కో, ట్రాన్స్‌కోకు బొగ్గు సరఫరాను నిలిపివేస్తామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) హెచ్చరించింది. అవసరమైతే బొగ్గు బావుల వద్దే ఆందోళనకు దిగి ఉత్పత్తిని స్తంభింపజేస్తామని స్పష్టం చేసింది. సింగరేణి బకాయిలు రూ.59 వేల కోట్లు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లోని విద్యుత్ సౌధ ఎదుట సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో భారీ ధర్నా జరిగింది. సింగరేణిలోని 12 ఏరియాల నుంచి కార్మికులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ రూ.వేల కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కనీస భద్రతా పరికరాలు కొనుగోలు చేయడానికి కూడా నిధుల కొరత ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దసరా, దీపావళి పండుగల నేపథ్యంలో కార్మికులకు చెల్లించాల్సిన బోనస్‌లపైనా ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ తరువాయి 8లో



# ప్రజాస్వామ్య పునరుద్ధరణకు ఉమ్మడి పోరాటం

## ఇండియా కూటమి–పౌర ప్రతినిధుల సమావేశం ప్రతిజ్ఞ

- ప్రజా నిరసన కొనసాగుతుంది : విజయం తథ్యం
- ఓట్‌చోరీ దోషులను చట్టం ముందు నిలబెడతాం
- మోదీ,షా,జ్ఞానేశ్‌ల మెడచుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది
- దేశ ప్రజలంతా మా వెంటే ఉన్నారు
- సిజెఐ, సుప్రీంకోర్టు పట్ల అత్యున్నత గౌరవం ఉంది
- కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఉద్ఘాటన

జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకు సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా డిమాండ్

**న్యూఢిల్లీ:** దేశంలో ప్రజాస్వామ్య ప్రక్రియ పునరుద్ధరణకు ఉమ్మడి పోరాటం కొనసాగిస్తామని ఇండియా కూటమిపార్టీల దిగ్గజ నాయకులు,పౌరసమాజ ప్రతినిధుల సమావేశం ప్రతిజ్ఞ చేసింది. గంటన్నరకు పైగా జరిగిన ఈ సమావేశంలో భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ ఎంపి సందోశ్ కుమార్ పాల్గొన్నారు.లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు,కాంగ్రెస్‌పార్టీ నాయకుడు రాహుల్ గాంధీనివాసంలో మంగళవారం తేనీటి విందు కార్యక్రమం జరిగింది. దేశంలో జరుగుతున్న రాజకీయ,ప్రజా ప్రతిఘటన కొనసాగుతుందని,అంతిమంగా విజయంసాధిస్తుందని, దేశ ప్రజలందరూ తమవెంటే ఉన్నారని ఈ సమావేశంలోనూ, ఆ తర్వాత పాత్రికేయులతో మాట్లాడుతూ రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. సుప్రీంకోర్టు వరకూ సోమవారం సాయంత్రం జరిగిన ప్రజాస్వామ్య యాత్రలో,వీధుల్లో భారీస్థాయిలో జరిగిన ప్రదర్శనలు,నిరసన కార్యక్రమాల్లో ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొన్నారని చెబుతూ వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, భారత ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ పేర్లు ప్రత్యక్షంగా ఈ సమావేశంలో ప్రస్తావిస్తూ, ఓట్ చోరీకి తరువాయి 8లో

## ఫారం-7 దరఖాస్తులపై పరిమితులు

ఓట్ల తొలగింపునకు కేంద్ర ఎన్నికల కమిషన్ అడ్డుకట్ట

ప్రజాపక్షం/హైదరాబాద్

ఓట్ల తొలగింపునకు జరుగుతున్న ప్రయత్నాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఫారం–7 దరఖాస్తులపై పరిమితులు విధిస్తూ మార్గదర్శకాలు జారీ చేసింది. ఎస్ఐఆర్ సమయంలో ముసాయిదా జాబితా ప్రచురించక ముందు మొత్తంలో గరిష్టంగా 50, రోజుకు పది వరకు ఫారం–7లు ఇచ్చే అవకాశాన్ని బిఎల్‌ఎలకు సిఇసి కల్పించింది. అయితే హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో వెలుగు చూసిన ఘటనపై స్పందించిన సిఇసి ఫారం–7లపై అనుసరించాల్సిన విధానాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారులకు మార్గదర్శకాలు ఇచ్చింది. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల సమయంలో ఒక వ్యక్తి గరిష్టంగా ఏడు ఫారం–7లు మాత్రమే ఇవ్వొచ్చునని సిఇసి తరువాయి 8లో

# శాశ్వత అధికారం కోసమే...



- రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రజాస్వామ్య పునాదులను దెబ్బతీస్తున్న మోదీ సర్కార్
- 'సర్' ప్రక్రియలో అర్హుల ఓట్ల తొలగింపు ఆరోపణలపై కేంద్రం సమాధానం చెప్పాలి
- కరువు పరిస్థితులు తెలంగాణలో ఆందోళన కలిగిస్తున్నాయి
- ఎమ్మెల్సీ ఎన్నికలపై కాంగ్రెస్ ఇప్పటి వరకూ మమ్మల్ని సంప్రదించలేదు
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం శాశ్వతంగా అధికారంలో కొనసాగాలనే లక్ష్యంతో రాజ్యాంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రజాస్వామ్య పునాదులనే దెబ్బతీస్తున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్లను తొలగిస్తున్నారన్న ఆరోపణలపై కేంద్రం సమాధానం చెప్పాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పునరుద్ధరించేందుకు కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్ధూంభవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సిపిఐ తెలంగా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్యపద్మ, ఎఐటియుసి సీనియర్ నాయకులు వి.ఎస్.బోస్, ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాబు, కోశాధికారి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి ప్రాణమైన ఓటు హక్కును దెబ్బతీసే విధానాలను అనుసరిస్తోందని విమర్శించారు. విదేశీయుల అక్రమ ప్రవేశాలను అడ్డుకోవాలనే పేరుతో ప్రారంభించిన ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను దేశవ్యాప్తంగా విస్తరించి, అర్హులైన ఓటర్లను తొలగించే పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరినైనా ఓటరును జాబితా నుంచి తొలగించే ముందు సంబంధిత వ్యక్తికి నోటీసు ఇచ్చి, తన వాదన వినిపించుకునే అవకాశం కల్పించాలని కూనంనేని పేర్కొన్నారు. విచారణ లేకుండా మూకుమ్మడిగా ఓట్లను తొలగించడం అన్యాయమని అన్నారు. దేశ రాజధానిలో ప్రజా సమస్యలపై నిరసన తెలిపేందుకు కీలక వేదికగా ఉన్న జంతర్‌మంతర్‌లో ఆందోళనలపై ఆంక్షలు విధించడంపై కూనంనేని సాంబశివరావు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కును అణచివేయడం సరైంది కాదన్నారు. ప్రజల ఆందోళనలను అర్థం చేసుకుని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం, నిర్బంధాన్ని ఆశ్రయిస్తోందని విమర్శించారు. రాజ్యాంగ హక్కుల పరిరక్షణకు న్యాయవ్యవస్థ చొరవ చూపాలని ఆయన కోరారు. తెలంగాణలో కరువు పరిస్థితులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని కూనంనేని సాంబశివరావు అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 315 మండలాలను కరువు మండలాలుగా గుర్తించిన నేపథ్యంలో రైతులకు ఉపశమన చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. వరి సాగు చేయవద్దని సూచిస్తున్న ప్రభుత్వం, ఇప్పటికే వరి వేసిన రైతులకు నీటి సదుపాయం కల్పిస్తుందా? నష్టపరిహారం చెల్లిస్తుందా? అనే విషయాన్ని స్పష్టం చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు తరువాయి 8లో



జంతర్‌మంతర్ స్వాధీనానికి

# పార్లమెంట్ వీధిలో కదంతొక్కిన ఎఐఎస్‌ఎఫ్,ఎఐవైఎఫ్

- బారికేడ్లు, భారీ పోలీసుల మోహరింపును ఛేదించుకుని చొచ్చుకెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు
- నిరసనస్థలిని చేరుకున్న సిజెపి నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకా అరెస్టు

**న్యూఢిల్లీ :** ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)లో అవకతవకలు జరిగాయంటూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా పలు సంస్థలు నిరసనలకు పిలుపునిచ్చిన నేపథ్యంలో అధికారులు ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. పెద్ద సంఖ్యలో పోలీసు సిబ్బందిని మోహరించారు. జంతర్ మంతర్‌ను నిరసనలకు నిర్దేశించిన జాబితా నుంచి తొలగించారు. అయితే కేంద్రం చర్యపై మండిపడుతూ మంగళవారం వందలాది మంది ఎఐఎస్‌ఎఫ్, ఎఐవైఎఫ్ కార్యకర్తలు జంతర్ మంతర్‌ను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు పార్లమెంట్ వీధిలో కదం తొక్కారు. నిరసన తమ హక్కు అని, అదే విధంగా నిరసన చేసే ప్రదేశాన్ని కూడా కాపాడుకోవడం తమ హక్కేనన్నారు. సిఇసి జ్ఞానేశ్ రాజీనామా, జంతర్ మంతర్‌ను సాధిస్తామంటూ నినాదాలు హోరు సాగించారు. బారికేడ్లను ఛేదించుకుని జంతర్ మంతర్ మైదానంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు తరువాయి 8లో

## పోస్టుమెట్రిక్ విద్యార్థులకు రూ.204 కోట్లు విడుదల

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఫీజు బకాయిలకు మరో రూ.14.68 కోట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ (2026–27 వార్షిక విద్యా సంవత్సరం) కింద 32,976 మంది విద్యార్థులకు మొత్తం రూ.204.40 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన 40 శాతం వాటాగా రూ.101.44 కోట్లు, కేంద్ర ప్రభుత్వం 60 శాతం వాటాగా రూ.102.96 కోట్లు విడుదల చేసినట్టు సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మంగళవారం వెల్లడించారు. కళాశాలల నుంచి అందుతున్న పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అర్హత ఉన్న విద్యార్థులకు దశలవారీగా స్కాలర్‌షిప్‌ను మంజూరు చేస్తున్నామని తెలిపారు. విద్యార్థులకు ఆర్థిక తరువాయి 12లో

# దీపావళి తర్వాతే ఎండిఆర్ చార్జీలు

పండుగల సీజన్ నేపథ్యంలో అమలు వాయిదా వేసిన కేంద్రం




**న్యూఢిల్లీ :** పండగల సీజన్ నేపథ్యంలో కేంద్రం యుపిఐ వినియోగదారులకు ఊరట కల్పించింది. రూ.2,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవీలపై 0.4 శాతం 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' (ఎండిఆర్) విధించే నిర్ణయాన్ని వాయిదా వేశారు. దీని అమలుకు సంబంధించిన కొత్త తేదీని దీపావళి తర్వాత నిర్ణయిస్తామని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) మంగళవారం ప్రకటించింది. గత నెలలో ఎన్‌సిపిఐ జారీ చేసిన సర్క్యులర్ ప్రకారం క్టోబర్ 15 నుండి రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన 'పర్సన్ టు మర్చంట్' (వ్యక్తి నుండి వ్యాపారికి) యుపిఐ చెల్లింపులపై 0.4 శాతం ఎండిఆర్ విధించాల్సి ఉంది. అయితే పండుగ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, ఎంపిక చేసిన 'పర్సన్ టు మర్చంట్' యుపిఐ లావాదేవీలపై తరువాయి 8లో

# పరిహారం ఇవ్వకుండా... పంట ధ్వంసం చేయొద్దు

- వరంగల్ జిల్లా నర్సింహులుపల్లి గ్రామంలో అధికారులను అడ్డుకున్న నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే బాధిత రైతులు
- పోలీసుల మోహరింపుతో ఉద్రిక్త వాతావరణం



ప్రజాపక్షం/పరకాల

పరిహారం ఇవ్వకుండా పంటను ధ్వంసం చేయడంపై నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే బాధిత రైతులు మండిపడ్డారు. భూములు కోల్పోతున్న రైతులకు ఎలాంటి పరిహారం చెల్లించకుండా రైతులకు సమాచారం లేకుండా పంటలను తొలగించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అడ్డుకున్నారు. రెవెన్యూ అధికారులు పోలీసులు కాంట్రాక్టర్ చేస్తున్న పనులకు వత్తాస్ పలుకుతూ రైతులను అడ్డుకోవడం దుర్మార్గమని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. పంటలను ధ్వంసం చేయడానికి వచ్చిన యంత్రాలను నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే బాధిత రైతులు అడ్డుకోవడాన్ని పోలీసులు జీర్ణించుకోలేకపోయారు.దాంతో రైతులను ఎక్కడికి అక్కడ అడ్డుకొని పంటలను ధ్వంసం చేశారు. వరంగల్ జిల్లా శాయంపేట మండలంలోని నర్సింహులపల్లి గ్రామానికి చెందిన బూర్గుల రామచంద్రావు అనే రైతుకు చెందిన సర్వేనెంబర్ 625,626,627 సుమారు మూడు నాలుగు ఎకరాలలోని తరువాయి 8లో

## తెలంగాణ రహదారులను అప్‌గ్రేడ్ చేయండి

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి వినతి

03

## చినగని, తడవని మీసేవ సర్టిఫికెట్లు

కొత్త పేపర్‌ను ప్రారంభించిన ఐటి మంత్రి శ్రీధర బాబు

## 15,16న ఓటర్ల నమోదు ప్రత్యేక క్యాంపులు

10

02
ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
బుధవారం
14-10-2026
www.prajapaksham.in
ఎడిట్
PEOPLE'S VIEWS

# అదుపు తప్పిన ధరలు

ఇరాన్‌తో అమెరికా యుద్ధం, పర్యవసానంగా ఆయిలు సరఫరాకు తీవ్రమైన అంతరాయం, గోరుచుట్టుపై రోకటిపోటులా వాతావరణంపై ఎల్‌నినో ప్రతికూల ప్రభావం, ఈ పరిస్థితిని అవకాశంగా ఉపయోగించుకుంటున్న వ్యాపారుల అధిక లాభాపేక్ష – కలగలిసి రవాణా ఖర్చులు, నిత్య జీవితావసర సరుకుల ధరల పెరుగుదలకు దారితీసి సామాన్య ప్రజల బతుకులతో చెలగాట మాడుతున్నాయి. ఇప్పుడే ఇలా వుంటే, రానున్న 10–12 మాసాల్లో బతుకులెలా వుంటాయోనని జనాలు కలవరం చెందుతున్నారు. ప్రభుత్వం సోమవారం విడుదల చేసిన అధికారిక సమాచారం ప్రకారం, ఆహారం, ఇంధన ద్రవ్యోల్బణం అత్యధికంగా 5.5 శాతానికి చేరింది. ఇది ఆకస్మికం కాదు. కొన్ని నెలలుగా పెరుగుతూ అక్కడికి చేరింది. అక్కడ ఆగుతుందన్న గ్యారంటీ లేదు. ప్రస్తుత స్థాయి రెండు సంవత్సరాల క్రితం ఏర్పడిన అత్యధిక ద్రవ్యోల్బణం స్థాయి. అంటే రెండు సంవత్సరాలుగా ధరలను ఎంతో కొంత అదుపులో పెడుతూ ద్రవ్యోల్బణం స్థాయిని తగ్గించిన ప్రయత్నాలు ఇప్పుడు పనిచేయని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ 5.5శాతం రిటైల్ ద్రవ్యోల్బణం అయినప్పటికీ అవి చిల్లర మార్కెట్‌లో ధరల పెరుగుదలను పూర్తిగా ప్రతిబింబించవు–ఇది ప్రజల జీవితానుభవం చెప్పేమాట!

ద్రవ్యోల్బణాన్ని వినిమయ ధరల సూచీ(సిపిఐ)తో కొలుస్తారు. ఆగస్టులో 4.8 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం సెప్టెంబర్‌లో 5.5 శాతంగా నమోదు అయింది. 2024 అక్టోబర్ నాటినుంచి ఇదే అత్యధికం. ద్రవ్యోల్బణం గరిష్ఠ స్థాయి 6 శాతంగా రిజర్వుబ్యాంక్ నిర్దేశించుకుంది. అయితే సెప్టెంబర్ ద్రవ్యోల్బణ సూచీ 5.54 శాతాన్ని చేరటంతో 6శాతం పరిమితిని మించటానికి ఎంతో సమయం పట్టక పోవచ్చు. ట్రంప్ పశ్చిమాసియా యుద్ధ విధానం వల్ల హోర్ముజ్ జలసంధి ద్వారా బహు తక్కువగా ఆయిలు ట్యాంకర్లు వెలుపలికి వస్తున్నాయి. అంతేగాక ఇరాన్ ఆయిలు రేవులను ట్రంప్ తమ ఓడలతో దిగ్బంధించటం కొనసాగు తున్నది. సౌదీ అరేబియా ఆయిలు వసతులకు ఎమెన్ హౌతీలు ముప్పుగా పరిణమించారు. రష్యా నుంచి ఆయిలు దిగుమతి చేసుకునే దేశాలపై 100–140 శాతం టారిఫ్‌లు విధించే చట్టంపై సంతకం చేసిన ట్రంప్, అమెరికాలోనే డీజిల్ ధరలు మండుతున్నందున మూడు నెలలపాటు రష్యా నుంచి లక్షల బ్యారల్స్ దిగుమతికి పుతిన్‌తో ఒప్పందం చేసుకున్నాడు. ఈ దిగుమతి నిరాటంకంగా జరిగేందుకు ఉక్రేన్–రష్యాల ఇంధన వసతులపై పరస్పర దాడులకు విరామం సాధించారు. కాబట్టి అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ధరలు పెరుగుదలేకాని తగ్గుదల ఉండదు. రెండోవైపున, డాలర్‌తో పతనమవుతున్న రూపాయి విలువ. మన ఆయిలు మార్కెట్ కంపెనీలు ఎన్నాళ్లు నష్టాలు భరిస్తాయి? రిటైల్ ధర పెంపుదల అనివార్యం. కాబట్టి దాని సర్వవ్యాప్త ప్రభావం అన్ని వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుంది.

రెండోవైపున, ఎల్‌నినో ప్రభావంతో మన దేశంలో వర్షాలు హెచ్చుతగ్గులుగా కురిసినందున వేసంగి పంట దిగుబడులు తగ్గాయి. రబీ పరిమిత ప్రాంతాల్లోనే సాధ్యం. కాబట్టి బియ్యం, అపరాలు, నూనెలు, ఉల్లిగడ్డల ధరలు ఇప్పటికే పెరిగాయి.

ఈ పెరుగుదల అక్టోబర్ రిటైల్ ద్రవ్యోల్బణం సూచీలో తప్పక ప్రతిబింబిస్తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర సహా పలు రాష్ట్రాల్లోని విస్తారమైన ప్రాంతాలు అనావృష్టి కోరల్లో ఉన్నాయి. తెలంగాణలో సన్నబియ్యం ధరలకు రెక్కలొచ్చాయి – అప్పుడే పావుమూట రూ.1800 నుంచి రూ.2500ల దాకా పెరిగింది. పప్పులు, కాయధాన్యాలు, నూనెలు, పండ్లు, పాలు, ఆకుకూరలు ధరలన్నీ అప్పుడే పెరిగాయి – రానున్న మాసాల్లో నిస్సందేహంగా మరింత పెరుగుతాయి. వచ్చే జూన్–జులై వరకు తాగునీటి అవసరార్థం జలాశయాల్లో నీటిని కాపాడుతున్నందున, వరి, పత్తి వంటి పైర్లు వేయవద్దని, ప్రత్యామ్నాయ మెట్టపంటలు వేసుకోమని ప్రభుత్వం రైతులకు హితబోధ చేస్తున్నది. కరెంటు కష్టాలూ తప్పవు. కాబట్టి పంటల విస్తీర్ణం తగ్గుదల, దిగుబడుల తగ్గుదల వగైరా కారణాలవల్ల ఆహారోత్పత్తులకు వ్యాపారులు కొరత సృష్టిస్తారు. అందువల్ల ధరలు కనీసం నియంత్రణలో ఉండాలంటే అక్రమ నిల్వలపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలి. ఈ విషయంలో తాత్సారం కనిపిస్తున్నది. ద్రవ్యోల్బణం నియంత్రణకు రిజర్వుబ్యాంక్ మరో ఒకటి – రెండుసార్లు వడ్డీరేట్లు పెంచనూవచ్చు. వ్యాపార రుణాలపై బ్యాంకులు వడ్డీ రేట్లు పెంచితే అవి మళ్లీ వస్తువుల ధరల పెరుగుదలకే దారితీస్తాయి. కాబట్టి రానున్న సంవత్సరకాలం రిజర్వు బ్యాంక్‌కు, ప్రభుత్వాలకు గడసాము తప్పదు. ఇందులో వాటి కృషి సఫలమైతేనే సామాన్య ప్రజలకు కొంత ఊరట. ●



## ‘ఎఎస్‌డిడి’అనేది వైద్యపరమైన రుగ్మతలా అనిపిస్తోంది

‘సర్’ సందర్భం లో గైర్హాజరైన, స్థానభ్రంశం చెందిన, మరణించి న, నకిలీ (ఎఎస్‌డిడి) ఓటర్ల వర్గాల విషయంలో ఎన్నికల సంఘం చట్ట విరుద్ధమైన, రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా అభివర్ణించే ‘సర్’ను సమర్థించుకోవడానికి ‘ఎఎస్‌డిడి పదాన్ని పదే పదే ఉపయోగిస్తున్నారు.‘ఎఎస్‌డిడి’ అనేది ఒక వైద్యపరమైన రుగ్మతలా అనిపిస్తున్నది. ఇందులో మొదటి ‘డి’ అనేది ‘డెడ్’ను సూచిస్తుంది. వీరు తొలగింపులలో సుమారు 20శాతం ఉంటారు. రెండవ ‘డి’ అనేది ‘డూప్లికేట్స్’ ను సూచిస్తుంది. వీరు తొలగింపులలో సుమారు 8శాతం ఉంటారు. ‘ఎ’ అంటే ‘ఆబ్‌సెంట్’, ‘ఎస్’ అంటే ‘షిఫ్టెడ్’, ఇతరులతో కలిపి 10కోట్లకు పైగా చట్టబద్ధమైన ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. ‘ఎస్ఐఆర్’ను నిలిపివేయాలి.

– కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్



# అంబేద్కర్ బౌద్ధ ధర్మ స్వీకరణ వెనక సామాజిక విప్లవం

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ బౌద్ధ ధర్మాన్ని స్వీకరించడం భారతదేశ చరిత్రలో ఒక గొప్ప సామాజిక విప్లవం. 1956 అక్టోబర్ 14న నాగ్‌పూర్‌లో ఆయన తన ఆరు లక్షల అనుచరులతో కలిసి బౌద్ధ ధర్మాన్ని స్వీకరించారు. ఇది కేవలం మతమార్పిడి కాదు; శతాబ్దాలుగా కులవివక్ష, అంటరానితనం, సామాజిక అవమానాలకు గురైన ప్రజల ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వ పోరాటానికి చారిత్రక మలుపు. అంబేద్కర్ జీవించిన కాలంలో కులవ్యవస్థ మనుషుల విద్య, వృత్తి, సామాజిక గౌరవం, హక్కులను ప్రభావితం చేసేది. అణగారిన వర్గాలు ప్రజా నీటి వనరులను ఉపయోగించుకోవడం, విద్యను అభ్యసించడం, సమాన గౌరవంతో జీవించడం కోసం పోరాడాల్సి వచ్చేది. చిన్నతనం నుంచే కులవివక్షను అనుభవించిన అంబేద్కర్, ఈ సమస్య ను వ్యక్తిగత అవమానంగా కాకుండా మాన హక్కులను నిరాకరించే సామాజిక వ్యవస్థగా విశ్లేషించారు.

1927లో మహద్ సత్యాగ్రహం ద్వారా ప్రజా నీటి వనరులను ఉపయోగించుకునే హక్కు కోసం పోరాడారు. అదే సంవత్సరం మనుస్మృతి దహనం ద్వారా కుల అసమానతలను సమర్థించే భావజాలాన్ని నిరసించారు. ఆయన లక్ష్యం కేవలం సంస్కరణ కాదు; కులవ్యవస్థ నిర్మూలన.

**బౌద్ధ ధర్మాన్ని ఎందుకు ఎంచుకున్నారు?**

1935లో యేవలాలో జరిగిన సమావేశంలో తాను హిందువుగా జన్మించినప్పటికీ హిందువుగా మరణించబోనని అంబేద్కర్ ప్రకటించారు. అనంతరం వివిధ మతాలు, తాత్విక సంప్రదాయాలను అధ్యయనం చేసి బౌద్ధ ధర్మాన్ని ఎంచుకున్నారు. బుద్ధుని బోధనల్లోని ప్రజ్ఞ, కరుణ, సమత ఆయనను ఆకర్షించాయి. జన్మ ఆధారంగా కాకుండా మానవ గౌరవం, నైతిక ప్రవర్తన, జ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వడం ఆయన సమానత్వ దృక్పథానికి అనుగుణంగా ఉంది. అంబేద్కర్ దృష్టిలో మతం అనేది కేవలం ఆచారాలకు పరిమి తం కాకూడదు; అది స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావాన్ని బలపరచాలి. 1956 అక్టోబర్ 14న నాగ్‌పూర్‌లో బౌద్ధ ధర్మాన్ని స్వీకరించిన అనంతరం తన అనుచరులకు 22 ప్రతిజ్ఞలు చేయించారు. ఈ చర్య కులాధారిత హీనత్వాన్ని తిరస్కరించి, ఆత్మగౌరవంతో కూడిన కొత్త జీవన దృక్పథాన్ని స్వీకరించడానికి ప్రతీకగా నిలిచింది.

**సామాజిక, రాజకీయ, ఆర్థిక పరిస్థితులు:**

అంబేద్కర్‌కు సామాజిక సమానత్వంతోపాటు రాజకీయ ప్రాతిని ధ్యం, విద్య, ఉపాధి, ఆర్థిక స్వావలంబన కూడా అత్యంత ముఖ్యమైనవి. భూమి, సంపద, విద్య, ఉపాధి అవకాశాలపై అసమాన నియంత్రణ అణగారిన వర్గాలను పేదరికంలోనే ఉంచుతుందని ఆయన గుర్తించారు. అందుకే ఆయన రాజకీయ ప్రజాస్వామ్యంతో పాటు సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యాన్ని కోరుకున్నారు. భారత రాజ్యాంగంలోని సమానత్వ హక్కులు, వివక్ష నిషేధం, అంటరానితనం నిర్మూలనకు సంబంధించిన ఆర్టికల్ 17ఆయన ఆశయాలకు అనుగుణంగా కీలకమైన రక్షణలను కల్పించాయి.

అయితే చట్టాలు చేయడం మాత్రమే సరిపోదు. కులవివక్షను కొనసాగించే మనస్తత్వాలు, సామాజిక ఆచారాలు కూడా మారాలి. బౌద్ధ ధర్మ స్వీకరణ ద్వారా అంబేద్కర్ సామాజిక నైతికతలో మార్పు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**నేటి భారతదేశంలో అంబేద్కర్ ఆలోచనల ప్రాసంగికత**

స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా కులవివక్ష, కులాధారిత హింస, విద్యా అవకాశాల్లో అసమానతలు, ఆర్థిక అంతరాలు పూర్తిగా తొలగిపోలేదు. రాజకీయ ప్రాతినిధ్యం పెరిగినప్పటికీ అన్ని వర్గాలకు సమాన అవకాశాలు, వనరులు, గౌరవం అందుతున్నాయా అనే ప్రశ్న నేటికీ ప్రాధాన్యమైనదే. అంబేద్కర్‌ను గౌరవించడం అంటే జయంతి, వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడం మాత్రమే కాదు. ఆయన ఆశయాలను విద్య, ఉపాధి, పాలన, న్యాయవ్యవస్థ, సామాజిక సంబంధాల్లో అమలు చేయాలి. రాజ్యాంగ అక్షరాస్యతను పెంచి, వివక్షను నిర్మూలించి, అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలి.

పుల్లెంల గణేష్, 9553041549

# ట్రంప్ కేంద్రకంగా అమెరికా మధ్యంతర ఎన్నికలు

**అశోక్ నీలకంఠన్ అయర్స్**

అమెరికాలో నవంబర్ 3న జరగబోయే మధ్యంతర ఎన్నికలకు రంగం సిద్ధమైంది. కాంగ్రెస్‌పై నియంత్రణ కోసం జరుగుతున్న ఈ పోటీని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన అధ్యక్ష పదవిపై వ్యక్తిగత ప్రజాభిప్రాయ సేకరణ(రిఫరెండం)గా మారుస్తున్నారు. బ్యాలెట్ పేపర్‌పై తన పేరే ఉన్నట్లుగా భావించి ఓటు వేయాలని ఆయన అమెరికన్‌లను కోరుతున్నారు.

రిపబ్లికన్‌లు దీనిపై చాలా పెద్ద ఆశలు పెట్టుకున్నారు. ఉభయ సభల నియంత్రణ ఆ పార్టీ చేతిలోనే ఉన్నప్పటికీ, డెమోక్రాట్లు ప్రతినిధుల సభ (హౌస్) కోసం తీవ్రంగా ప్రచారం చేస్తున్నారు. సెనేట్‌లో కూడా తమకు అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుత పోలింగ్ ప్రకారం, జాతీయ ప్రతినిధుల సభ ప్రాధాన్యతలో డెమోక్రాట్లకు ఆధిక్యం ఉందని, సెనేట్‌లోని పలు కీలక స్థానాల్లో గట్టి పోటీ ఉందని తెలుస్తోంది. అయినప్పటికీ, తుది ఫలితం ఓటింగ్ శాతం, వ్యక్తిగత పోటీలపై ఆధారపడి ఉంటుంది.

పందెం ఏమిటో ట్రంప్‌కు తెలుసు. డెమోక్రాట్ల ఆధీనంలోని ప్రతినిధుల సభ లేదా డెమోక్రాట్ల నియంత్రణలో ఉన్న కాంగ్రెస్, ఆయన అధ్యక్ష పదవిలోని చివరి రెండేళ్లను నాటకీయంగా మార్చేస్తుంది. ఇది కాంగ్రెస్ నిఘాను పెంచడం ద్వారా ఆయన శాసనపరమైన అజెండాను ముందుకు తీసుకెళ్లడాన్ని గణనీయంగా కష్టతరం చేస్తుంది.

ఆయన స్పందన అసాధారణంగా ఉంది. నియోజకవర్గాల పునర్విభజన పోరాటాలు, ఓటింగ్ నియమాలను మార్చే ప్రయత్నాలు, ఓటర్ల జాబితాలపై ఫెడరల్ దర్యాప్తులు, ప్రభుత్వ నిధులతో ప్రకటనలు, ఎంపిక చేసిన అమెరికన్లకు ప్రత్యక్ష చెల్లింపులు, అన్నింటికన్నా నాటకీయంగా రిపబ్లికన్‌లు ఉభయ సభలను నిలబెట్టుకుంటే వయోజన అమెరికన్లకు ‘ట్రంప్ డివిడెండ్’ పేరిట $5,000 ఇస్తామన్న వాగ్దానం. ఈ $5,000 ప్రతిపాదన అన్నింటికంటే సాహసోపేతమైనది కావచ్చు. డల్లాస్‌లో జరిగిన రిపబ్లికన్ మధ్యంతర ఎన్నికల సమావేశం లో, రిపబ్లికన్‌లు ప్రతినిధుల సభ, సెనేట్‌ను గెలిస్తే ప్రతి వయోజన పౌరుడికి $5,000 అందుతాయని ట్రంప్ వాగ్దానం చేశారు. సుంకాల రాబడితో ఈ చెల్లింపులకు నిధులు సమకూర్చవచ్చని ఆయన సూచించారు. అయితే, ఈ లెక్కలు చాలా కఠినమైనవి. సుమారు 24 కోట్లమంది వయోజన పౌరులు ఉన్నందున, ఈ కార్యక్రమానికి దాదాపు $1.2 ట్రిలియన్ల ఖర్చవుతుంది. ఇది ప్రస్తుత సుంకాల వసూళ్ల కంటే చాలా ఎక్కువ. దీనికి కాంగ్రెస్ ఆమోదం కూడా అవసరం. ట్రంప్ దీనిని ప్రచార చెల్లింపుగా కాకుండా డివిడెండ్‌గా పేర్కొన్నారు. చట్టపరంగా ఈ వ్యత్యాసానికి ప్రాముఖ్యత ఉంది.

ఓటు వేయడానికి ప్రజలకు డబ్బు చెల్లించడం లేదా ఒకే తరహా ఓటింగ్‌కు ప్రేరేపించడం ఫెడరల్ చట్టం ప్రకారం నిషిద్ధం. అయితే, ట్రంప్ ప్రతిపాదనను ఓట్ల కొనుగోలుతో సమానంగా చూడలేమని పలు వార్తా సంస్థల అడిగిన ప్రశ్నకు న్యాయ పండితులు జవాబుగా చెబుతున్నారు. ఎందుకంటే, రిపబ్లికన్‌లకు, డెమోక్రాట్లకు ఓటు వేసినా లేదా అసలు ఓటు వేయకపోయినా, అర్హులైన వయోజనులందరికీ వాగ్దానం చేసిన చెల్లింపు అందుతుంది. అంతేకాకుండా, పన్నుల తగ్గింపు వంటి విస్తృత రాజకీయ వాగ్దానాలకు, ప్రత్యక్ష ఓటు కొనుగోలుకు మధ్య సుప్రీంకోర్టు కూడా తేడాను స్పష్టం చేసింది. అంతమాత్రాన ఆ ప్రతిపాదన సాధారణమైనది కాదు. అది దానిని రాజకీయంగా, చట్టపరంగా అసాధారణమైనదిగా చేస్తుంది. పోలింగ్ కేంద్రంలో ఒక ఓటరుకు $5,000 అందజేస్తున్నారా అన్న దానికంటే, అధ్యక్షుడు తన పార్టీ ఎన్నికల విజయానికి దేశవ్యాప్త ఆర్థిక ప్రయోజనాన్ని ఉద్దేశపూర్వకంగా ముడిపెడుతున్నారా అన్నదే ఇక్కడ అసలు ప్రశ్న. విమర్శకులు ఈ ప్రతిపాదనను లంచంగా అభివర్ణించగా, ట్రంప్, ఆయన మిత్రులు దీనిని తమ ప్రభుత్వ ఆర్థిక విధానాల కారణంగా లభించే డివిడెంట్ (ప్రయోజనంగా)అభివర్ణిస్తున్నారు. కాంగ్రెస్ దీనిని అమలు చేసే చట్టాన్ని వాస్తవంగా పరిశీలించేంత వరకు ఈ వాగ్దానం వివాదాస్పదంగానే మిగిలిపోతుంది.

ప్రభుత్వం ఇప్పటికే ఇతర మార్గాల్లో నిధులను మళ్లించింది. దాదాపు పది లక్షల మంది అమెరికన్‌లు అఫోర్డబుల్ కేర్ యాక్ట్ కింద $500 రిబేట్ చెక్కులను అందుకోవడం ప్రారంభించారు. అదే సమయంలో, 2 కోట్ల మందికి పైగా మెడికేర్ లబ్ధిదారులకు సుమారు $90 చెల్లించే ప్రణాళికలను ట్రంప్ ప్రకటించారు. ఎన్నికలకు ఇంత దగ్గరగా ఈ చెల్లింపులు చేయడంపై విమర్శకులు ప్రశ్నించగా, ప్రభుత్వం వీటిని చట్టబద్ధమైన ప్రభుత్వ ప్రయోజనాలు లేదా వాపసులుగా అభివర్ణిస్తోంది. అదే సమయంలో, ప్రభుత్వం పన్ను చెల్లింపుదారుల డబ్బులో సుమారు $2 కోట్ల డాలర్లను హోం ల్యాండ్ సెక్యూరిటీ ప్రకటనల కోసం ఖర్చు చేసింది. ఇది ప్రాథమికంగా రాజకీయ ప్రచారమేనని విమర్శకులు వాదిస్తున్నారు. వైట్ హౌస్ ఈ ప్రకటనలను ప్రజా సేవా ప్రకటనలు (పబ్లిక్ సర్వీస్ అనౌన్స్‌మెంట్స్) అని పిలుస్తోంది.




ఇక నియోజకవర్గాల పునర్విభజన విషయానికి వస్తే, నవంబర్ ఎన్నికలకు ముందు అదనపు హౌస్ సీట్లను ఆశిస్తూ, రిపబ్లికన్‌ల నియంత్రణలో ఉన్న రాష్ట్రా ల్లో కాంగ్రెస్ నియోజకవర్గాల పటా(మ్యాప్)లను పునర్విభజిస్తూ ట్రంప్ దశాబ్దం మధ్యలో ఒక అసాధారణ ప్రచారాన్ని ప్రారంభించారు. సాధారణంగా ప్రతి పదేళ్ల కు ఒకసారి జరిగే జనాభా లెక్కల తర్వాత నియోజకవర్గాల పునర్విభజన జరుగుతుంది. కానీ ఇప్పుడు టెక్సాస్, ఫ్లోరిడా, నార్త్ కరోలినా, ఒహాయో, టెన్నెస్సీ తో సహా తొమ్మిది రాష్ట్రాల్లో కొత్త మ్యాప్‌లను ఉపయోగిస్తున్నారు. ఈ కొత్త పటాలలో చాలా వరకు రిపబ్లికన్లకు అనుకూలంగా ఉన్నాయి, అయినప్పటికీ ఫలితం ఏకరీతిగా లేదు. పునర్విభజన జరిగిన కొన్ని జిల్లాల్లో తీవ్రమైన పోటీ కొనసాగుతోంది.

డెమోక్రాట్లు తమ నియంత్రణలో ఉన్న రాష్ట్రాల్లో నియోజకవర్గాలకు సంబంధించిన పునర్విభజన ప్రయత్నాలపై ప్రతిస్పందించారు. ఓటింగ్ నిబంధనలపై పోరాటం కూడా అంతే తీవ్రంగా ఉంది. ట్రంప్ ప్రభు త్వం పౌరసత్వం, ఓటరు గుర్తింపునకు సంబంధించి కొత్త నిబంధనలను విధించడానికి ప్రయత్నించింది, మెయిల్ బ్యాలెట్లపై మరింత ఫెడరల్ నియంత్రణను కోరింది. పౌరసత్వ నిబంధనలలోని అంశాలతో సహా కీలకమైన నిబంధనలను న్యాయస్థానాలు నిరోధించాయి లేదా పరిమితం చేశాయి. మరోవైపు, ఈ ఎన్నికల కోసం పోస్టల్ సర్వీస్ ద్వారా కొత్త మెయిల్‌బ్యాలెట్ నిబంధనలను విధించకుండా సుప్రీం కోర్టు ప్రభుత్వాన్ని అడ్డుకుంది.

సెప్టెంబర్ చివరిలో నిర్వహించిన ఒక ఏపీనార్క్ (APNORC) పోల్‌లో, జీవన వ్యయాన్ని ట్రంప్ నిర్వహించిన తీరును కేవలం 17% మంది అమెరికన్‌లు మాత్రమే ఆమోదించగా, ఆయన ఆర్థిక నిర్వహణను 26% మంది ఆమోదించారు. ట్రంప్ విధానాలు నిరంతర ద్రవ్యోల్బణానికి దోహదపడ్డాయని సుమారు 65% మంది చెప్పారు.

నిరుద్యోగం సుమారు 4.2% వద్దే ఉందని, అయితే నియామకాలు మందగించాయని, ద్రవ్యోల్బణం కారణం గా వేతనాల పెరుగుదల క్షీణించిందని, వాస్తవ వినియోగ ఆదాయ వృద్ధి బలహీనంగా ఉందని రాయిటర్స్ సోమవారం నివేదించింది.

యువ అమెరికన్ల విషయానికొస్తే, ఈ సమీకరణం మరింత సంక్లిష్టంగా ఉంది. ఆర్థిక వ్యవస్థ, ఉద్యోగాలు, సాంకేతికత, ట్రంప్ విస్తృత రాజకీయ సందేశంపై ప్రత్యక్ష విజ్ఞప్తుల ద్వారా యువ ఓటర్లను రిపబ్లికన్ కూటమిలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. కానీ యేల్ యూత్ పోల్, 35 ఏళ్లలోపు ఓటర్ల లో ట్రంప్‌పై గణనీయమైన వ్యతిరేకతను అంచనా వేసింది. వసంతకాలపు సర్వేలో 18–22 ఏళ్ల వయస్సు వారిలో 68%, 23–29 ఏళ్ల వయస్సు వారిలో 72% మంది ఈ వ్యతిరేకతను వ్యక్తం చేశారు.

కాబట్టి $5,000 డాలర్ల వాగ్దానం అనేది, సిద్ధాంతం కంటే ఆర్థిక ఆందోళనకే ఎక్కువ ప్రాధాన్యత ఉన్న రాజకీయ వాతావరణంలోకి ప్రవేశిస్తోంది. అందుకే నవంబర్ ఎన్నికలు ట్రంప్ కంటే కూడా మరింత మౌలిక అంశంపై రిఫరెండంగా మారవచ్చు. ప్రభుత్వం వాగ్దానాలు తమ సొంత జీవితాలలో మెరుగుదలలుగా పరిణమిస్తున్నాయని ఓటర్లు విశ్వసిస్తున్నారా లేదా అనేది ఆ రిఫరెండం తేలుస్తుంది. ఈ ఎన్నికలను ట్రంప్ స్పష్టంగా వ్యక్తిగత పోటీ తరహాలోకి మార్చేశారు. రిపబ్లికన్ ఓటర్లు కాంగ్రెస్ ఎన్నికలను మరో అధ్యక్ష ఎన్నికల పోటీగా పరిగణించాలనేదే ఆయన సందేశం. మరోవైపు, డెమోక్రాట్లు ఇదే పరిస్థితిని ఆయనకు వ్యతిరేకంగా మలచడానికి ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను, ఓటర్లు పరిపాలనను నియంత్రించగల సాధనంగా వారు చిత్రీకరిస్తున్నారు.

చివరిగా అడిగే ప్రశ్న చాలా పాతకాలం నాటిదిగా అనిపించవచ్చు. రాజకీయ ఆర్భాటం జీవన వ్యయాన్ని అధిగమించగలదా? నవంబర్ 3న అమెరికన్‌లు టెలివిజన్ ప్రకటనలు, అధ్యక్ష ఎన్నికల ర్యాలీలు లేదా ప్రచార వాగ్దానాలతో కాకుండా, బ్యాలెట్ పత్రాలతో సమాధానం ఇస్తారు. ట్రంప్ పదవీకాలంలోని చివరి రెండేళ్లు కాంగ్రెస్ సహకారంతో మొదలవుతాయా, లేక వైట్ హౌస్‌పై పెరుగుతున్న శక్తివంతమైన నియంత్రణ గా కాంగ్రెస్ వ్యవహరిస్తుందా అనేది ఆ ఫలితమే నిర్ణయిస్తుంది.

*(ఐపిఎ సర్వీస్)*

# భారత వ్యవసాయ రంగానికి సంకెళ్లు?

భారతీయ రైతు చమటోడ్చి పండించే ధాన్యంతో దేశ ప్రజలందరి కడుపు నిండుతోంది కానీ, ఆ పంటను పండించే రైతు కడుపు మాత్రం ఎప్పటికీ నిండడం లేదు. స్వతంత్ర భారతదేశ చరిత్రలో మన వ్యవసాయ రంగం రికార్డు స్థాయి దిగుబడులను సాధించిందని పాలకులంతా మేకతోలు కప్పుకుని సంకలు గుద్దుకోవడం చాలా సులువైన విషయమే. గోధుమలు, పాలు, పండ్లు, కూరగాయలు, మత్స్య ఉత్పత్తుల దిగుబడిలో మనం ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచామని సంఖ్యలు, గణాంకాలతో కాలం వెళ్లదీస్తున్నాం. కానీ, అనుభవజ్ఞుడైన మాజీ వ్యవసాయ కార్యదర్శి సంజయ్ అగర్వాల్ ఎత్తిచూపినట్లుగా— కేవలం ఆహార భద్రతను మాత్రమే సాధించిన ‘మొదటి విప్లవం’ గతాభిమానంగా మిగిలిపోగా, గ్రామీణ సమృద్ధిని అందించాల్సిన ‘రెండవ విప్లవం’ వైపు మన ఆర్థిక వ్యవస్థ అడుగులు వేయడంలో దారుణంగా విఫలమవుతోంది.

పొలంలో రైతు విత్తనం నాటిన దగ్గర నుండి పంట కోత, సేకరణ, నిల్వ, సరుకు రవాణా, సంస్కరణ (ప్రాసెసింగ్), విపణన (మార్కెటింగ్) వరకు సాగేది ఒక సుదీర్ఘమైన ‘విలువ గొలుసు’. కానీ, మన దేశంలో ఉన్న విచారకరమైన నిజమేమిటంటే, ఈ గొలుసులో రాత్రింబవళ్లు కష్టపడే రైతుకు చివరకు చేరేది అణా పైసలు మాత్రమే; మధ్యలో ఉన్న దళారులు, వ్యాపారులు, బడా పారిశ్రామికవేత్తలే ఏమాత్రం శ్రమ లేకుండా సింహభాగం లాభాలను గడిస్తున్నారు. మన బ్యాంకులు, ఆర్థిక వ్యవస్థలు కేవలం పంట ఉత్పత్తికి పరిమితమైన అల్పకాలిక రుణాలు ఇచ్చి తమ బాధ్యత తీరిపోయిందని చేతులు దులుపుకుంటున్నాయి తప్ప, మొత్తం విలువ గొలుసును బలోపేతం చేసేలా ఆర్థికంగా ఆదుకోవడానికి పైసా కూడా విదల్చడం లేదు.



పాడి పరిశ్రమ, కోళ్ల పెంపకం, మత్స్య రంగాలు సంవత్సరం పొడవునా తిరిగే నిరంతర అమ్మకాలు, కొనుగోళ్ల నగదు చక్రంతో కాస్తో కూస్తో నిలదొక్కుకోగలుగుతున్నాయి. కానీ కేవలం రుతుపవనాలపై ఆధారపడే పంటల పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. పంట కాలం వచ్చినప్పుడు ధాన్యాగారాలు, సంస్కరణ పరిశ్రమలు ముడిసరుకు కొనుగో లు చేయడానికి శత విధాలా ప్రయత్నిస్తాయి. ఉదాహరణకు, ఒక ఐదు వందల కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసే సంస్కరణ పరిశ్రమకు కేవలం సరుకు కొనుగోలు, నిల్వ నిర్వహణ కోసం ఆ తర్వాతి కాలంలో మూలధనంగానే మరో ఏడు వందల నుండి ఎనిమిది వందల కోట్ల రూపాయలు అత్యవసరమవుతాయి. సరిపడా మూలధన సదుపాయం సమయానికి అందక ఎంతో సమర్థవంతమైన పరిశ్రమలు కూడా మూతపడుతుంటే, మన ప్రభుత్వాలు, బ్యాంకింగ్ యంత్రాంగం కంటికి ఏమీ కనపడనట్లు, చెవిన ఏమీ పడన ట్లు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయి.

గత ఐదు దశాబ్దాలుగా బ్యాంకుల జాతీయాకరణ, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, సహకార వ్యవస్థలు, రైతు అప్పుల కార్డుల వంటివి తీసుకువచ్చామని వేదికలపై గొప్పలు ఊదరగొడుతున్నారు. ఇవన్నీ కేవలం పొలంలో దిగుబడి పెంచడానికి మాత్రమే ఉపయోగపడ్డాయి తప్ప, రైతు ఆర్థిక పరిస్థితిని మార్చలేకపోయాయి. పొలం నుంచి వినియోగదారుడి పళ్లెం వరకు ప్రయాణించే ప్రతి దశలో ఆర్థిక బలాన్నిచ్చే సమగ్ర నిధుల సమకూర్పు నిర్మాణం ఇప్పటికీ గాల్లోనే తేలుతోంది. నిల్వ రశీదుల ఆధారిత రుణాలు, వ్యవసాయ మౌలిక వసతుల నిధులు వచ్చాయని ఎంత ప్రచారం చేసుకున్నా, అవన్నీ అరకొర ప్రయత్నాలుగానే మిగిలిపోయాయి తప్ప గ్రామీణ ప్రాంతాల ఆర్థిక ముఖచిత్రాన్ని ఏమాత్రం మార్చలేకపోయాయి.

ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలు, చివరికి మన పొరుగున ఉన్న తూర్పు, ఆగ్నేయాసియా దేశాలు తమ వ్యవసాయ ఉత్పత్తులలో ముప్పై ఐదు శాతం నుండి అరవై శాతానికి పైగా సంస్కరిస్తున్నాయి (ప్రాసెసింగ్). కానీ నిరంతరం గొప్పలు చెప్పుకునే భారతదేశంలో ఈ శాతం కేవలం పది నుండి పన్నెండు శాతం వద్దే కొట్టుమిట్టాడుతోంది. ఇది మన దేశ పాలకులు, ఆర్థిక వ్యవస్థలు సిగ్గుతో తలదించుకోవాల్సిన విషయం కాదా?

మన వ్యవసాయ అనుబంధ రంగాల స్థూల మూలధన జోడింపు దాదాపు నలభై ఎనిమిది లక్షల ఎనిమిది వేల కోట్ల రూపాయలుగా ఉంటే, మన బ్యాంకింగ్ వ్యవస్థ అందిస్తున్న సంస్థాగత రుణాలు ఇరవై లక్షల కోట్ల రూపాయలు మాత్రమేనని లెక్కలు చెబుతున్నాయి. అంటే, ఇంకా పధ్నాలుగు లక్షల కోట్ల రూపాయలకు పైగా విలువ గొలుసు నిధుల సమకూర్పు అవకాశాలు వాడకం లేకుండా మూలపడి ఉన్నాయి. ఈ భారీ వ్యత్యాసాన్ని భర్తీ చేయడంలో మన బ్యాంకులు, ప్రభుత్వ ఆర్థిక సంస్థలు ఘోరంగా విఫలమవుతున్నాయి.

మన బ్యాంకింగ్ వ్యవస్థ ఇప్పటికీ పాతకాలపు మూస పూచీకత్తులు, భూమి కాగితాల కోసం మాత్రమే ఆరాటపడుతోంది తప్ప, పంట ఉత్పత్తుల సంస్కరణ, వ్యాపార ఆధారిత నగదు ప్రవాహ అంచనాల ప్రకారం రుణాలను ప్రోత్సహించడానికి ముందుకు రావడం లేదు. ఈ సంకుచిత ఆలోచనా ధోరణి, అధికారుల అలసత్వం మారనంత వరకు గ్రామీణ ప్రాంతాలకు భారీ స్థాయిలో వ్యాపార పెట్టుబడులు రావు, నూతన ఉపాధి అవకాశాలు అసలే రావు.

కేవలం నినాదాలతో, అర్థం లేని ప్రకటనలతో గ్రామీణ ప్రాంతాలు సుభిక్షం కావు. పంట పండించే రైతు నుండి కొనుగోలుదారులు, నిల్వ నిర్వాహకులు, ఎగుమతిదారుల వరకు అందరికీ సులభంగా రుణాలు, నష్ట భయ నివారణ మార్గాలు తక్షణమే అందుబాటులోకి రావాలి. సాంప్రదాయ పద్ధతులను పూర్తిగా పక్కనపెట్టి ‘విలువ గొలుసు నిధుల సమకూర్పు’ను ఒక ఉద్యమంలా అమలు చేయకపోతే, ప్రభుత్వం కలలు కంటున్న ‘వికసిత భారత్ 2047’ నినాదం కేవలం కాగితాలకే పరిమితమై, రైతుల ఆత్మహత్యలు, గ్రామీణ పేదరికం నిరంతరం కొనసాగుతూనే ఉంటాయి.

వెంకగారి భూమయ్య, 9848559863

# సింగరేణి కార్మికులకు లాభాల వాటా

# ఒక్కొక్కరికి రూ.1,53,912 బోనస్

## 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి

- 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్
- సింగరేణి భవిష్యత్తు కోసం కొత్త బొగ్గు బ్లాకులు
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- సింగరేణిని భ్రష్టు పట్టించిన బిఆర్‌ఎస్.. ఇప్పుడు పోరుబాట హాస్యాస్పదం : మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** సింగరేణి బొగ్గు గని కార్మికులకు దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు లాభాల వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 బోనస్ చెల్లించనున్నామని, మొత్తం 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఈ నిర్ణయంతో ప్రయోజనం పొందనున్నారని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తూ గతంలో మాదిరిగానే 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున దసరా బోనస్ చెల్లించనున్నట్లు వివరించారు. ప్రజాభవన్‌లో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుతో పాటు సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలు, సింగరేణి అధికారులు పాల్గొన్నారు. డిప్యూటీ సిఎం మాట్లాడుతూ గతంలో ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా సింగరేణి లాభాల్లో 34 శాతాన్ని కార్మికులకు లాభాల వాటాగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. ఈ ఏడాది సింగరేణి ఆర్జించిన రూ.1754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం అంటే రూ.596 కోట్లను లాభాల వాటాగా కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

**ఉద్యోగ, కార్మికులకు సొంతింటి కల సాకారం**

"సింగరేణి ఉద్యోగులు, కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం. కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయం చేస్తాం. సింగరేణి కార్మికులకు సొంత ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో ఇప్పటి వరకు మైనింగ్ చేపట్టని ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఇళ్ల నిర్మాణానికి అనువైన లేఅవుట్లు సిద్ధం చేయాలి. మిశ్రమ ఆర్థిక విధానాలను ప్రోత్సహించి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించిన భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరిట నెహ్రూ హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించాం. సింగరేణి నుంచి రెవెన్యూ శాఖకు తిరిగి అప్పగించిన 5,774 ఎకరాల భూముల్లో 4,500 ఎకరాలను గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కీ.శే.ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్.రాజశేఖర్ రెడ్డి పేదలకు పట్టాల రూపంలో అందించారు. మిగిలిన సుమారు 1,250 ఎకరాలకు సంబంధించి జీఓ నంబర్ 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలి" అని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించామని వివరించారు. సింగరేణిలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఆర్డర్లు, ఇతర చట్టపరమైన ప్రక్రియలను రానున్న 15 రోజుల్లో పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించినట్టు తెలిపారు. కార్మికుల పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 136 నుంచి గరిష్టంగా 170 మంది సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించామని, ఇందుకోసం ఏర్పాటు చేసిన సింగరేణి అధికారుల కమిటీ సిఫార్సుల ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా నిర్ణీత రోజున మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. వివిధ ఆసుపత్రుల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి, వీలైనంత ఎక్కువ మంది కార్మికులకు ప్రయోజనం కలిగేలా మెడికల్ ఇన్‌వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాలతో విధులకు హాజరుకాక ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు వన్‌టైమ్ ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సింగరేణి ఉద్యోగులకు ఆదాయపన్నును కూడా సంస్థ తరఫున ప్రభుత్వానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు డిప్యూటీ సిఎం వెల్లడించారు. సింగరేణి అధికారులు, జిల్లా కలెక్టర్‌తో కూడిన కమిటీ ఆక్రమిత నివాస ప్రాంతాల్లో నివసిస్తున్న వారి ప్రాథమిక జాబితాను సిద్ధం చేస్తుందన్నారు. స్థానిక ఎమ్మెల్యేలతో సంప్రదించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అర్హులైన లబ్ధిదారుల సమగ్ర జాబితాను రూపొందిస్తామని, ఈ ప్రక్రియను నెల రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

**సింగరేణి లాభాలు తగ్గడానికి కారణాలివే...**

గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది సింగరేణి లాభాలు తగ్గడానికి గత పదేళ్లలో కొత్త బొగ్గు బ్లాక్‌లను అదనంగా సాధించడంలో అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని, కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన బొగ్గు బ్లాక్‌ల వేలంలో సింగరేణి పాల్గొనకుండా చేయడం వల్ల సంస్థకు తీవ్ర నష్టం వాటిల్లిందని డిప్యూటీ సిఎం వివరించారు. సుమారు 141 బొగ్గు బ్లాక్‌ల వేలం ప్రక్రియలో సింగరేణి పాల్గొనే అవకాశాన్ని వినియోగించుకోలేదని, దీంతో సంస్థ వ్యాపార విస్తరణకు ఆటంకం ఏర్పడిందని, మరోవైపు ఇప్పటికే ఉన్న బొగ్గు బ్లాక్లలో కొన్ని మూతపడుతుండటంతో ఉత్పత్తి, ఆదాయంపై ప్రభావం పడుతోందన్నారు.

**కొత్త బ్లాక్‌ల సాధనకు ప్రభుత్వం చర్యలు**

సింగరేణి సంస్థను బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త బ్లాక్‌ల సాధనతో పాటు సంస్థ వ్యాపారాన్ని విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు. ఏ మైనింగ్ సంస్థ అయినా నిరంతరం కొత్త బ్లాక్‌లను సాధిస్తూ వ్యాపారాన్ని విస్తరించుకుంటేనే దాని ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల భవిష్యత్తు, సంస్థ మనుగడ, బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం పెంపు దృష్ట్యా ఈ చర్యలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు.

**విద్యుత్ సంస్థల బకాయిల చెల్లింపునకు చర్యలు**

సింగరేణికి విద్యుత్ సంస్థల నుంచి గత పదేళ్లలో సుమారు రూ.29 వేల కోట్ల బకాయిలు పేరుకుపోగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూడేళ్లలో సుమారు రూ.27 వేల కోట్ల బకాయిలు ఉన్నట్లు డిప్యూటీ సిఎం వివరించారు.

**ఇప్పుడు పోరుబాట హాస్యాస్పదం: మంత్రి శ్రీధర్‌బాబు**

సింగరేణి సంస్థను పదేళ్ల పాటు అధికారంలో ఉండి నిర్వీర్యం చేసి, భ్రష్టు పట్టించిన బిఆర్‌ఎస్ ఇప్పుడు పోరుబాట పేరుతో ఆందోళనలకు పిలుపునివ్వడం హాస్యాస్పదంగా ఉందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎద్దేవా చేశారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి పరిష్కరించలేని సమస్యలను ప్రతిపక్షంలో ఉండి ఎలా పరిష్కరిస్తారో మాజీ మంత్రి హరీష్‌రావు సమాధానం చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు.

## ఈ ఏడాది ఒక్క శాతం కూడా పెరగలేదు

### గత ఏడాది 34 శాతానికే పరిమితం చేయడంపై యూనియన్ నేతల ఆగ్రహం

సింగరేణి కార్మికులకు ఈ ఏడాది ఒక్క శాతం కూడా అదనపు బోనస్ ఇవ్వకపోవడం దుర్మార్గమని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. లాభాల పంపిణీ, బోనస్ ప్రకటనలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది ప్రకటించిన 34 శాతం బోనస్‌నే ఈ ఏడాది కూడ ఏకపక్షంగా ప్రకటించి కార్మికులకు ద్రోహం చేసిందన్నారు. గుర్తింపు యూనియన్ సమక్షంలో లాభాలు, బోనస్‌పై ప్రకటన చేయాల్సి ఉండగా, కొన్ని సంఘాలు కోర్టును ఆశ్రయించాయనే కారణంతో తమను పిలువలేదన్నారు. అయితే సింగరేణి ప్రాంత ఎమ్మెల్యేలను సమావేశానికి ఆహ్వానించిన ప్రభుత్వం, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును ఎందుకు పిలవలేదని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో ప్రభుత్వ దురుద్దేశం స్పష్టమవుతోందని పేర్కొన్నారు.



## రాష్ట్ర రహదారులను అప్‌గ్రేడ్ చేయండి

### కేంద్ర మంత్రి గడ్కరీకి మంత్రులు కోమటిరెడ్డి, జూపల్లి వినతి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలోని రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేసి, రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సుమారు 225 కిలోమీటర్ల మేర ప్రతిపాదించిన పుల్లూరు-ఆలంపూర్-కొల్లాపూర్-అచ్చంపేట-డిండి-దేవరకొండ-నల్గొండ రహదారి మార్గాన్ని జాతీయ రహదారిగా అభివృద్ధి చేయాలని కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఢిల్లీలో గడ్కరీతో భేటీ అయిన మంత్రులు రాష్ట్రానికి అవసరమైన కీలక రహదారులు, వంతెనలు, ఎలివేటెడ్ కారిడార్లు, రోప్‌వేల నిర్మాణంపై చర్చించారు. కృష్ణా నదిపై నిర్మించనున్న ఐకానిక్ వంతెన శంకుస్థాపన కార్యక్రమానికి రావాలని గడ్కరీని ఆహ్వానించగా, ఆయన అంగీకరించినట్లు తెలిపారు.పుల్లూరు (ఎన్‌హెచ్44) నుంచి ఆలంపూర్, జటప్రోలు, పెంట్లవెల్లి, కొల్లాపూర్, లింగాల, అచ్చంపేట, డిండి (ఎన్‌హెచ్765), దేవరకొండ (ఎన్‌హెచ్167), మల్లేపల్లి మీదుగా నల్గొండ (ఎన్‌హెచ్565) వరకు ఉన్న మార్గాన్ని జాతీయ రహదారిగా అప్‌గ్రేడ్ చేయాలని మంత్రులు కోరారు. ఈ రహదారి అభివృద్ధితో ప్రయాణ సమయం, రవాణా ఖర్చులు తగ్గడంతోపాటు వ్యవసాయ ఉత్పత్తుల రవాణా, వాణిజ్య కార్యకలాపాలు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఊతం లభిస్తుందని వివరించారు. విద్య, వైద్య సేవలు ప్రజలకు మరింత చేరువ కావడంతోపాటు పర్యాటక ప్రాంతాలకు రాకపోకలు పెరుగుతాయని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనపై గడ్కరీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

**కృష్ణా నదిపై ఐకానిక్ బ్రిడ్జి :** జాతీయ రహదారి 167కెపై కృష్ణా నదిపై హైబ్రిడ్ కేబుల్‌స్టేయిడ్, సస్పెన్షన్ తరహాలో నిర్మించనున్న ఐకానిక్ వంతెన శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రులు గడ్కరీని ఆహ్వానించారు. ఈ వంతెన నిర్మాణంతో హైదరాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే ప్రయాణంలో సుమారు 80 కిలోమీటర్ల దూరం, మూడు గంటల సమయం తగ్గుతుందని వివరించారు. కృష్ణా నది, శ్రీశైలం జలాశయ బ్యాక్‌వాటర్స్, నల్లమల అటవీ ప్రాంతం మధ్య ఉన్న సోమశిలను ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఈ వంతెన దోహదపడుతుందని తెలిపారు. రవాణా సౌకర్యాలు మెరుగుపడితే పర్యాటకుల రాక పెరగడంతోపాటు బోటింగ్, హోటళ్లు, రవాణా, ఆతిథ్య రంగాల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు విస్తరిస్తాయని పేర్కొన్నారు. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి 765పై ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించి మంత్రులు చేసిన విజ్ఞప్తిపై గడ్కరీ సానుకూలంగా స్పందించారు. డిపిఆర్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎంపి మల్లు రవి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు పాల్గొన్నారు.





## సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
ఎస్‌డబ్ల్యూఎం, కుత్బుల్లాపూర్ జోన్, సిఎంసి.

| NIT No & Date | పని పేరు | అంచనా విలువ | ప్రారంభ తేదీ & సమయం | బిడ్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం | టెండర్ ఆహ్వానించు అథారిటీ వివరాలు |
|---|---|---|---|---|---|
| 11/DB/EE/SWM/CMC/2026-27, dt: 13.10.2026 | జవహర్‌నగర్‌కు చెత్త రవాణా (2 పనులు) | రూ. 42.00 లక్షలు | 14.10.2026 మ.1:00 గం.లకు | 17.10.2026 మ.1:00 గం.ల వరకు | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సెల్ నెం. 9989930549. హెడ్ డ్రాఫ్ట్స్‌మెన్, సెల్ నెం. 8712034411 |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ www.tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎస్‌డబ్ల్యూఎం, కుత్బుల్లాపూర్ జోన్, సిఎంసి.
DIPR R.O. No. : 11820-PP/CL/ADVT/2026-27, Date: 13-10-2026

## ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II కార్యాలయం, ఖైరతాబాద్ జోన్, హైదరాబాద్
No. 09/EE-II/Circle-38/Khairatabad Zone/GHMC/2026-27 Dt: 09.10.2026

| NIT No. | పని పేరు | అంచనా విలువ / ఇసివి | బిడ్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా |
|---|---|---|---|---|
| 10/EE-II/CIRCLE-38/KZ/GHMC/2026-27 | సివిల్ పనులు (01 నెం.లు) | రూ. 2.00 లక్షలు | క్ర.సం.01 కొరకు పనులు 14.10.2026 మ.12.00గం.ల నుండి 15.10.2026 మ.2.00 గం.ల వరకు మాత్రమే | ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, కెజెడ్, జిహెచ్ఎంసి. |

మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు. ఇ-మెయిల్ అడ్రస్: eec38.yousufguda@gmail.com, మొబైల్ నెం. 7331189501
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-II, ఖైరతాబాద్ జోన్, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 11843-PP/CL/ADVT/2026-27, Date: 13-10-2026

తెలంగాణ ప్రభుత్వం
## మున్సిపల్ కమిషనర్ : నకిరేకల్
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ నోటీసు (షార్ట్ టెండర్ నోటీసు 1వ పిలుపు)
Tender Notice No. Lr.No. E1/1889/Nakrekal/1No./Tender/2026 Dt: 13.10.2026

| క్ర.సం. | పని పేరు | అంచనా విలువ |
|---|---|---|
| 1 | దసరా పండుగ దృష్ట్యా బతుకమ్మ మరియు దసరా ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని, జమ్మితో సహా 9వ మరియు 11వ రోజులకు 2 రోజుల పాటు 150W LED ఫ్లడ్ లైట్లను అద్దెకు తీసుకోవడం, నల్లగొండ జిల్లాలోని నకిరేకల్ మున్సిపాలిటీలోని అన్ని వార్డులలో భక్తులు మరియు ప్రజల కోసం బారికేడింగ్ చేయడం, స్థల చదును చేయడం వంటి ఏర్పాట్లు 15వ ఆర్థిక సంవత్సరం గ్రాంట్లు/MGF/PP మరియు ఇతర గ్రాంట్ల కింద చేపట్టడం. | రూ. 2.50 లక్షలు |

పై పనికి సంబంధించిన టెండర్ షెడ్యూల్ తేదీలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

| | |
|---|---|
| షెడ్యూల్ విక్రయం ప్రారంభ తేది | 14.10.2026 ఉ.11.00గం.లకు |
| షెడ్యూల్ విక్రయం ఆఖరి తేది | 17.10.2026 ఉ.11.00గం.ల వరకు |

మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా "www.eprocurement.gov.in" లో చూడవచ్చు. బిడ్లను ఆహ్వానించే అధికారి: మున్సిపల్ కమిషనర్, నకిరేకల్ మున్సిపాలిటీ.
సం/- కమిషనర్, నకిరేకల్ మున్సిపాలిటీ.
DIPR R.O. No. : 11813-PP/CL/ADVT/2026-27, Date: 13-10-2026

## జిల్లా అదనపు కలెక్టర్( రెవెన్యూ) మరియు చైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ, వనపర్తి జిల్లా.
టెండర్ ప్రకటన

వనపర్తి జిల్లాలోని (21) PMSHRI విద్యాలయాలకు Sports Equipment కొనుగోలు మరియు సరఫరా చేయుటకు 2026-27 సంవత్సరము కొరకై టెండరు దారుల నుండి సీలు వేసిన టెండర్లు కోరబడుచున్నవి. ఇందుకు సంబంధించిన టెండరు దరఖాస్తు ఫారములు, జిల్లా విద్య శాఖా అధికారి, సమగ్ర శిక్ష, వనపర్తి వారి కార్యాలయములో అన్ని పనిదినములయందు ఉదయము.11.00 నుండి సాయంత్రము 4.00 గంటల వరకు తేది. 13.10.2026 నుండి 16.10.2026 వరకు పొందవచ్చును. దిగువ పేర్కొనబడిన వాటిని సరఫరా చేయుటకు గాను సీలు వేసిన టెండర్లు వేరు వేరుగా కోరబడుచున్నవి.

| S No. | Tender | Tender form cost | EMD for each School, (Returnable) | DD should be in the Favour of | Sale of Tender forms Starting / Ending Dates | Tender Box Closing Date / Time | Opening of Tender Date / Time |
|---|---|---|---|---|---|---|---|
| 1 | Sports Equipment | 5000/- | 60000/- | District Collector & Chairman, SS, Wanaparthy | తేది: 13.10.2026 నుండి 16.10.2026 మధ్యాహ్నం 4.00 గం.ల వరకు | తేది: 16.10.2026 సాయంత్రం 6.00 గం.ల వరకు | తేది: 17.10.2026 ఉదయం 03.00 IDOC, కలెక్టరేట్ కార్యాలయం, వనపర్తి |

(గౌరవనీయులు అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మరియు చైర్‌పర్సన్ డి.పి.సి వనపర్తి జిల్లా గారి ఆమోదముతో )
సం/- జిల్లా విద్యాశాఖాధికారి మరియు ఎక్స్ అఫీసియో జిల్లా ప్రాజెక్ట్ అధికారి, ఎస్.ఎస్., వనపర్తి జిల్లా.
DIPR R.O. No. : 11853-PP/CL/ADVT/2026-27, Date: 13-10-2026


చినిగిపోని.. తడిసినా

# చెడిపోని 'మీ సేవ' సర్టిఫికెట్లు!

### 'ప్రజాభవన్'లో కొత్త పేపర్‌ను ప్రారంభించిన ఐటి మంత్రి శ్రీధర్‌బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ ధ్రువపత్రాలను భద్రంగా దాచుకోవాలంటే ఇకపై లామినేషన్ చేయించాల్సిన అవసరం తగ్గనుంది. ఏళ్ల తరబడి భద్రపరచాల్సిన మీ సేవ సర్టిఫికెట్లు చినిగిపోకుండా, నీళ్లు పడినా త్వరగా దెబ్బతినకుండా తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక సెక్యూరిటీ పేపర్‌ను అందుబాటులోకి తెచ్చింది. నకిలీ ధ్రువపత్రాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు సర్టిఫికెట్ల మన్నికను పెంచే లక్ష్యంతో రూపొందించిన ఈ నూతన పేపర్‌ను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ప్రారంభించారు.కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన 15 భద్రతా ఫీచర్లను పొందుపరిచారు. ధ్రువపత్రాల నకిలీ తయారీని, అనధికార నకళ్లను నిరోధించేలా వీటిని రూపొందించారు. భద్రతా కారణాల దృష్ట్యా ఈ ఫీచర్లకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారులు వెల్లడించలేదు. ప్రత్యేకంగా తయారు చేసిన ఈ పేపర్ సాధారణ కాగితాల మాదిరిగా సులభంగా చినిగిపోదు. నీళ్లు పడినా త్వరగా పాడవకుండా, మడతలు పడటం, రోజువారీ వినియోగం వల్ల కలిగే నష్టాన్ని తగ్గించేలా రూపొందించారు. దీంతో జనన, మరణ ధ్రువపత్రాలు, విద్యా ధ్రువపత్రాలు, ఉద్యోగాలకు సంబంధించిన పత్రాలు తదితరాలను దీర్ఘకాలం భద్రంగా ఉంచుకోవచ్చు. సాధారణ పరిస్థితుల్లో వీటికి లామినేషన్ చేయించాల్సిన అవసరం కూడా తగ్గనుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. జనన, మరణ ధ్రువపత్రాలతోపాటు విద్య, ఉద్యోగ, ఇతర అధికారిక అవసరాలకు ఉపయోగించే ప్రభుత్వ పత్రాలు ప్రజల జీవితాల్లో ఎంతో కీలకమైనవని పేర్కొన్నారు. కొన్ని ధ్రువపత్రాలను జీవితాంతం భద్రపరచుకోవాల్సిన అవసరం ఉంటుందని, అలాంటి పత్రాలు త్వరగా పాడవకుండా చూడటంతోపాటు వాటి విశ్వసనీయతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజలకు అందించే సేవల్లో నాణ్యత, భద్రత, సౌలభ్యాన్ని పెంచేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని తెలిపారు. కొత్త సెక్యూరిటీ పేపర్‌తో ధ్రువపత్రాల మన్నిక పెరగడమే కాకుండా నకిలీలను అరికట్టేందుకు కూడా దోహదపడుతుందని, ప్రభుత్వ పత్రాలపై ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు.తెలంగాణలో మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు వివిధ ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. 2011 నుంచి మీ సేవ సర్టిఫికెట్ల ముద్రణకు ప్రత్యేక సెక్యూరిటీ పేపర్‌ను వినియోగిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న పేపర్‌కు బదులుగా మరింత నాణ్యత, భద్రత, మన్నిక కలిగిన నూతన పేపర్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ముఖ్యంగా దీర్ఘకాలం భద్రపరచాల్సిన జనన, మరణ ధ్రువపత్రాలు, ఇతర అధికారిక పత్రాల విషయంలో ఈ కొత్త విధానం ప్రజలకు ఉపయోగకరంగా మారనుంది.ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజ్ ఠాకూర్, విజయ రమణా రావు, ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్ టి. రవికిరణ్, సంబంధిత అధికారులు, ప్రింటింగ్ ఏజెన్సీలు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.









# ఆధార్ సేవలు వేగవంతం

## రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : జిల్లాలోని ప్రజలందరికీ ఆధార్ సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని,ఇందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ఆదేశించారు.మంగళవారం తన ఛాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో అన్ని వయసుల వారి ఆధార్ నమోదు శాతాన్ని పెంచడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని,జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఆధార్ జనరేషన్ ప్రక్రియ వేగాన్ని పెంచాలని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు.5 సంవత్సరాలు , 15 సంవత్సరాల వయస్సు పూర్తి చేసుకున్న పిల్లలకు ఉచితంగా నిర్వహించే తప్పనిసరి బయోమెట్రిక్ అప్‌డేట్ ప్రక్రియపై విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ కిట్ల స్థితిగతులను, వాటి పనితీరును ఆధార్ అసిస్టెంట్ మేనేజర్ సమీక్షించారు.సాంకేతిక సమస్యలు ఉన్న కిట్లను వెంటనే బాగు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి రమేష్,జిల్లా విద్యాశాఖాధికారి సుసింధర్ రావు,జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి దస్రు నాయక్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ రాహుల్, పోస్టల్ సూపరింటెండెంట్,లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రామిక్, ఈడిస్ట్రిక్ట్ మేనేజర్ దుర్గా రావు,ఆధార్ అసిస్టెంట్ మేనేజర్ శ్రవణ్, మీసేవ ఏవో రాజశేఖర్,మీసేవ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ శేఖర్ రెడ్డి, సీఎస్సీ డీఎం ముక్కురామ్ హాజరయ్యారు.



## సిపిఐ సీనియర్ నాయకుడు ప్రకాష్‌కు మాతృవియోగం

### జయమ్మకు పల్లా వెంకట్‌రెడ్డి,నెల్లికంటి సత్యం నివాళి

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల పరిధిలోని పసునూరు గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకుడు ప్రకాష్ తల్లి జయమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి,జిల్లా కార్యదర్శి,ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,మునుగోడు ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు పసునూరు గ్రామానికి చేరుకుని జయమ్మ పార్థివదేహాన్ని సందర్శించారు.ఆమె భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ప్రకాష్‌తో పాటు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి,జయమ్మ మృతిపట్ల ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశారు.ఈ కష్ట సమయంలో కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని కోరుతూ వారికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.అంజయ్యచారి,మండల కార్యదర్శి సుదనబోయిన రమేష్, సహాయ కార్యదర్శి నేతాళ్ల రాజు, సీనియర్ నాయకులు బాబురావు, మండల కార్యవర్గ సభ్యులు ఊరుపాక వెంకటయ్య,ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి చెన్నోజు వెంకటాచారి, వడ్డేపల్లి ఉపసర్పంచ్ బుషిపాక యాదయ్య,పల్లేటి దశరథ పాల్గొన్నారు.

## ప్రజలకు సమర్థవంతమైన పోలీసు సేవలు

### సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట** : ప్రజలకు సమర్థవంతమైన పోలీసు సేవలు అందించాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన నెలవారీ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల్లో పోలీసు అధికారులు తీసుకున్న ప్రత్యేక చొరవతో పురోగతి సాధించడం అభినందనీయమన్నారు. కేసుల పరిష్కారానికి న్యాయమూర్తులను స్వయంగా కలువాలని సూచించారు. ఫోక్సో యాక్ట్ కేసుల్లో వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. దొంగతనాల నివారణ రాత్రిపూట పెట్రోలింగ్ వ్యవస్థ, నిఘా వ్యవస్థలను పటిష్ట పరుచాలన్నారు. పండుగ వేళల్లో ప్రజలను చైతన్యం చేసి దొంగతనాల నివారణకు కృషి చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. దసరా పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకునేలా చూడాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో పోలీసు సిబ్బంది కనపర్చిన ప్రతిభను గుర్తించి ప్రశంసాలు, ప్రోత్సాహకాలు అందించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్‌పి రవీందర్ రెడ్డి, డిఎస్‌పిలు ప్రసన్న కుమార్, రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ మగ్దూమ్ అలీ, సైబర్ సెక్యూరిటి ఇన్‌స్పెక్టర్ శివకుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు వెంకటయ్య, నాగేశ్వరరావు, రాజశేఖర్‌తో పాటు ఐటి కోర్, భరోసా టీం ఎస్‌ఐలు పాల్గొన్నారు.

## గీత సొసైటీల అభివృద్ధికి ప్రభుత్వం రూ.1000 కోట్ల నిధి కేటాయించాలి

### సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నిరంజన్ గౌడ్ ప్రభుత్వానికి డిమాండ్




**ప్రజాపక్షం/మర్రిగూడ** :అర్హులైన గీత కార్మికులకు వెంటనే లైసెన్సులు, గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని గీత పనివారల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఎరుకలి నిరంజన్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సిపిఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గీత సొసైటీల అభివృద్ధికి ప్రభుత్వం రూ.1000 కోట్ల నిధిని కేటాయించాలని కోరారు.గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. మండల గౌరవ అధ్యక్షుడు మాద సత్యం మాట్లాడుతూ గీత కార్మికులకు ఇస్తున్న పెన్షన్ ను రూ. 5 వేలకు పెంచాలని,ప్రమాద బీమా ప్రీమియం బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వృత్తిలో ప్రమాదాల నివారణకు కార్మికులందరికీ సేఫ్టీ కిట్లు అందించాలని కోరారు. సిపిఐ మండల కన్వీనర్ బుర్ర శేఖర్ మాట్లాడుతూ ఎలాంటి షరతులు లేకుండా అర్హులైన గీత కార్మికులందరికీ పెన్షన్ మంజూరు చేయాలని,ఎన్నికల సందర్భంగా గీత కార్మికులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోకపోతే ఆందోళనకు దిగుతామని వారు హెచ్చరించారు.

## కోర్టు విచారణకు గైర్హాజరు.. నిందితుడికి రిమాండ్

**ప్రజాపక్షం/దేవరకొండ:** కోర్టు విచారణకు వరుసగా గైర్హాజరు అవుతూ చట్టం నుండి తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని దేవరకొండ ఎక్సైజ్ పోలీసులు మంగళవారం అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా గుండ్లపల్లి మండలం కుందేలుబాయి తండాకు చెందిన కాట్రావత్ బాలుపై 2021లో దేవరకొండ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో గుడుంబా తయారీకి సంబంధించి కేసు నమోదయింది. ఈ కేసుకు సంబంధించి కోర్టులో నిందితుడి విచారణ పూర్తయి, తుది వాదనలు , తీర్పు ఇచ్చే దశకు చేరుకున్న తరుణంలో శిక్షణ పడుతుందన్న భయంతో నిందితుడు కోర్టు వాయిదాలకు రాకుండా ఉద్దేశ్య పూర్వకంగా వరుసగా 10 వాయిదాలకు గైర్హాజరై పరారయ్యాడు. దీనిని తీవ్రంగా పరిగణించిన దేవరకొండ అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు నిందితుడిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. కోర్టు ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన ఎక్సైజ్ ప్రత్యేక బృందం మంగళవారం నిందితుడు కాట్రావత్ బాలును పట్టుకొని అరెస్టు చేసింది. అరెస్టు సమయంలో నిందితుడి వద్ద అక్రమ మద్యం తయారీ కోసం నిల్వ ఉంచిన నల్ల బెల్లాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని దేవరకొండ కోర్టులో హాజరుపరుచగా న్యాయమూర్తి నిందితునికి 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ (జైలు శిక్ష) విధించనట్లు ఎక్సైజ్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ ఒక ప్రకటనలో తెలిపారు.



## నిత్యం 'తాళం'తో విద్యుత్ కార్యాలయం!

### అందుబాటులో లేని అధికారులు



**ప్రజాపక్షం/నందికొండ** : ప్రజలకు విద్యుత్ సేవలు అందించాల్సిన కార్యాలయమే నిత్యం తాళం వేసి ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.నాగార్జున సాగర్ లోని టీజీఎస్పీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజినీర్ (ఆపరేషన్) కార్యాలయం ఎప్పుడు చూసినా మూసివేసి ఉంటోందని స్థానికులు వాపోతున్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినా,కరెంటు సమస్యలు తలెత్తినా ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది.కార్యాలయం ఉన్నా సంబంధిత అధికారి అందుబాటులో లేకపోవడంతో సమస్యల పరిష్కారం కోసం ఎవరిని సంప్రదించాలో అర్థంకాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ శాఖ కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు సమస్యలు తలెత్తినప్పుడు పరిష్కరించేందుకు అధికారి అందుబాటులో ఉండటం ఎంతో అవసరమని,ఇక్కడ పరిస్థితి భిన్నంగా ఉందని స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కార్యాలయాన్ని నిత్యం తాళం వేసి ఉంచకుండా అధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఫిర్యాదుల కోసం అధికారి పేరు,ఫోన్ నంబర్‌ను కార్యాలయం వద్ద స్పష్టంగా ప్రదర్శించాలని,ప్రజలకు సకాలంలో సేవలు అందేలా ఉన్నతాధికారులు స్పందించాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల కొరడా

### ఐదు ట్రాక్టర్ల పట్టివేత..కేసులు నమోదు: ఎస్ఐ శోభన్‌బాబు

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని కొరటికల్ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. నల్లగొండ మండలం నర్సింగ్‌బట్ల గ్రామానికి చెందిన ఐదు ట్రాక్టర్లలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు నమ్మదగిన సమాచారం అందడంతో పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు.ఈక్రమంలో ఇసుకను తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై ఐదు ట్రాక్టర్లకు సంబంధించి కేసులు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ఐ శోభన్‌బాబు తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వాగు లు, చెరువుల నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శోభన్‌బాబు హెచ్చరించారు.అక్రమ ఇసుక రవాణాకు పాల్పడే వాహనాలపై నిఘా కొనసాగుతుందని,నిబంధనలు ఉల్లంఘించే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.ఇసుక అక్రమ రవాణా గురిం చి సమాచారం తెలిసిన వారు పోలీసులకు తెలియజేయాలని ఆయన సూచించారు.

# రిజర్వేషన్లలో దేశవ్యాప్తంగా బిసిలకు అన్యాయం

### రాజ్యసభ సభ్యులు,బిసి సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

### చౌటుప్పల్‌లో జ్యోతిరావుపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాల ఆవిష్కరణ



**ప్రజాపక్షం/చౌటుప్పల్** : బిసి ఉద్యమం బలంగా ఉన్న తెలుగు రాష్ట్రాలతో పాటు దేశ వ్యాప్తంగా బిసిలకు రిజర్వేషన్లు కల్పించడంలో అన్యాయమే జరుగుతుందని బిసి సంఘం జాతీయ అధ్యక్షులు,రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఆరోపించారు.యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో విద్యుత్ డివిజన్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన జ్యోతిరావుపూలే,సావిత్రిబాయి పూలే విగ్రహలను మంగళవారం ఆవిష్కరించారు.అనంతరం దామెర గ్రామ పరిధిలోని బాలాజీ పంక్షన్‌హాల్‌లో విద్యుత్ శాఖలో పని చేసే బిసి అధికారులు,సిబ్బందితో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలో బిసి గణన జరిగిన కూడా రాజకీయ,ఉద్యోగ అవకాశాల్లో బిసిలకు వాటా ప్రకారంగా కేటాయించాల్సి రిజర్వేషన్లలో అన్యాయం జరుగుతుందని అన్నారు.బిసి ఉద్యోగులకు క్రిమిలేయర్ పెట్టి ఉద్యోగ అవకాశాలను ప్రభుత్వం దెబ్బతీస్తుందని విమర్శించారు.దేశ వ్యాప్తంగా 56శాతం ఓబిసి జనాభా ఉంటే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల్లో కేవలం 6 శాతం బిసిలు ఉన్నారని,బిసిలకు రిజర్వేషన్లు ఏ విధంగా అమలు అవుతున్నాయో ఇదే నిదర్శనమని తెలిపారు. దేశ వ్యాప్తంగా బిసి ఉద్యమాన్ని బలోపేతం చేస్తామని తెలిపారు. బిసి ప్రధానిగా ఉన్నప్పుడే పార్లమెంట్‌లో బిసి రిజర్వేషన్ బిల్లు తీసుకురావాలని కోరారు.బిసిలంతా ఐక్యంగా ఉండి పోరాడితేనే సమస్యలు పరిష్కారం అవుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కంపెనీ అధ్యక్షులు పి.యాదగిరి,కార్యదర్శి బొబ్బిలి మురళి, యాదాద్రి ఎస్ఈ కందాల సురేష్‌కుమార్,ఆపరేషన్ చౌటుప్పల్ డిఈ మల్లికార్జున్ గౌడ్,భువనగిరి డిఈ సంఘం వెంకటేశ్వర్లు,చౌటుప్పల్ ఏడిఈ మర్రి పద్మ,ఏఈ రాజుల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండలో ఫైవ్ స్టార్ హోటళ్లకు స్థలాల గుర్తింపు

### అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : జిల్లాలో ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల వద్ద ఫైవ్ స్టార్ హోటళ్ల నిర్మాణానికి స్థలాలను గుర్తించినట్లు స్థానిక సంస్థల ఇన్ చార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ కు తెలిపారు.మంగళవారం రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ హైదరాబాద్ నుండి బతుకమ్మ సంబరాలు,పర్యాటక శాఖ కార్యక్రమాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, పర్యాటక, ఇతర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో టూరిజం హోటళ్ల నిర్మాణానికి బుద్ధవనం, దేవరకొండ కోట,వైజాగ్ కాలనీ, ఛాయా సోమేశ్వర ఆలయం తదితర 5 ప్రాంతాల్లో స్థలాలను గుర్తించామని,త్వరలోనే డీపీఆర్ సమర్పిస్తామని తెలిపారు.వైజాగ్ కాలనీలో రూ. 5 కోట్లతో రిసార్ట్ తో పాటు వాటర్ స్పోర్ట్స్ ఏర్పాటు చేసే ఆలోచన ఉందని,దేవరకొండ కోట, ఛాయా సోమేశ్వర ఆలయాలను పర్యాటకంగా అభివృద్ధి చేసే అవకాశాలు ఉన్నాయని వివరించారు.అంతకుముందు వాణి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహిం చాలని, ఈ నెల 18న సద్దుల బతుకమ్మ ఉత్సవాలను జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలని సూచించారు.ప్రతిరోజూ నిర్వహించే ఉత్సవాల వివరాలను రాష్ట్ర స్థాయికి పంపాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అదనపు ఎస్‌పిరమేష్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి, ఇన్ చార్జ్ టూరిజం ఆఫీసర్ అక్బర్ అలీ, సమాచార శాఖ సహాయ సంచాలకులు యు. వెంకటేశ్వర్లు, మెప్మా పీడీ శ్రీనివాస్,డీఎంహెచ్ఓ డాక్టర్ రాహుల్ పాల్గొన్నారు.

## బతుకమ్మ ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీక

### మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. బతుకమ్మ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బతుకమ్మ ఆటపాటల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావి తరాలకు అందించడంలో బతుకమ్మ పండుగ కీలకపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. పూజలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించే ఈ పండుగ ప్రతి ఒక్కరిలో ఆనందాన్ని నింపుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సిహెచ్ హన్మంత రెడ్డి, మహిళా కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు, మెప్మా, ఆర్‌పిలు పాల్గొని బతుకమ్మ ఆటపాటలతో సందడి చేశారు.

## గురుకులాల నిత్యావసరాల టెండర్లు మహిళా సంఘాలకే ఇవ్వాలి

### బిసి జెఏసి రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్ డిమాండ్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకుంటున్న వేలాది మంది విద్యార్థులకు నిత్యావసర సరుకులు సరఫరా చేసే టెండర్లను వెంటనే స్థానిక మహిళా సంఘాలకు కేటాయించాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నిత్యావసర వస్తువులను సరఫరా చేయడానికి ప్రభుత్వం పిలిచిన కేంద్రీకృత టెండర్ విధానంలో భారీ స్థాయిలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఆరోపించారు. గత ప్రభుత్వం బ్లాక్ లిస్టులో పెట్టిన నాకాఫ్ సంస్థకు మళ్లీ కోట్ల రూపాయల విలువైన కాంట్రాక్టు కట్టబెట్టడం అత్యంత విచారకరమని పేర్కొన్నారు. దినపత్రికల్లో వెలువడిన ఆధార సహిత కథనాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తక్షణమే జోక్యం చేసుకుని ఆ సంస్థను తిరిగి బ్లాక్ లిస్టులో పెట్టాలని విజ్ఞప్తి చేశారు. బేషరతుగా నాకాఫ్ టెండర్లను రద్దు చేసి పారదర్శకతను కాపాడాలని కోరారు.అధికారులు లంచాల మత్తులో జోగుతూ ఎలాంటి అనుభవం లేని వ్యక్తులకు, సంస్థలకు సబ్ కాంట్రాక్టులు కట్టబెట్టారని విమర్శించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తూ విద్యార్థుల కడుపు కొట్టేలా నాసిరకం సరుకులు సరఫరా చేసే ముఠాలకు ఊతమిస్తున్నారని మండిపడ్డారు. హాస్టళ్లలో నాణ్యమైన ఆహారం అందక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, స్థానిక మహిళా ప్రాథమిక సహకార సంఘాలకు ఈ బాధ్యతలు అప్పగిస్తే స్వయం సహాయక సంఘాలకు ఉపాధి లభించడమే కాకుండా పిల్లలకు సమయానికి నాణ్యమైన సరుకులు అందుతాయని వివరించారు. అధికారులు చేసిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, తక్షణమే రీటెండరింగ్ నిర్వహించి మహిళా సంఘాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మేనిఫెస్టోకు పెద్దపీట...

### మాట ఇచ్చారు... నిలబెట్టుకుంటున్నారు

### స్వంత నిధులతో పథకాల అమలు : అందరికీ ఆదర్శం



**ప్రజాపక్షం/సూర్యాపేట** : గెలుపే లక్ష్యంగా రాజకీయ నాయకులు ఎన్నికల ముందు ప్రజలకు అనేక వాగ్దానాలు చేయడం సర్వసాధారణం. గెలుపొందిన తరువాత వాటిని నిలబెట్టుకోవడంలో విఫలమైనవారు అనేక మంది ఉన్నారు. కానీ తనను నమ్మి ఓటువేసిన ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో సూర్యాపేట మున్సిపాల్టీలోని రాజీవ్‌నగర్‌కు చెందిన 23వ వార్డు కౌన్సిలర్ వల్దాసు లక్ష్మి శ్రీనివాస్ (రెబల్) ముందున్నారు. తమకు ఎన్ని ఆర్థిక ఓడిదొడుకులు ఉన్నా తాము ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం తమ బాధ్యతని అనేక మార్లు మీడియా ముందు వెల్లడించారు. దివంగత నేతలు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి తమకు ఆదర్శమని ఇచ్చిన మాటకు కట్టుబడి మాట ఇచ్చి మడిమ తిప్పని నేతలుగా పేరొందిన వారు మాకు స్ఫూర్తి అని చెబుతున్నారు. ఎన్నికల ముందు ప్రజల ముందు పెట్టిన స్వంత మేనిఫెస్టోకు పెద్దపీట వేస్తూ అమలు చేస్తూ సంక్షేమ పథకాలు అందిస్తున్నారు. ప్రభుత్వం నుండి వచ్చే నిధుల కోసం ఎదురుచూడకుండానే స్వంత నిధులతో సేవ చేస్తూ ముందుకు సాగుతున్నారు.

**స్వంత నిధులతో పథకాల అమలు....** కౌన్సిలర్ వల్దాసు లక్ష్మి శ్రీనివాస్ (రెబల్) తన స్వంత నిధులతో వార్డు ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది. ఇందులో ప్రధానంగా వార్డులో ఆడపిల్ల పుడితే రూ.2,116లు, ఆడపిల్ల పెళ్ళికి రూ.3,116లు ఇవ్వడంతోపాటు, వార్డులో మరణించిన వారి అంత్యక్రియల్లో 3వ వంతు ఖర్చు వారే భరిస్తూ వస్తున్నారు. ఇదిలా ఉంటే గణేష్ నవరాత్రి ఉత్సవాలకు, దుర్గామాత నవ రాత్రి ఉత్సవాలకు పెద్దఎత్తున విగ్రహాలు ఇప్పించడం, బతుకమ్మ పండుగకు ఆడపడుచులను ప్రోత్సహిస్తూ వారికి కావల్సిన చీరలు, కోలలు, ఇతర వస్తువులను సమకూర్చి శభాష్ అనిపించుకుంటున్నారు.

**వీరు మాత్రం దామన్ననే మొక్కుతారు..**

సహజంగా అందరూ నిత్యం ఉదయం లేవగానే దేవుళ్ళను మొక్కుకోవడం అందరికి తెలిసిందే. కానీ కౌన్సిలర్ వల్దాసు లక్ష్మి శ్రీనివాస్ (రెబల్) మాత్రం నిత్యం దివంగత నేత, మాజీ మంత్రి దామోదర్ రెడ్డిని లేవగానే మొక్కుతారు. నిత్య పూజలు చేసే వారు దేవుడి ఫోటోకు పూలమాలలు వేస్తారో లేదోకాని ఆయన చిత్రపటానికి మాత్రం పూలమాల వేసి దండం పెట్టుకొని పనులు మొదలు పెట్టడం అతనిపై అభిమానం ఎంత ఉందనేది ఇట్టే స్పష్టమవుతుంది. లక్ష్మి భర్త శ్రీనివాస్ (రెబల్) దామన్న అంటే మొదటి నుంచి ఎంతో పిచ్చి. కరుడు కట్టిన కాంగ్రెస్ నాయకుడిగా అతనికి మంచి పేరుంది. సూర్యాపేట తాలూకా తాపీ పనివారల సంఘం అధ్యక్షులుగా పనిచేస్తూ గృహ నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసం ఆయన ఎనలేని కృషి చేస్తున్నారు.

**అందరికీ ఆదర్శం 23వ వార్డు కౌన్సిలర్ వల్దాసు లక్ష్మి శ్రీనివాస్**

సూర్యాపేట మున్సిపాలిటిలో మొత్తం 48 వార్డు కౌన్సిలర్లు ఉండగా వీరందరిలో 23వ వార్డు కౌన్సిలర్ వల్దాసు లక్ష్మి శ్రీనివాస్ (రెబల్) తన స్వంత నిధులతో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అందరికి ఆదర్శంగా నిలిచింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పాటు స్వంత నిధులతో పథకాలు అమలు చేయడం తమ వార్డులోని పేద, మధ్య తరగతి ప్రజలకు మరింత ఆర్థిక భరోసా కల్పించినట్లు అయ్యింది. వీరిని ఆదర్శంగా తీసుకొని కౌన్సిలర్లు కూడా ప్రజాసేవలో ముందుకు సాగి ప్రజల మన్ననలు పొందాలని ఆశిద్దాం.

## బ్రిడ్జి నిర్మాణ పనులతో ప్రజలకు ఇబ్బంది కలిగించొద్దు

### అఖిలపక్ష నాయకులతో మునిసిపల్ చైర్‌పర్సన్ సమావేశం



**ప్రజాపక్షం/చౌటుప్పల్** : చౌటుప్పల్ పట్టణంలో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులతో ప్రజలకు ఇబ్బందులు కలిగించవద్దు చౌటుప్పల్ మునిసిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావనిరమేష్ గౌడ్ అన్నారు.బ్రిడ్జి నిర్మాణ పనులతో ప్రజలు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో మంగళవారం మునిసిపల్ కార్యాలయంలో పట్టణ అఖిలపక్ష నాయకులు,నిర్మాణ సంస్థ జిఎం,ట్రాఫిక్ పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు.పట్టణ కేంద్రంలో బ్రిడ్జి నిర్మాణ పనులతో ముఖ్య కూడళ్ళుగా ఉన్న తంగడిపల్లి క్రాస్ రోడ్డు,వలిగొండ క్రాస్ రోడ్డులను మూసి వేయడంతో వాహనదారులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అఖిలపక్ష నాయకులు అభిప్రాయం వ్యక్తం చేశారు.సమావేశ అనంతరం పార్టీల నాయకులు,అధికారులతో కలిసి నిర్మాణ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా మునిసిపల్ చైర్‌పర్సన్ పావని మాట్లాడుతూ ముఖ్య కూడళ్ళు మూసివేయడం వల్ల రోడ్డు క్రాస్ చేయాలంటే సుమారు 4కిమీలు వెళ్ళి తిరిగి రావడం వల్ల వాహనదారులు,వ్యాపారులు,ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతు న్న నేపథ్యంలో కూడళ్లను పునరుద్దరించాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ సంస్థ అధికారులు వివిధ శాఖల ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలని కోరారు.ఈ సమావేశంలో నిర్మాణ సంస్థ జిఎం.వికె.జోషి,ట్రాఫిక్ ఎస్సై సైదిరెడ్డి,ఆంజనేయులు, కౌన్సిలర్లు బద్రి గాలయ్య,పాక చిరంజీవి,కోఆప్షన్ సభ్యులు గంగారాములు,నాయకులు కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు కాసర్ల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు గుజ్జల సురేందర్‌రెడ్డి,మొగుదాల రమేష్,చింతల సాయి లు, కంచర్ల గోవర్ధన్‌రెడ్డి,పగిళ్ల మోహన్‌రెడ్డి,బత్తుల శ్రీశైలం,అన్నమోని గోవింద్,దేప రాజు,చెరుకు శివకుమార్ పాల్గొన్నారు.

## పారదర్శకంగా అర్హుల గుర్తింపు ప్రక్రియ

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నూతన పెన్షన్ల మంజూరు ప్రక్రియలో భాగంగా, క్షేత్రస్థాయిలో అర్హుల గుర్తింపు ప్రక్రియ అత్యంత పారదర్శకంగా సాగుతుంది. మంగళవారం పెన్‌పహాడ్ మండలంలోని పెన్‌పహాడ్, మాచారం, దూపాడు గ్రామాల్లో చేయూత నూతన పెన్షన్ వెరిఫికేషన్ ముమ్మరంగా నిర్వహించారు. తనిఖీల్లో జిల్లాస్థాయి మానిటరింగ్ అధికారి, డిఆర్‌డిఓ సన్యాసయ్య, మండల పరిషత్ అభివృద్ధి అధికారి జానయ్య పాల్గొని క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఇండ్లకు వెళ్ళి వారి సామాజిక, ఆర్థిక స్థితిగతులను, దరఖాస్తుల అర్హతలను నిశితంగా పరిశీలించారు.



## అంతరాలు లేని సమాజం కోసం పోరాడిన మహనీయుడు

గుండా మల్లేష్ వర్ధంతిలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్ జీ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** అంతరాలు లేని సమసమాజ స్థాపన కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు సిపిఐ అగ్రనేత, బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు గుండా మల్లేష్ అని సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్. ఆనంద్ జీ కొనియాడారు. మంగళవారం సిపిఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన గుండా మల్లేష్ ఆరో వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలిచిన గుండా మల్లేష్, రాజకీయ జీవితంలో నిజాయితీకి ప్రాధాన్యతనిచ్చారని పేర్కొన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడిగా, జాతీయ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడిగా అనేక బాధ్యతలు నిర్వహించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించారని, శ్రీకృష్ణ కమిటీ ఎదుట వివిధ పార్టీలు ప్రాంతాలవారీగా భిన్నవాదనలు వినిపించిన సమయంలో సిపిఐ తరపున ప్రత్యేక తెలంగాణకు అనుకూలంగా ఒకే వైఖరిని వినిపించారని గుర్తు చేశారు. సింగరేణి బొగ్గు గనుల్లో కార్మికుల హక్కుల కోసం ఆయన అలుపెరగని పోరాటాలు చేశారని పేర్కొన్నారు. గుండా మల్లేష్ ఆశయాలను కొనసాగిస్తూ అంతరాలు లేని సమసమాజ స్థాపన కోసం పోరాడటమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని ఆనంద్‌జీ అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సమితి సభ్యులు వంకేశ్వరం శ్రీనివాసులు, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి కొత్త రామస్వామి, శేఖర్, సిపిఐ నాయకులు, ఎఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి బాల్‌పీర్, విష్ణు, బాలస్వామి పాల్గొన్నారు.

## ఎస్ఐ, కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌కు ఉచిత శిక్షణ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** పోలీస్ ఉద్యోగాల కోసం సన్నద్ధమవుతున్న నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన అర్హులైన ఎస్సీ, ఎస్టీ, స్టడీ సర్కిల్‌లో ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ అందించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె.ఉమాపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ పరీక్షలకు సిద్ధమవుతున్న అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీస్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్న ఎస్సీ , ఎస్టీ వర్గాలకు చెందిన డిగ్రీ ఉత్తీర్ణుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు డిసెంబర్ 20వ తేదీ వరకు ఉచిత వసతి సౌకర్యంతో శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు 2026 అక్టోబర్ 14వ తేదీ సాయంత్రం 5గంటలలోపు మహబూబ్‌నగర్ జిల్లా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో అవసరమైన ధ్రువపత్రాలతో కూడిన దరఖాస్తులను నేరుగా సమర్పించాలని సూచించారు. అభ్యర్థుల ఎంపిక డిగ్రీలో సాధించిన మార్కుల మెరిట్ ఆధారంగా ఉంటుందని స్పష్టం చేశారు. మరిన్ని వివరాల కోసం 8977340006, 850034470, 8309657774 ఫోన్ నంబర్లను సంప్రదించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కె.ఉమాపతి తెలిపారు.



## గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఇందిరానగర్ కాలనీలోని అంగన్‌వాడి కేంద్రాల్లో గర్భిణులకు 20వ వార్డు కౌన్సిలర్ చిమ్ముల లలిత శ్రీకాంత్ రెడ్డి పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు తమ ఆహారంలో ఆకుకూరలు, పాలు, పెరుగు, ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహార పదార్థాలను తీసుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో వైద్యుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటిస్తూ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధవహించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, 9వ వార్డు కౌన్సిలర్ చిత్తారి ఎల్లమ్మ శ్రీనివాసులు, అంగన్‌వాడి సిబ్బంది పాల్గొన్నారు.



## డిప్యూటీ సిఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాల్లో పాల్గొననున్న నేపథ్యంలో పర్యటనకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పర్యటనకు ఎలాంటి విఘాతం కలగకుండా చేపట్టిన భద్రతా ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామని, ఎలాంటి భద్రతాపరమైన సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని వెల్లడించారు. బందోబస్తు విధులకు కేటాయించిన పోలీసు సిబ్బంది తమకు కేటాయించిన పాయింట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో ఎలాంటి అలసత్వం వహించరాదని ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా పూర్తయ్యేలా అధికారులు , సిబ్బంది సమన్వయంతో ప్రణాళికబద్ధంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.వెంకటేశ్వర్లు, అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్, అమ్రాబాద్ సీఐ చంద్రయ్య, అచ్చంపేట సీఐ నాగరాజు, అమ్రాబాద్ ఎస్ఐ, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బడ్జెట్ ఉన్నా... మూడునెలలుగా జీతాలేవీ?

రేపటి నుంచి జడ్చర్ల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి కాంట్రాక్ట్ కార్మికుల మెరుపు సమ్మె

తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్




**ప్రజాపక్షం/జడ్చర్ల :** తెలంగాణ రాష్ట్ర అతిపెద్ద బతుకమ్మ దసరా పండుగకు కూడా ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు జీతాలు అందని దుస్థితి నెలకొనడం అత్యంత బాధాకరమని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. మూడు నెలల పెండింగ్ వేతన బకాయిలను చెల్లించకుండా తీవ్రమైన నిర్లక్ష్యం ధోరణిని నిరసిస్తూ రేపటి నుండి జడ్చర్ల ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్టు పారిశుధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ కార్మికులు మెరుపు సమ్మెకు దిగుతున్నట్లు తెలుపుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మంగళవారం ఆసుపత్రి సిబ్బందికి మెరుపు సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగ ఉత్సవాలను వాడవాడల ఘనంగా నిర్వహించాలని చెబుతున్న మరోపక్క అధికారులు అలసత్వం కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా జడ్చర్ల ఏరియా ఆసుపత్రిలో మాత్రం నెలలు గడుస్తున్న వేతనాలు అందించడంలేదని అన్నారు. ప్రభుత్వం ముందు చూపుతో దాదాపు ఆగష్టు వరకు వేతన బడ్జెట్ విడుదల చేసిందని కానీ కార్మికులకు మాత్రం జూలై ఆగష్టు సెప్టెంబర్ నెలలుగా జీతాలే చెల్లించలేదని వాపోయారు. పెండింగ్ జీతాల కోసం అధికారులను కాంట్రాక్టర్‌ను ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని, అప్పుడు ఇప్పుడు అంటూ కహానీలు చెబుతున్నారని మండిపడ్డారు. మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుంటే కార్మికుల జీవనం గడిచేది ఎలా అని ప్రశ్నించారు. కావున విధిలేని పరిస్థితుల్లో బుధవారం నుండి మెరుపు సమ్మెకు దిగుతున్నమని, వేతనాలు చెల్లించే వరకు నిరవధిక మెరుపు సమ్మె కొనసాగుతుంది ప్రకటించారు. జిల్లా కలెక్టర్ స్థానిక శాసనసభ్యులు జోక్యం చేసుకొని కార్మికులకు న్యాయం జరిగే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు భాగీ కృష్ణయ్య, ఆస్పత్రి బ్రాంచ్ యూనియన్ నేతలు కార్మికులు నాగరాజు, రాజేష్, అబ్దుల్ వహీద్, విజయలక్ష్మి , మన్నెమ్మ, అలివేలమ్మ, స్వాతి, శివలీల,పద్మ, భార్గవి, నీరజ, జయమ్మ, లక్ష్మి , మంగమ్మ, శ్రీలత, అంజలి పాల్గొన్నారు.

## వెట్టిచాకిరి నిర్మూలనపై అవగాహన కల్పించాలి

జిల్లా అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు



**ప్రజాపక్షం/గద్వాలరూరల్ :** వెట్టిచాకిరీ నిర్మూలనపై జోగులాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా కళాకారులు తమ ప్రదర్శనలతో విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు అన్నారు. మంగళవారం ఐడిఒసి ఆవరణంలో వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రసాథయి స్వేచ్ఛా రథం , ప్రచార కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్లు ఇతర అధికారులతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెట్టి చాకిరీ బాధితులు, అసంఘటిత రంగ కార్మికులకు తమ హక్కులు, అందుబాటులో ఉన్న సహాయ మార్గాలపై అవగాహన కల్పించడంతో పాటు టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నంబర్ 08069434343 ను ప్రచారం చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో వెట్టి చాకిరీని పూర్తిగా నిరోధించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతుందని పేర్కొన్నారు. వెట్టిచాకిరీకి సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి, బాధితులను గుర్తించడం, వారిని రక్షించడం, అవసరమైన సహాయం, పునరావాసం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్మికులు తమ హక్కులపై అవగాహన పెంచుకుని, ఎలాంటి ఒత్తిడి, బెదిరింపులు లేదా శ్రమ దోపిడీ ఎదురైనా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. బాధితులను గుర్తించి, విముక్తి కల్పించి, పునరావాసం అందించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక శాఖ అధికారి వేణుగోపాల్, డిడబ్ల్యూఒ సునంద, డిఇఒ విజయలక్ష్మి , కళాకారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణాదేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారు

నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల పూజలు, ప్రత్యేక అలంకరణ



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వీపనగండ్ల మండల కేంద్రంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని కచ్చిరు (రచ్చకట్ట) వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారు మూడవ రోజు అన్నపూర్ణదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించడంతో భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. అన్నపూర్ణాదేవిని దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని, అన్నపానీయాలకు ఎలాంటి లోటు ఉండదని భక్తులు విశ్వసిస్తారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాలతో మండల కేంద్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.

## నారాయణపేట్ ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

3.5 కిలోల బరువున్న రొమ్ము గడ్డ తొలగింపు



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అరుదైన ఫిలోడ్స్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న మహిళకు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. గుడ్మీట్కల్ గ్రామానికి చెందిన శంకరమ్మ (భర్త జగదీష్) గత ఎనిమిది సంవత్సరాలుగా కుడివైపు రొమ్ములో గడ్డతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఆమె నారాయణపేట్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించగా వైద్యులు పరీక్షించి చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్చుకున్నారు. ఈ క్రమంలో అక్టోబర్ 13,2026న ఉదయం జనరల్ సర్జరీ విభాగం వైద్య బృందం ఆమెకు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించింది. ఈ శస్త్రచికిత్సలో 3.50 కిలోల బరువున్న గడ్డను తొలగించి, తదుపరి పరీక్షల నిమిత్తం బయాప్సీ పరీక్షకు పంపించారు. పరీక్షల ఫలితాల ఆధారంగా గడ్డ స్వభావాన్ని నిర్ధారించనున్నారు. ఈ శస్త్రచికిత్స జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రత్న, డాక్టర్ రహీం, డాక్టర్ వివేక్ పాల్గొన్నారు. అనస్థీషియా విభాగం నుంచి డాక్టర్ నీలవర్ణ, డాక్టర్ రమాదేవి, డాక్టర్ సాయికుమార్ సేవలందించారు. స్టాఫ్ నర్సులు, ప్రవళిక, స్వప్న, కిరణ్, గోపి శాస్త్రచికిత్సకు సహకరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సంపత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ, నారాయణపేట్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన వైద్య బృందం సమన్వయంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఈ శస్త్రచికిత్స విజయవంతం పూర్తికావడం పట్ల వైద్య బృందాన్ని అభినందించారు.

## వీపనగండ్ల కాంగ్రెస్ గ్రామ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కావలి మహేష్

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు వీపనగండ్ల కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు గ్రామ సర్పంచ్ మీసాల పార్వతమ్మ తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేసే లక్ష్యంతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా కావలి మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోతుల వెంకటరెడ్డి, సలహాదారుడిగా ఎర్ర రాముడును ఎంపిక చేశారు. నూతన కమిటీ వివరాలుః ఉపాధ్యక్షులు కమ్మరి మురళి, భాను ప్రకాష్, గడ్డమీద ఎల్లయ్య, వడ్డే ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శులు, క్యాతం కురుమయ్య, మీసాల నాగన్న, తప్పేట స్వాములు, మంగదొడ్డి ఎల్లయ్య, సహాయ కార్యదర్శులు, రాచూరి రాజశేఖర్, మాల కురుమయ్య, మానవపాడు కురుమయ్య, లోకా రెడ్డి, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు, పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తూ, గ్రామంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని కార్యక్రమానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు ఆకాంక్షించారు.

## భక్తులను ఆకట్టుకున్న శ్రీ అంబా భవానీ మాత

**ప్రజాపక్షం/కొత్తకోట :** కొత్తకోట పట్టణంలోని శ్రీ భవానీ శంకర దేవాలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు మంగళవారం శ్రీ అంబా భవాని అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఆకర్షణగా అన్నపూర్ణాదేవి వడ్డిస్తున్నట్లుగా, పరమేశ్వరుడు భిక్షాటన చేస్తూ తన పాత్రలో భిక్ష స్వీకరిస్తున్నట్లుగా రూపొందించిన నమూనా భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. సజీవ దృశ్యాన్ని తలపించే అలంకరణ భక్తులకు కనువిందు చేసింది. అమ్మవారి దర్శనం కోసం పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. ముఖ్యంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ధోని, సదాశివయ్య, నటరాజ్ కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించి, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ నిర్వాహకులు, అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను ఆలయ నిర్వాహకులు పొగాకు మహేష్‌బాబు, ఆయన సోదరులు దగ్గరుండి పర్యవేక్షించారు.

# సాగునీటి కోసం రైతుల ఆందోళన

గ్రామాల రైతుల మధ్య ఘర్షణ

శాంతింపజేసిన పోలీసులు



**ప్రజాపక్షం/పానుగల్ :** పానుగల్ మండల పరిధిలోని చింతకుంట, మహమ్మదాపూర్ గ్రామాల పరిధిలో గల భీమా కాలువ దగ్గర సాగునీటి కోసం రైతులు ఆందోళన చేపట్టారు. దాదాపు 15 రోజుల తర్వాత కాలువకు సాగునీరు విడుదల చేయడంతో కాల్వ దగ్గర ఏర్పాటుచేసిన షట్టర్లను మహమ్మదాపూర్, చింతకుంట గ్రామాలకు చెందిన రైతులు మూసివేయడంతో దిగువలో ఉన్న గ్రామాలు బుసిరెడ్డిపల్లి, బండపల్లి కొత్తకోట బహదర్ గూడెం జమ్మాపూర్ కేతేపల్లి గ్రామాల రైతుల పంట పొలాలకు సాగునీరు అందకపోవడంతో ఆయా గ్రామాల రైతులు తమమ వ్యవసాయ పొలాలకు సాగునీరు రావడంలేదని మంగళవారం భీమా కాలువ దగ్గర ఆందోళనకు దిగి షట్టర్లను తెరిచేందుకు ప్రయత్నించారు. నెలకొంది. రైతులు ఒకరినొకరు తోసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులకు సమాచారం అందింది దీంతో వెంటనే వనపర్తి సీఐ కేఎస్ రత్నం పాన్‌గల్ ఎస్సై కురుమయ్య చిన్నంబావి ఎస్సై రామన్ గౌడ్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో చర్చించి ఘర్షణను శాంతిపచేశారు. ఇరిగేషరన్ అధికారులతో చర్చించి అన్ని గ్రామాల రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని అనవసరంగా కాల్వ వద్ద ఘర్షణ పడవద్దు అని కోరడంతో రైతులు ఆందోళనను విరమించారు. ఇరిగేషన్ అధికారులు కూడా రైతులతో మాట్లాడారు. సాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

## జడ్చర్ల నియోజకవర్గానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు

నవాబుపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాల అభివృద్ధికి రూ.11.85కోట్ల నిధులు

ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి



**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి మరో కీలక ముందడుగు పడింది. తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 20 తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌లో మౌలిక వసతుల అభివృద్ధి, విద్యా ప్రమాణాల మెరుగుదల కోసం రూ.205.95 కోట్లకు పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా జడ్చర్ల నియోజకవర్గంలోని నవాబుపేట మండలంలో ఉన్న జెడ్పీహెచ్ఎస్ నవాబుపేట పాఠశాలకు రూ.11.85 కోట్ల నిధులు కేటాయించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం పాఠశాల విద్యాశాఖ ద్వారా జీవో నెంబర్ 188, 09.10.2026 ను జారీ చేసింది. ఈ సందర్భంగా జడ్చర్ల ఎమ్మెల్యే జానంపల్లి అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి మా ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలను ఆధునిక వసతులతో తీర్చిదిద్ది, పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. నవాబుపేట మండలంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ అభివృద్ధి కార్యక్రమంలో చేర్చి, రూ.11.85 కోట్ల నిధులు మంజూరు చేయడం సంతోషకరం. ఈ నిధులతో పాఠశాలలో ఆధునిక మౌలిక వసతులు, మెరుగైన విద్యావాతావరణం కల్పించేందుకు అవకాశం ఏర్పడింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యా సదుపాయాలు అందించడమే మా లక్ష్యం. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలి. జడ్చర్ల నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు విద్యారంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తెలిపారు.



## మాగనూరు మండల ప్రెస్‌క్లబ్ కమిటీ ఏకగ్రీవం

**ప్రజాపక్షం/మాగనూర్ :** మాగనూరు ప్రెస్ క్లబ్ కమిటీని సీనియర్ పాత్రికేయుల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జి.ప్రహ్లాద్ రెడ్డి, ఎస్.లక్ష్మణ్ అధ్యక్షులుగా పుంజనూర్ సురేష్, ప్రధాన కార్యదర్శిగా బాల్దాస కథలప్ప, ఉపాధ్యక్షులు జి.నరేష్, కె. శివ కుమార్, కోశాధికారిగా బల్దాస్ శ్రీనివాస్‌లను కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా నగరం రాజు, రమేష్ గౌడ్, రాము, శేఖర్ గౌడ్, అశోక్, రాజు ఉన్నారు. నూతన అధ్యక్షులు సురేష్ మాట్లాడుతూ, జర్నలిస్టుల సమస్యల సాధన కోసం కృషి చేస్తానన్నారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నెరవేర్చే దిశగా ప్రణాళికను అమలు చేస్తానని అన్నారు. నపై నమ్మకంతో అవకాశం ఇచ్చిన మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

## బిజ్వార్‌కు రెండు అంగన్వాడీ భవనాలు మంజూరు

ఎంపి డికె.అరుణ సహకారంతో నిధుల కేటాయింపు

**ప్రజాపక్షం/ఊట్కూరు :** మండలంలోని బిజ్వార్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక చిన్నారులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలకు త్వరలో పరిష్కారం లభించనుంది. గ్రామంలో రెండు అంగన్వాడీ భవనాల నిర్మాణానికి విగ్రామ్‌జి నిధుల ద్వారా అనుమతులు లభించినట్లు సర్పంచు కొల్లంలపల్లి అంజయ్య మంగళవారం వెల్లడించారు. మహబూబ్‌నగర్ ఎంపీ డికె.అరుణ సహకారంతో ఒక్కో భవనానికి రూ.12 లక్షల చొప్పున మొత్తం రూ.24 లక్షలు మంజూరైనట్లు ఆయన తెలిపారు. గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలకు భవనాలు లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందులను ఎంపి దృష్టికి తీసుకెళ్లగా, ఆమె స్పందించి నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎంపి డికె అరుణకు సర్పంచు కృతజ్ఞతలు తెలిపారు. రెండు కొత్త భవనాలు అందుబాటులోకి వస్తే చిన్నారులకు సౌకర్యవంతమైన వాతావరణంలో విద్య, పౌష్టికాహార సేవలు అందించేందుకు వీలవుతుందని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు చెన్నారెడ్డి, రాఘవేంద్ర రాజు, వెంకటేశ్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, రాజప్ప, పోలీస్ నరసింహారెడ్డి, సూర్యకాంత్, రాజా గౌడ్, చిన్న నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.



## గాయత్రి దేవిగా వాసవిమాత

భక్త జనసంద్రంగా వాసవి దేవాలయం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం భక్తులతో కిటకిటలాడుతోంది. మంగళవారం ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడోరోజు వాసవి మాత గాయత్రీ దేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కుంకుమార్చనలు, గీతాపారాయణం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు తంబోలా ఆటలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సంప్రదాయ దుస్తులు ధరించి వచ్చి మహిళలకు లక్కీడిప్ ద్వారా చీరను బహుమతిగా అందించారు. సుమారు 3000 మందికి అన్నదానం నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ జూలూరు రమేష్ బాబు తెలిపారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన దాండియా కార్యక్రమం, నాగరాజు స్వామి ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయానికి విచ్చేసిన భక్తులందరికీ అవసరమైన వసతి ఏర్పాట్లు చేసినట్లు రమేష్ బాబు వెల్లడించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కల్మిచర్ల గోపాల్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ కోశాధికారి గుబ్బ కిషన్, వాస మనీష్, బాదం బాదం రాఘవేందర్, పట్టణ సంఘం అధ్యక్షుడు వాస శేఖర్, చిగుళ్లపల్లి శ్రీధర్, గుగ్గిళ్ల శంకర్, దాచేపల్లి మనోహర్, పోలా సురేందర్, మహిళా సంఘం అధ్యక్షురాలు గోవిందు, మౌనిక, కల్మిచర్ల స్వాతి తదితరులతో పాటు మహిళలు, వాసవి క్లబ్ సభ్యులు, ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# శివారు కాలనీల్లో మౌలిక వసతులు



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : సాహెబ్ నగర్ డివిజన్ పరిధిలోని శివారు కాలనీలకు మౌలిక సౌకర్యాలు లేక కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని సాహెబ్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కేతావత్ రమేష్ నాయక్ అన్నారు. మంగళవారం జలమండలి ఎండి అశోక్‌రెడ్డిని వారి కార్యాలయంలో కలిసి బృందావన్ మెడోస్, సౌభాగ్య నగర్ కాలనీ, బ్యాంకు కాలనీ గాయత్రీ నగర్, జక్కిడి కాలనీ, సామా నగర్, విజయనగర్ కాలనీ, అనంతవేణి నగర్ కాలనీలకు నూతన డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో కాలనీల అధ్యక్షులు భవాని సరస్వతి, ప్రశాంత్, విష్ణువర్ధన్, నాగేంద్ర, శశికాంత్, కాంగ్రెస్ నాయకులు విజయ్ కుమార్, నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ



ప్రజాపక్షం/షాద్‌నగర్: పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు కృషి చేయాలని ఎన్నికల ఇన్‌చార్జి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్ సూచించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని చించోడు, అయ్యవారిపల్లి, ఉప్పరిగడ్డ గ్రామ పంచాయతీల్లో పట్ట భద్రుల ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో చించోడు సర్పంచ్ ర్యాకల శ్రీనివాస్, అయ్యవారిపల్లి సర్పంచ్ గోటికె గోపాల్‌రెడ్డి, ఉప్పరిగడ్డ సర్పంచ్ చందునాయక్, సహకార సంఘం ఉపాధ్యక్షుడు తుపాకుల శేఖర్, గణేష్ నాయక్, ఉపసర్పంచ్ రాజేందర్‌రెడ్డి, పుల్లారెడ్డి, కుమ్మరి శేఖర్, మిద్దె యాదగిరి, జమాల్పూర్ రాజు, చీర అంజయ్య, రుస్తుం గిరిధర్ పాల్గొన్నారు.

# 130 మందికి ఉద్యోగాల కల్పన



ప్రజాపక్షం/కేశంపేట: యువతి, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. మంగళవారం కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో మాజీ సర్పంచ్ కామ్లేకార్ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన జాబ్‌మేళాలలో 130మంది యువతీ, యువకులకు ఉద్యోగాల కల్పన చేకూర్చినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కార్నాటి దర్శన్, మల్లేష్ యాదవ్, జమాల్ ఖాన్, కుంటి లక్ష్మయ్య, జగన్‌రెడ్డి, నరేష్ యాదవ్, వార్డు సభ్యులు కాకునూరు కృష్ణ, కుంటి పద్మ, చుక్క శ్రీను, నందిగామ శిరీషరాజు పాల్గొన్నారు.

# భూములకు పట్టాలు ఇవ్వాలి



ప్రజాపక్షం/యాచారం : మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బాండెడ్ లేబర్‌ను గుర్తించి పట్టా భూములు కొని ఇచ్చిన వారందరికి ప్రభుత్వం పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని దళిత బహున శ్రామిక యూనియర్ రాష్ట్ర అధ్యక్షులు గండు నర్సింహ్మ డిమాండ్ చేశారు. మంగళవారం యాచారం మండల తహసీల్దారు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా మానిటరింగ్ కమిటి కన్వినర్ బి.కృష్ణ, జిల్లా కోఆర్డినేటర్ జోగు రమేశ్, భాగ్యమ్మ, జంగయ్య, యాదయ్య, బోర్లయ్య, జంగయ్య, చంద్రయ్య, యాదమ్మ, నర్సమ్మ, కృష్ణయ్య, సత్యం, రాములు పాల్గొన్నారు.

# బిఆర్‌ఎస్‌లో చేరికలు



ప్రజాపక్షం/కొత్తూరు: అధికార, ప్రతిపక్ష పార్టీల మద్య రాజకీయాలు అసక్తికరంగా మారుతున్నాయి. మంగళవారం కొత్తూరు మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ వన్నం బాలరాజు యాదవ్ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజ్ యాదవ్ మాట్లాడుతూ అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు బిజెపి నుంచి 54మంది నాయకులు, నాయకులు, కార్యకర్తలు బిఆర్‌ఎస్‌లో చేరారని వివరించారు. సమావేశంలో బ్యాగరి రాజు, కుమ్మరి పోచయ్య, వన్నం బీరయ్య, నవీన్, రవి, శేఖర్ పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ



ప్రజాపక్షం/శంకర్ పల్లి: శంకర్‌పల్లి మండలం మరియు మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు ప్రభుత్వం అందించే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మంగళవారం పంపిణీ చేశారు. మొత్తం 28 మంది లబ్ధిదారులకు రూ.28,00,448 విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా పథకాలను అమలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.ప్రవీణ్ కుమార్, వైస్‌చైర్మన్ జూలకంటి శ్వేత పాండురంగారెడ్డి. తహసీల్దార్ సురేందర్. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, శంకర్ పల్లి పిఎసిఎస్ చైర్మన్ బొల్లారం వెంకటరెడ్డి, కౌన్సిలర్లు అఖిల యాదిరెడ్డి, లలితా మోహన్ రెడ్డి, ఆనంద్, పలు గ్రామాల సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో 4 రెస్టారెంట్ల లైసెన్సులు రద్దు

అపరిశుభ్రత, బొద్దింకలు, ఎలుకల సంచారం.. తక్షణమే కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశాలు

13 రెస్టారెంట్లు, క్యాంటీన్లలో తనిఖీలు.. 16 ఆహార నమూనాల సేకరణ













ప్రజాపక్షం/హైదరాబాద్: నగరంలోని రెస్టారెంట్లు, క్యాంటీన్లలో ఆహార భద్రతా ప్రమాణాలు గాలికొదిలేస్తున్నట్లు తెలంగాణ ఆహార భద్రతా విభాగం తనిఖీల్లో వెలుగుచూసింది. వంటగదుల్లో అపరిశుభ్రత, నేలపై ఆహార వ్యర్థాలు, నిల్వ ఉన్న మురుగునీరు, బొద్దింకలు, ఎలుకల సంచారం, జిడ్డుతో నిండిన పొగ గొట్టాలు వంటి లోపాలను అధికారులు గుర్తించారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాలుగు సంస్థల ఆహార భద్రతా లైసెన్సులను సస్పెండ్ చేయడంతో పాటు, తక్షణమే వ్యాపార కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించారు. మరో ఏడు సంస్థలకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నారు. అనుమానాస్పద కల్తీపై పరీక్షల కోసం 16 ఆహార నమూనాలను సేకరించారు. తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ (టిజి సేఫ్)కు చెందిన ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ఏడు బృందాలు పోలీసుల సహకారంతో అమీర్‌పేట, జూబ్లీహిల్స్, మాదాపూర్‌తో పాటు కోర్ అర్బన్ ప్రాంతంలోని 13 రెస్టారెంట్లు, క్యాంటీన్లలో తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పలుచోట్ల ఆహార భద్రతా నిబంధనల ఉల్లంఘనలు గుర్తించినట్లు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో కమిషనర్ వెల్లడించారు.

## నాలుగు సంస్థలపై కఠిన చర్యలు..

చిక్కడపల్లిలోని ఎన్‌ఆర్ నందిని సుధా, వెంకల్‌రావునగర్‌లోని సాయి దర్శిని, యూనివర్సల్ రెస్టారెంట్, అమీర్‌పేటలోని హర్ష డీలక్స్ మెస్ సంస్థల ఆహార భద్రతా లైసెన్సులను సస్పెండ్ చేశారు. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ఆయా సంస్థలు వెంటనే కార్యకలాపాలు నిలిపివేయాలని ఆదేశించారు. ఎన్‌ఆర్ నందిని సుధాలో నేల దెబ్బతినడం, నీరు నిల్వ ఉండటం, ఆహార వ్యర్థాలు పేరుకుపోవడం, గోడలు, పైకప్పుపై మసి, జిడ్డు, వంటగదిలో దుర్వాసన, బొద్దింకల సమస్య వంటి లోపాలు గుర్తించారు. సాయి దర్శినిలో జిడ్డుతో నిండిన ఎగ్జాస్ట్, గోడలు, పైకప్పు పరిస్థితి, పగిలిన నేల, నీటి నిల్వ, ఆహార నిర్వాహకులకు సంబంధించిన ఆరోగ్య రికార్డుల లేమి, హెయిర్‌నెట్‌లు, అప్రాన్లు లేకుండా పనిచేయడం వంటి ఉల్లంఘనలు ఉన్నట్లు తెలిపారు.యూనివర్సల్ రెస్టారెంట్ వంటగది అపరిశుభ్రం గా ఉండటం, ఆహార పదార్థాలకు లేబుళ్లు లేకుండా ఫ్రిజ్‌లో నిల్వ చేయడం, జిడ్డుతో నిండిన ఎగ్జాస్ట్‌లు, తగినంత వెలుతురు లేకపోవడం, ఎలుకల సంచారం వంటి సమస్యలను అధికారులు గుర్తించారు. హర్ష డీలక్స్ మెస్‌లో పగిలిన టైల్స్‌తో తడి, జారుడుగా ఉన్న నేల, జిడ్డుతో నిండిన చిమ్నీ, స్టవ్, బొద్దింకల సమస్య, నీటి డిస్పెన్సర్‌లో చనిపోయిన బొద్దింకలు, పూడుకుపోయిన డ్రెయిన్, అపరిశుభ్రమైన వాషింగ్ ఏరియా, లేబుళ్లు లేని ముడి పదార్థాలు వంటి లోపాలు బయటపడ్డాయి.హఫీజ్‌పేటలోని ఇంపీరియల్ మల్టీక్యూజిన్ రెస్టారెంట్, మాదాపూర్‌లోని కోల్‌కతా హౌస్, ఐఏసీజీ హాస్టల్ మెస్ (పద్మశ్రీ క్యాంటీన్), అమీర్‌పేటలోని ఆనందోబ్రహ్మ ఫైన్ డైన్ రెస్టారెంట్, రాయలసీమ రుచులు, మాదాపూర్‌లోని అవునా రెస్టారెంట్, రాజుగారి బిర్యానీ సంస్థలకు తనిఖీల్లో గుర్తించిన ఉల్లంఘనలపై షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నారు. వివరణలను పరిశీలించిన అనంతరం జరిమానాలు విధించడంతో పాటు తదుపరి చర్య లు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. జూబ్లీహిల్స్‌లోని అబ్సల్యూట్ బార్బెక్యూలో గుర్తించిన లోపాలను సరిదిద్దుకోవాలని సూచిస్తూ మెరుగుదల నోటీసు జారీ చేయనున్నారు.

## లైసెన్స్ నిబంధనల ఉల్లంఘనలపైనా దృష్టి

కొన్ని సంస్థలు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ) తత్కాల్ విధానాన్ని దుర్వినియోగం చేస్తూ, రెస్టారెంట్ కేటగిరీకి బదులుగా చిన్న వ్యాపారుల కేటగిరీలో లైసెన్సులు పొందినట్లు అధికారులు గుర్తించారు. అలాగే పురుగుల నివారణ చర్యలకు సంబంధించిన రికార్డులు, ఆహార నిర్వాహకుల ఆరోగ్య వివరాలు అందుబాటులో లేకపోవడం, శాకాహార–మాంసాహార పదార్థాలను ఒకేచోట నిల్వ చేయడం, హెయిర్‌నెట్‌లు, గ్లౌజులు లేకుండా ఆహారాన్ని నిర్వహించడం వంటి ఉల్లంఘనలు నమోదయ్యాయి. తనిఖీల్లో సేకరించిన 16 ఆహార నమూనాలను పరీక్షలకు పంపనున్నారు. తిరిగి తనిఖీల్లోనూ నిబంధనలు పాటించని సంస్థలపై తదుపరి చర్యలు తీసుకుంటామని టిజి సేఫ్ కమిషనర్ స్పష్టం చేశారు.

# గ్రీన్‌ల్యాండ్ కాలనీ రోడ్డు పూర్తిచేయాలి



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చి పట్టణ పాలనను గాలికి వదిలేసి, కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదురుకుంటున్నారని బైరామల్ గూడ బిజెపి అధ్యక్షులు ఎరుకల మల్లేష్‌గౌడ్ ఆరోపించారు. మంగళవారం బైరామల్ గూడ పరిధిలోని గ్రీన్ ల్యాండ్ కాలనీ సీసీ రోడ్డు వేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వలన కాలనీ ప్రజలు, వహనదారులు ఇబ్బందులకు గురైతున్నారని తక్షణమే సంబంధిత అధికారులు కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్డు గత ఐదు నెలల క్రితం ప్రాంభించిన నేటికి పూర్తి కావడంలేవని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు గౌని వెంకటేష్, కంది శ్రీనివాస్ రెడ్డి, బూర ప్రకాష్, మల్లేష్ యాదవ్, వెంకటేష్ గౌడ్, పాపిరెడ్డి, బాలాజీ, మమత, బుచ్చయ్య, ధనంజయ, బిక్షపతి, రామేశ్వర్, అశోక్, రంజిత్ గౌడ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాల వలలో ముగ్గురు.. రూ.5.35 కోట్లు స్వాహా!

డిజిటల్ అరెస్ట్ పేరుతో బెదిరింపులకు భయపడొద్దు..

అత్యాశతో పెట్టుబడులు పెట్టొద్దు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

హైదరాబాద్ సిపి వి.సి సజ్జనర్



ప్రజాపక్షం/హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు కొత్త ఎత్తుగడలతో ప్రజల కష్టార్జితాన్ని కొల్లగొడుతున్నారని, క్షణిక భయానికి లేదా అధిక లాభాల ఆశకు లోనై మోసపోవద్దని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి సజ్జనర్ హెచ్చరించారు. తాజాగా ఒకే రోజు వెలుగుచూసిన మూడు సైబర్ మోసాల్లో బాధితులు ఏకంగా రూ.5.35 కోట్లు నష్టపోయారని తెలిపారు. ప్రజల అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోవచ్చని స్పష్టం చేశారు. ఓ సంస్థ అకౌంటెంట్ గుర్తుతెలియని జిప్ ఫైల్‌ను తెరిచి, సిఇఒ పేరుతో వచ్చిన నకిలీ వాట్సాప్ సందేశాలను నమ్మి రూ.2.70 కోట్లు బదిలీ చేశారు. ఎనిమిది రోజుల పాటు లావాదేవీలు జరిగినా బ్యాంకు సందేశాలను పరిశీలించకపోవడంతో భారీ నష్టం వాటిల్లిందని సిపి వివరించారు. మరో ఘటనలో 72 ఏళ్ల వృద్ధురాలిని మనీలాండరింగ్ కేసు, సిబిఐ,ఇడి పేర్లతో బెదిరించిన సైబర్ నేరగాళ్లు 'డిజిటల్ అరెస్ట్' నాటకంతో 20 రోజుల పాటు భయపెట్టి, బంగారం అమ్మించి మరీ రూ.2.12 కోట్లు కాజేశారు. ఇన్‌స్టాగ్రామ్‌లో రోజుకు 5 నుంచి 20 శాతం లాభాలంటూ వచ్చిన ప్రచారాన్ని నమ్మిన ఓ వైద్యుడు నకిలీ ట్రేడింగ్ యాప్‌లో రూ.52.51 లక్షలు పోగొట్టుకున్నారు. దేశ చట్టాల్లో 'డిజిటల్ అరెస్ట్' అనే విధానం లేదని, ఏ దర్యాప్తు సంస్థా ఆన్‌లైన్‌లో డబ్బులు డిమాండ్ చేయదని సజ్జనర్ స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల పేర్లతో వచ్చే ఫోన్లు, సందేశాలను సంబంధిత వ్యక్తులను నేరుగా సంప్రదించి ధ్రువీకరించుకోవాలని సూచించారు. అనుమానాస్పద లింకులు, అపరిచిత ఫైళ్లను తెరవొద్దని, అధిక లాభాల ఆశ చూపే పెట్టుబడి ప్రకటనలను నమ్మవద్దని కోరారు. సంస్థలు బ్యాంకు లావాదేవీల సందేశాలను ఎప్పటికప్పుడు పరిశీలించుకోవాలని, అనుమానాస్పద లావాదేవీలపై బ్యాంకులు కూడా తక్షణమే స్పందించాలని సూచించారు. 'జాగృత్ హైదరాబాద్–సురక్షిత్ హైదరాబాద్' కార్యక్రమంలో ఏడాది కాలంలో 11,417 అవగాహన సదస్సులు నిర్వహించి, సుమారు 5.06 లక్షల మందికి సైబర్ నేరాలపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 జాతీయ సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా cybercrime.gov.in ద్వారా ఫిర్యాదు చేయాలని సిపి సూచించారు.

# కోతలు లేకుండా 24 గంటలు విద్యుత్

బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగయ్య డిమాండ్





ప్రజాపక్షం/షాద్‌నగర్ : వ్యవసాయ రంగానికి కోతలు లేకుండా 24 గంటల పాటు విద్యుత్ అంధించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బికెఎంయు రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్దుల జంగయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో బికెఎంయు డివిజన్ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బుద్దుల జంగయ్య మాట్లాడుతూ విద్యుత్ కోతల కారణంగా చేతికొచ్చిన పంటలు ఎండిపోతున్నాయని, దాంతో అన్నదాతలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. జీపి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ సిద్దాపూర్ చెత్త దంపింగ్ యార్డు కోసం తీసుకువచ్చిన 641జీవోను దక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బికెఎంయు జిల్లా అధ్యక్షుడు జె.అంజయ్య మాట్లాడుతూ 200రోజులు పనులు కల్పించాలని, కొలతలతో సంబందం లేకుండా రోజు కూలీ రూ.800 ఇవ్వాలని, ప్రత్యేకమైన కార్పోరేషన్ ఏర్పాటు చేసి ఉపాధి కూలీల సమస్యలన్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

**బికెఎంయు డివిజన్ కమిటీ ఎన్నిక...** సమావేశంలో బికెఎంయు షాద్‌నగర్ డివిజన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జిల్లెల వెంకటేష్, కార్యనిర్వాహక అధ్యక్షులుగా రమేష్ యాదవ్, ఉపాధ్యక్షుడిగా ఎం.రాములు, యాదయ్య, ప్రధాన కార్యదర్శిగా కె.రాజునాయక్, సహాయ కార్యదర్శిగా భూపాల్, లింగమయ్య, కోశాధికారిగా రాములు గౌడ్‌తోపాటు 11మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

# క్రిష్టియన్ కాలనీలో దొంగల బీభత్సం

రూ.4లక్షల నగదు, 5 తులాల బంగారం, అర్థ కిలో వెండి చోరీ

ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: దైవ దర్శనానికి వెళ్ళేందుకు సామాగ్రిని సిద్ధం చేసుకొని నిద్రిస్తున్న ఓ ఇంట్లోకి దొంగలు చోరబడి భీభత్సం సృష్టించారు. మంగళవారం తెల్లవారుజామున షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని క్రిష్టియన్ కాలనీలో నివాసం ఉంటున్న సత్యం (సంధ్య కిరాణం షాపు) యాజమాని ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో ఇంటి ముందు భాగంలో ఉన్న కిరాణ షాపు నుంచి ఇంట్లోకి గుర్తు తెలియని దొంగలు చొరబడి భీభత్సవం సృష్టించినట్లు క్రైమ్ ఎస్ఐ శివారెడ్డి తెలిపారు. ఇంట్లో నుంచి రూ.4లక్షల నగదు, 5 తులాల బంగారం, అర్థకిలో వెండి చొప్పున వస్తువులు చోరీకి గురైనట్లు తెలిపారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు క్రైమ్ ఎస్ఐ శివారెడ్డి తెలిపారు.

# బంగారు మైసమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు



ప్రజాపక్షం/షాద్‌నగర్: బంగారు మైసమ్మ ఆలయంలో వైభవంగా నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. మంగళవారం మున్సిపల్ వైస్‌చైర్మన్ అందె మోహన్ ఆధ్వర్యంలో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ అందె మోహన్ ముదిరాజ్ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త అందె మోహన్ ముదిరాజ్‌తోపాటు పులిమామిడి రాజేష్ గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

# స్క్రాప్ షాప్ దోపిడీలో మరో నిందితుడి అరెస్టు



ప్రజాపక్షం/శంకర్ పల్లి : స్క్రాప్ షాప్ దోపిడీ కేసులో మరో నిందితుడిని అరెస్టు చేసినట్టు చేవెళ్ల డివిజన్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ సమరంరెడ్డి, శంకర్ పల్లి సిఐ రుద్వీర్ కుమార్ తెలిపారు. మంగళవారం శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పత్తేపురం ఫ్లైఓవర్ వద్ద ఉన్న స్క్రాప్ షాపులు అక్టోబర్ 8న తెల్లవారుజామున ముగ్గురు గుర్తుతెలియని దుండగులు స్క్రాప్‌ను విక్రయిస్తామని చెప్పి షాపులోకి వెళ్లి షాప్‌లో ఉన్న వ్యక్తిపై దాడి చేసి కత్తితో బెదిరించి రూ.25వేలు నగదు, ఒక సెల్‌ఫోను దోచుకెళ్లారు. ఈ కేసులో 9న మహమ్మద్ రబ్బానిని అదుపులోకి తీసుకోగా, మరో నిందితుడు మహమ్మద్ అజహార్ ఉద్దీన్ (30)(ఆటో డ్రైవర్)ను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్టు వెల్లడించారు. నిందితుడు బాలాపూర్‌లోని షాహిన్ నగర్‌కు చెందినవాడిగా గుర్తించారు. నిందితుడికి వాటాగా రూ.5000 ఇచ్చారని, వ్యక్తిగత ఖర్చులకు ఆ డబ్బుడు వాడుకున్నాడని కేసు దర్యాప్తులో వెల్లడించారు. మరో నిందితుడైన మహమ్మద్ సోహెల్ కురుషి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఈ మేరకు నిందితుడిని చేవెళ్ల మున్సిఫ్ కోర్టులో హాజరు పరచడం జరిగిందని తెలిపారు. కార్యక్రమం ఎఎస్ఐ నాగిరెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# 'ఎల్ నినో'ను ఎదుర్కొనేందుకు కార్యాచరణ

కలెక్టర్ సి.నారాయణరెడ్డి





ప్రజాపక్షం/రంగారెడ్డి : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు మండల, గ్రామస్థాయిలో పకడ్బందీ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరం నుంచి వ్యవసాయ, ఉద్యానవన, విద్యుత్, ఇరిగేషన్, షన్ భగీరథ, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు, ఎంపిడిఒలు, మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల వల్ల తలెత్తే సమస్యలు, వాటిని ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న తొమ్మిది నెలలపాటు తాగునీటి సరఫరా, పశువులకు నీరు, పశుగ్రాసం, రబీ పంటల సాగు, గ్రామీణ ప్రజలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పన అనే నాలుగు ప్రధాన అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి ఆవాస ప్రాంతం వారీగా తాగునీటి సరఫరాపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. మిషన్ భగీరథ పైపులైన్లలో లీకేజీలను గుర్తించి మరమ్మతులు చేపట్టాలని, ఓవర్‌హెడ్ ట్యాంకుల నుంచి నీటి వృథాను అరికట్టాలని, ప్రతి కుళాయికి ఆన్‌ఆఫ్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రత్యామ్నాయ నీటి వనరులైన బోర్లు, చేతిపంపులను గుర్తించి అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, పంపులు, మోటార్లలో తలెత్తే సమస్యలను 24 గంటల్లోగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

వేసవిలో పశువులకు తాగునీరు, పశుగ్రాసం కొరత ఏర్పడకుండా వ్యవసాయ, పశుసంవర్ధక శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామాల్లోని పశువుల నీటి తొట్లకు మరమ్మతులు చేపట్టాలని, అవసరమైన చోట ఉపాధి హామీ పథకం ద్వారా కొత్త నీటి తొట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో పశువుల సంఖ్య, అందుబాటులో ఉన్న పశుగ్రాసం, భవిష్యత్తులో అవసరమయ్యే పరిమాణాన్ని అంచనా వేసి ప్రణాళిక రూపొందించాలన్నారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, భూగర్భజలాల లభ్యత, సాగునీటి వనరులు, ఉష్ణోగ్రతలను పరిగణనలోకి తీసుకొని సాగు విస్తీర్ణాన్ని నిర్ణయించుకునేలా వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో రైతులకు మార్గనిర్దేశం చేయాలన్నారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో వరి పంటలకు బదులుగా ప్రత్యామ్నాయ, స్వల్పకాలిక పంటలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల వ్యవసాయ పనులు తగ్గే అవకాశం ఉన్నందున గ్రామీణ ప్రజలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ పథకం కింద చేపట్టగల పనులను గుర్తించి సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామం, ఆవాస ప్రాంతంలో అవసరమైన పనులను గుర్తించి అనుమతులు పొందాలని, నీటిసంరక్షణ, వర్షపు నీటినిల్వ, భూగర్భజలాల పెంపు, గ్రామీణాభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు, తహసీల్దార్లు,మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, విద్యుత్, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు సమన్వయంతో సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. రానున్న 15 రోజుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేసి, వాటి అమలుపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ కె.కిరణ్మయి, డిఆర్ఓ శారదాదేవి, సిపిఓ పి.సౌమ్య, జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, జిల్లా ఉద్యానవన అధికారి సురేష్‌తో పాటు సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

జంతర్ మంతర్ వద్ద ప్రదర్శనలను నిషేధిస్తే,

## దేశమంతా నిరసనస్థలిలు వెలుస్తాయ్

సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరిక



**హింగోలి :** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రదర్శనలను నిషేధిస్తే, దేశవ్యాప్తంగా నిరసన ప్రదేశాలు వెలుస్తాయని బొద్దింక జనతా పార్టీ (సిజెపి) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హెచ్చరించారు. ఢిల్లీకి వెళ్లే మార్గంలో పోలీసులు తనను అడ్డుకుంటే, ఎక్కడ నిర్బంధిస్తే అక్కడి నుంచే ఆందోళన ప్రారంభిస్తానని దీప్కే అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ సిజెపి నిర్వహిస్తున్న నిరసనలో పాల్గొనేందుకు తాను బుధవారం ఢిల్లీ చేరుకుంటానని కూడా తెలిపారు. మంగళవారం మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలో ఉన్న తన స్వగ్రామం సంతుక్ పింప్రిలో ఆయన మీడియాతో మాట్లాడారు. జంతర్ మంతర్ రోడ్‌ను నిర్దేశిత నిరసన స్థలం జాబితా నుండి తొలగించి, భారీ ప్రదర్శనల కోసం రామ్‌లీలా మైదాన్ (సెంట్రల్ ఢిల్లీ), బురారీ గ్రౌండ్ (నార్త్ ఢిల్లీ), సిబిడి గ్రౌండ్ (ఈస్ట్ ఢిల్లీ)లను మూడు కొత్త వేదికలుగా ఈనెల 11న జారీ చేసిన ఒక స్థాయీ ఉత్తర్వులో ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్ పేర్కొన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని దీప్కే విలేకరులతో అన్నారు. జంతర్ మంతర్ నిరసనలకు ఆత్మవంటిదని, ప్రజాస్వామ్య వ్యతిరేక గళాన్ని ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా అణచివేస్తున్నారని ఆయన ఆరోపించారు. 'నరేంద్ర మోదీకి ఆందోళనతో సమస్య ఉంది కానీ ఆందోళన జరిగే ప్రదేశంతో కాదు; ప్రజలు నిరసన తెలిపే ఆలోచనతోనే ఆయనకు సమస్య ఉంది, ఇవి ఒక నియంత లక్షణాలు' అని దీప్కే ఆరోపించారు. 'జంతర్ మంతర్‌ను నిరసన ప్రదేశంగా ప్రకటించకపోతే నిరసనలు ఆగిపోతాయని వారు భావిస్తే, యావత్ దేశమే జంతర్ మంతర్‌గా మారిపోతుంది. జంతర్ మంతర్ ప్రతి ఉద్యమకారుడి ఆత్మవంటిది' అని ఆయన పేర్కొన్నారు. ఎక్కడ నిరసన తెలుపుతారని అడిగినప్పుడు 'దేశమంతా జంతర్ మంతర్‌గా మారుతుంది, ఢిల్లీ కూడా జంతర్ మంతర్‌గా మారుతుంది' అని బదులిచ్చారు. ఢిల్లీలో అదుపులోకి తీసుకున్నప్పుడు తన బృంద సభ్యులు త్రివర్ణ పతాకాన్ని కలిగి ఉన్నారని, ఒకవేళ అది చట్టవిరుద్ధం అయితే, అధికారంలో ఉన్నవారే పెద్ద దేశద్రోహులు అవుతారని ఆయన అన్నారు. జంతర్ మంతర్ వద్ద జాతీయ జెండాను ఎగురవేసిన తర్వాత అశుతోష్ రంకా, సౌరవ్ దాస్‌లను అదుపులోకి తీసుకోవడంపై సిజెపి న్యాయ బృందం కోర్టును ఆశ్రయిస్తుందని ఆయన తెలిపారు.

రాహుల్‌గాంధీ పిటిషన్‌ను...

## విచారణకు జాబితా చేయని 'సుప్రీం'

• ఖర్గే ఐడి కార్డు స్పష్టమైన కాపీ సహా, 14లోపాలను గుర్తించిన 'రిజిస్ట్రీ'



**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ అక్టోబరు 12న నిర్వహించిన పాదయాత్ర అనంతరం, ఆయన సహా 10మంది ప్రతిపక్ష నాయకులు దాఖలు చేసిన పిటిషన్‌ను, రిజిస్ట్రీ గుర్తించిన లోపాలను ఇంకా సరిదిద్దనందున, మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జాబితా చేయలేదు. సుప్రీంకోర్టు వెబ్‌సైట్ ప్రకారం, ఈ కేసులో సహ–పిటిషనర్‌గా ఉన్న కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గే గుర్తింపుకార్డుకు సంబంధించిన స్పష్టమైన కాపీ లేకపోవడం సహా 14లోపాలను అపెక్స్ కోర్టు రిజిస్ట్రీ గుర్తించింది. పిటిషన్‌లోని కొన్ని అస్పష్టంగా ఉన్న లేదా లేని పేజీలను కూడా రిజిస్ట్రీ ఎత్తి చూపింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషన్‌కు సంబంధించిన సమస్యలు, పలువురు విద్యార్థుల ఏకపక్ష అరెస్టులు, మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు వంటి అంశాలపై వినతిపత్రం సమర్పించేందుకు సమావేశం ఏర్పాటు చేయాలన్న రాహుల్ గాంధీ అభ్యర్థనకు భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్ స్పందిస్తూ, ఒకవేళ ఆ పిటిషన్ దాఖలు చేస్తే, న్యాయవ్యవస్థలో దానిపై త్వరగా విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు. మంగళవారం సిజెఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం లోపాలను సరిదిద్దినట్లయితే, పిటిషనర్ల కేసులను విచారణకు స్వీకరిస్తామని వారికి హామీ ఇచ్చింది. 'మేం ఈ విషయాన్నింటినీ జాబితా చేస్తాం. లోపాలు సరిదిద్దబడ్డాయని నిర్ధారించుకోండి' అని ఒక పాత్రికేయుడి తరపున ఈ విషయాన్ని ప్రస్తావించిన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణన్‌తో సిజెఐ సూర్యకాంత్ అన్నారు. రాహుల్‌గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, తృణమూల్ కాంగ్రెస్ ఎంపి సౌగతా రాయ్, సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేష్ యాదవ్, రాష్ట్రీయ జనతా దళ్ నాయకుడు తేజస్వీప్రసాద్ యాదవ్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (శరద్ పవార్) నేత సుప్రియా సూలే, శివసేన–యుబిటి నాయకుడు సంజయ్ రౌత్, భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శి డి.రాజా, జార్ఖండ్ ముక్తి మోర్చా ఎంపి మహువా మాఝీ, సిపిఐ (ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.బేబీ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్) నాయకుడు ఇ.టి. మొహమ్మద్ బషీర్ కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌లో సహ–పిటిషనర్లుగా ఉన్నారు. ఎన్నికల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ('సర్')లో పెద్దయెత్తున్న ఓటర్ల తొలగింపు, అవకతవకలు జరిగాయని పిటిషన్‌లో ఆరోపించారు. ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్) సమయంలో చేసిన తొలగింపులు, మార్పులపై కాలపరిమితితో కూడిన స్వతంత్ర ఆడిట్ నిర్వహించడానికి, విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో సాంకేతిక నిపుణులు, ఇతర ప్రముఖ పౌరుల సహాయంతో ఒక స్వతంత్ర కమిటీ ఏర్పాటు చేయాలని కోరింది. చట్టానికి అనుగుణంగా నోటీసు ఇవ్వకుండా, విచారణ అవకాశం కల్పించకుండా ఏ ఓటరును కూడా ఓటరు జాబితా నుండి తొలగించకూడదని, అలాగే పంజాబ్, ఎన్నికలకు వెళుతున్న ఇతర రాష్ట్రాలలోని అర్హులైన వ్యక్తులు చట్టం అనుమతించిన చివరి తేదీ వరకు ఓటర్ల జాబితాలో చేర్చడానికి దరఖాస్తు చేసుకునేందుకు అనుమతించాలని కూడా అది ఆదేశించాలని కోరింది. 'అర్హులైన ఓటర్ల హక్కులను పరిరక్షించడం, ఎన్నికల ప్రక్రియ సమగ్రతను కాపాడటం కోసం, ప్రస్తుత పిటిషన్‌లో లేవనెత్తిన సమస్యలను పరిశీలించి, తీర్పు ఇచ్చే వరకూ రాష్ట్రాల వ్యాప్తంగా కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్‌ఐఆర్)ను నిలిపివేస్తూ మధ్యంతర ఉ త్తర్వును జారీ చేయాలి' అని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌లో భారత ఎన్నికల సంఘం, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్‌సంధు, వివేక్ జోషిలను ప్రతివాదులుగా చేర్చారు. చట్టబద్ధమైన అధికారాలు లేకుండా ఏవైనా నిర్ణయాలు తీసుకున్నట్లయితే, వాటిని రద్దు చేయాలని పిటిషనర్ కోరారు. అంతకుముందు, వినతిపత్రం సమావేశం ఏర్పాటు చేయాలన్న మల్లి కార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీల అభ్యర్థనను సిజెఐ సూర్యకాంత్ తిరస్కరించారు.

## పరీక్ష రోజే 'ఎఐ'తో ప్రశ్నపత్రాల తయారీ

పేపర్ లీకేజీలకు చెక్ పెట్టేందుకు నందన్ నీలేకని ప్రతిపాదన



**న్యూఢిల్లీ :** దేశంలో పరీక్షల నిర్వహణలో పారదర్శకతను పెంచి, ప్రశ్నపత్రాల లీకేజీలకు అడ్డుకట్ట వేయడానికి సాంకేతికతను విస్తృతంగా వినియోగించాలని యుఐడిఎఐ మాజీ చైర్మన్, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని సూచించారు. పరీక్ష జరిగే రోజునే ఎఐ సాయంతో ప్రశ్నపత్రాన్ని రూపొందించే విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ముందుగానే ప్రశ్నపత్రాలను తయారు చేసి భద్రపరిచే పద్ధతికి బదులుగా చివరి నిమిషంలో ప్రశ్నలను ఎంపిక చేసి పేపర్ రూపొందిస్తే లీకేజీలకు అవకాశాలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. మంగళవారం భారత్‌లో నిర్వహించిన బ్లూమ్‌బెర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో పాల్గొన్న నీలేకని, దేశ పరీక్షల వ్యవస్థలో సమూల మార్పుల అవసరాన్ని వివరించారు. ప్రస్తుతం పరీక్షలకు ముందుగానే ప్రశ్నపత్రాలను రూపొందించి, వాటిని భద్రపరిచి, పరీక్షా కేంద్రాలకు పంపిణీ చేసే విధానంలో లీకేజీలకు అవకాశాలు ఏర్పడుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారంగా ప్రశ్నపత్రాల తయారీ విధానంలోనే మార్పులు తీసుకురావాలని నీలేకని సూచించారు. ఒకే ప్రశ్నపత్రాన్ని ముందుగానే సిద్ధం చేయడానికి బదులుగా, పెద్ద సంఖ్యలో ప్రశ్నలతో కూడిన ప్రశ్నల బ్యాంకును రూపొందించాలని ప్రతిపాదించారు. పరీక్ష జరిగే రోజున, చివరి నిమిషంలో ఆ బ్యాంకు నుంచి ప్రశ్నలను ఎంపిక చేసి ప్రశ్నపత్రాన్ని తయారు చేయవచ్చని వివరించారు. ఇలా చేయడం వల్ల ముందుగానే ప్రశ్నపత్రాన్ని సంపాదించి విక్రయించాలనే అక్రమ ప్రయత్నాలకు అవకాశాలు తగ్గుతాయని అభిప్రాయపడ్డారు.

**ప్రశ్నపత్రాల తయారీలో ఎఐ వినియోగం**

ప్రశ్నల బ్యాంకు నుంచి పరీక్ష జరిగే రోజే ప్రశ్నపత్రాన్ని రూపొందించేందుకు కృత్రిమ మేధ (ఎఐ)ను ఉపయోగించవచ్చా? అన్న ప్రశ్నకు నీలేకని సానుకూలంగా స్పందించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పరీక్షా పత్రాలను రూపొందించే అవకాశాలను పరిశీలించవచ్చని సూచించారు. పరీక్షల సంస్కరణల్లో భాగంగా దేశవ్యాప్తంగా కంప్యూటర్ ఆధారిత పరీక్షల (సిబిటి) నిర్వహణను విస్తరించే అంశాన్నీ కమిటీ పరిశీలిస్తోందని నీలేకని వెల్లడించారు. ప్రస్తుతం ఇలాంటి పరీక్షలు రాయడానికి దేశంలో సుమారు 1.5 లక్షల ప్రదేశాల్లో సదుపాయాలు ఉన్నాయని తెలిపారు. అన్ని పరీక్షలను కంప్యూటర్ ఆధారిత విధానంలో నిర్వహించాలంటే ఈ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

**నీట్–యుజి పేపర్ లీకేజీ తర్వాత టాస్క్‌ఫోర్స్**

దేశంలో పరీక్షల నిర్వహణ వ్యవస్థలో సంస్కరణల అవసరాన్ని నీట్‌యుజి ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారం మరోసారి తెరపైకి తెచ్చింది. 2026 మేలో ప్రశ్నపత్రం లీక్ కావడంతో వైద్య విద్య ప్రవేశ పరీక్షను రద్దు చేసి, మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. ఈ పరిణామం దేశవ్యాప్తంగా విద్యార్థుల నిరసనలకు దారితీసింది. అనంతరం అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఈ వ్యవహారం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో మార్పులను సూచించేందుకు జులైలో కేంద్రం ఉన్నతస్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. దీనికి నందన్ నీలేకని నేతృత్వం వహిస్తున్నారు. ప్రశ్నపత్రాల భద్రత, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పరీక్షల నిర్వహణ విధానాల్లో మార్పులు వంటి అంశాలపై కమిటీ పరిశీలన జరుపుతోంది.

## భారత్ స్వతంత్రంగా ఎదుగుతోంది

• బ్లూమ్‌బెర్గ్ సదస్సులో మోదీ



**న్యూఢిల్లీ:** భారతదేశం ఎవరికీ హాని కలగజేయకుండా, స్వతంత్రంగా ప్రపంచంతో కలిసి అభివృద్ధి చెందుతుందని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అన్నారు. న్యూఢిల్లీలో బ్లూంబెర్గ్ న్యూ ఎకానమీ వేదికపై మంగళవారం మోదీ మాట్లాడుతూ,భారతదేశం ఎవరిమీదా ఆధారపడి అభివృద్ధి చెందదు,భారతదేశ నిరంతర అభివృద్ధి నిరంతర సంస్కరణలపైన, బలమైన పునాదులపైన, పరిస్థితులకు అనుగుణంగా తనను తాను మలచుకునే ఆర్థిక వ్యవస్థపైనా ఆధారపడి అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రపంచంకోసం భారతదేశం ఎదుగుతుంది, ప్రపంచంతో సమానంగా భారతదేశం కలిసి అభివృద్ధి చెందుతుంది, భారత్ వల్ల ప్రపంచానికి మేలు కలుగుతుంది అన్నారు. అమెరికాకు వెళ్ళి ఉద్యోగాలు చేసే భారతీయులపై అనుసరిస్తున్న కఠినవైఖరి, భారతీయులు వచ్చి అమెరికన్ల ఉద్యోగాలు దోచుకున్నారని ట్రంప్ పాలకవర్గం నుండి వస్తున్న విమర్శలతోపాటు అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ మంగళవారం విడుదల చేసిన "ఎకనామిక్ ఔట్‌లుక్"ముందస్తు అంచనాలలో భారతదేశ ఆర్థికవృద్ధిని చైనా సహా అగ్రదేశాలకంటే ఎక్కువగా ఈ ఏడాది వచ్చే ఏడాది ఏడూశాతంగా చూపించిన పూర్వరంగంలో మోదీ ఈ విషయం చెప్పారు. చైనా వృద్ధి అంచనాలను నాలుగుశాతంగా పేర్కొనగా భారత్ అంచనాలను ఏడూశాతంగా ఐఎంఎఫ్ పేర్కొంది. భారతదేశం తన ఆర్థిక వ్యవస్థను, సాంకేతిక సామర్థ్యాన్ని విస్తరించుకుంటున్నదని, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ ప్రపంచ సవాళ్ళను ఇది పరిష్కరిస్తుందని చెప్పారు. భారతదేశం ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో 7.8 శాతం ఆర్థికవృద్ధిని నమోదు చేసిందని ఈ వేదికపై గుర్తుచేశారు. విదేశీ మారక నిల్వలు కూడా 700 బిలియణ డాలర్లు దాటాయని చెప్పారు. ప్రపంచం అనిశ్చితిలో పడి కొట్టుమిట్టాడుతున్నవేళ భారతదేశం విశ్వసనీయతను, స్థిరత్వాన్ని సాధించి ప్రపంచదేశాలకు నమ్మకం కలిగించిందన్నారు. భారత్ ఆర్థిక వ్యవస్థ ప్రపంచలో ఏ ఇతర పెద్ద ఆర్థిక వ్యవస్థలకంటే వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. బలమైన పునాదులు ఉండటంవల్లనే ఇది సాధ్యపడిందని చెప్పారు. ఈనాడు సాంకేతిక పరిజ్ఞానమే శక్తి, డేటాయే మహా శక్తి,విజ్ఞానమే గొప్ప శక్తి, ఆధునిక ఆవిష్కరణలే బలం,శక్తి అంతేతప్ప ఎవరి చేతుల్లో అధికారం ఉందనేది ముఖ్యం కాదని అన్నారు.

## రాముడి పేరుతో పేదల హక్కులపై దాడి

• విబి– జి రామ్ జి పథకంలో హాజరులో మోసంపై కాంగ్రెస్ మండిపాటు



**న్యూఢిల్లీ :** 'ఎంజి నరేగా' స్థానంలో ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'విక్షిత్ భారత్ గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవికా మిషన్ (గ్రామీణ్)' (విబి– జి రామ్ జి) పథకంలో కార్మికుల హాజరు నమోదుకు సంబంధించి భారీ మోసం జరిగిన ఒక మీడియాలో కథనాలు వచ్చాయి. దీనిపై కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. శ్రీరాముని పేరును ప్రస్తావిస్తూనే పేదల హక్కులపై దాడి చేయడం బిజెపి అసలు నైజమని ఆ పార్టీ పేర్కొంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఒక మీడియా నివేదికకు సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను ఎక్స్‌లో పంచుకున్నారు. విబి– జి రామ్ జి పథకంలో ఒక మోసం వెలుగుచూసిందని ఆ నివేదిక పేర్కొంది. అధికారిక 'నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్' (ఎన్‌ఎంఎంఎస్) యాప్‌ను పోలి ఉండే ఒక 'క్లోన్ యాప్'ను ఉపయోగించి, మొబైల్ ఫోన్లలో నిల్వ ఉన్న ఫోటోల ద్వారా పెద్ద ఎత్తున హాజరును నమోదు చేస్తున్నట్లు అందులో వెల్లడైంది. ఈ నేపథ్యంలో జైరామ్ రమేశ్ ఎక్స్‌లో స్పందిస్తూ మొదట శ్రీరాముని పేరుతో ఇచ్చిన విరాళాల చోరీ; ఆ తర్వాత నరేగా కింద 100 రోజుల ఉపాధి హక్కుపై దాడి; ఇప్పుడు విబి– జి రామ్ జి కార్యక్రమంలో నకిలీ హాజరు రికార్డుల ద్వారా పేదలను దోచుకునే ప్రభుత్వ ప్రేరేపిత కుట్ర!'. శ్రీరాముని పేరును ప్రస్తావిస్తూనే పేదలపై దాడి చేయడం, వారి ఉపాధి హక్కును హరించడం జరుగుతోంది' అని రమేశ్ అన్నారు. 'ఇది కేవలం అవినీతి మాత్రమే కాదు; ఇది విశ్వాసానికి ద్రోహం, పేదల హక్కుల చోరీ ఇవన్నీ భక్తి, ఉపాధి పేరుతో జరుగుతున్నాయి అని ఆయన పేర్కొన్నారు. బిజెపి రాజకీయాల్లో శ్రీరాముని పట్ల నిజమైన భక్తి గానీ, పేదల పట్ల సానుభూతి గానీ కనిపించడం లేదని రమేశ్ ఆరోపించారు. 'శ్రీరాముని పేరును ప్రస్తావిస్తూనే అధికార రాజకీయాలకు పాల్పడటం, పేదల హక్కులపై దాడి చేయడం ఇదే బిజెపి అసలైన పనితీరు, నైజం, నిజ స్వరూపం' అని రమేష్ అన్నారు.

## రాహుల్‌గాంధీపై పరువునష్టం కేసు 'సుప్రీం' స్టే

**న్యూఢిల్లీ :** మహారాష్ట్రలోని ఒక ట్రయల్ కోర్టులో రాహుల్ గాంధీపై దాఖలైన ఒక పరువు నష్టం కేసులో తదుపరి విచారణను సుప్రీంకోర్టు మంగళవారం నిలిపివేసింది. 2019లో ప్రధానమంత్రి నరేంద్రమోదీపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు సంబంధించి ట్రయల్ కోర్టులో ఈ పరువునష్టం కేసు దాఖలైన విషయం తెలిసిందే. న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అరేశ్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం మహారాష్ట్ర ప్రభుత్వానికి ఫిర్యాదుదారు ఎం.హెచ్. శ్రీ శ్రీమల్‌కు నాలుగు వారాల్లోగా స్పందన కోరుతూ నోటీసులు జారీ చేసింది. తనకు జారీచేసిన సమన్లను రద్దు చేయడానికి నిరాకరిస్తూ బాంబే హైకోర్టు సెప్టెంబరు 8న ఇచ్చిన ఉత్తర్వుకు వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్‌పై 'నాలుగు వారాల్లోగా తిరిగి హాజరు కావాల్సిన నోటీసు జారీచేయండి. ట్రయల్ కోర్టులో తదుపరి విచారణ నిలిపివేయబడుతుంది'అని ధర్మాసనం ఆదేశించింది. రాయ్‌బరేలీ ఎంపి తరుపున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ సుప్రీంకోర్టు గత తీర్పులను ప్రస్తావిస్తూ, ఈ విషయంలో, చట్టం స్థిరపడిందని అన్నారు. నాలుగు వారాల తర్వాత, తదుపరి విచారణ కోసం ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణను వాయిదా వేసింది. పరువు నష్టంకేసులో 2019లో రాహుల్ గాంధీకి జారీ చేసిన సమన్లను రద్దు చేయడానికి సెప్టెంబరు 8న బాంబే హైకోర్టు నిరాకరించింది.శ్రీ శ్రీ మాల్ ఫిర్యాదు మేరకు తనపై చర్యలు చేపట్టాలని గిర్గామ్ మెజిస్ట్రేట్2019 ఆగస్టు 28న జారీచేసిన ఉత్తర్వును సవాల్‌చేస్తూ రాహుల్ గాంధీ దాఖలు చేసిన పిటిషన్‌ను అది కొట్టివేసింది. అయితే, గాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు వీలుగా, ఫిర్యాదుపై విచారణను నాలుగు వారాల పాటు వాయిదా వేయాలని మెజిస్ట్రేట్‌ను ఆదేశిస్తూ హైకోర్టు తన 2021నాటి ఉత్తర్వును కొనసాగించింది. తాను కూడా బిజెపి సభ్యుడిగా తన నాయకుడిపై చేసిన వ్యాఖ్యలతో బాధపడ్డానని పేర్కొంటూ, శ్రీ శ్రీ మాల్ హైకోర్టులో గాంధీ పిటిషన్‌ను వ్యతిరేకించారు. 2018 సెప్టెంబరు 20న రాజస్థాన్‌లో ప్రధాని మోదీ చేసిన బహిరంగ ప్రసంగాన్ని అవమానించారని ఫిర్యాదులో ఆరోపించారు.

## ఇండోనేసియా నౌక బోల్తా:140 మంది గల్లంతు

• 102 మంది సురక్షితం:తీవ్ర గాలింపు

**జకర్తా:** ఆగ్నేయాసియా దేశం ఇండోనేసియాలో ప్రయాణికులతో వెళుతున్న వర్గో ట్రాన్స్‌పోర్ట్–8 నౌక బోల్తా పడింది. ఇందులో ప్రయాణం చేస్తున్న 140 మంది గల్లంతయ్యారు.వారికోసం తీవ్ర గాలింపు చేపట్టారు.జావా సముద్రంలో ఆదివారం ప్రయాణం చేస్తున్న నౌకలో మొత్తం 243 మంది ఉన్నారు. ప్రతికూల వాతావరణం కారణంగా నౌక బోల్తా పడింది.102 మంది ప్రయాణికులను రక్షించారు.ఒక ప్రయాణికుడి మృతదేహాన్నిస్వాధీనం చేసుకున్నారు.నౌక చివరిసారిగా కనిపించిన ప్రదేశం మొత్తాన్ని తీవ్రంగా గాలిస్తున్నారు.తూర్పు జావా ప్రాంతంలో అతిపెద్ద నగరం సురబయ నుండి బోర్నియో ద్వీపం కలిమంతన్ రాష్ట్రంలోని బంజర్ మాసిన్ నగరానికి వెళుతున్న సమయంలో నౌక ప్రతికూల వాతావరణంలో చిక్కుకుంది.నౌక అల్లకల్లోలంగా ఉందని,10 అడుగుల ఎత్తువరకూ కెరటాలు ఎగిసిపడుతున్నాయని కెప్టెన్ చివరిసారిగా సందేశం పంపించారు.నౌక ఒకవైపుకు వంగిపోతోందని భయాందోళన వ్యక్తం చేస్తూ సహాయం అందించాలని చివరిసారి కెప్టెన్ అర్థించారు.నౌక బోల్తా పడిపోతోందనే సమాచారం తమకు కొద్ది నిమిషాల ముందే చేరుకుందని,తాము వెంటనే అప్రమత్తమై రక్షణ నౌకను పంపినట్లు సెర్చ్ అండ్ రెస్క్యూ ఆపరేషన్స్ కార్యాలయం అధిపతి ఐ పుటు సుదాయన చెప్పారు.నౌకతో సంబంధాలు తెగిపోయిన రెండు గంటల తర్వాత తమకు సమాచారం అందిందని కలిమంతన్ రాష్ట్రంలోని బంజర్ మాసన్ నగర రక్షణ సంస్థ పేర్కొంది.ఈ ఫెర్రీలో 213 మంది ప్రయాణికులు,30 మంది సిబ్బంది ఉన్నారు.గమ్యస్థాన నగరం సురబయకు 148 కి.మీ దూరంలో నౌక మునిగిపోయినట్లు అధికారులు గుర్తించారు.శనివారం ఉదయం 10.30 గంటలకు నౌక బయలుదేరి ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయానికి గమ్యం చేరుకోవాల్సి ఉండగా ఈ దుర్ఘటన సంభవించింది.ప్రయాణికుల రవాణ, సరుకు రవాణాకు వీలుగా జపాన్‌లో ఈ నౌక తయారైంది.17,000 ద్వీపాల సముదాయంగా ఉన్న ఇండోరుపిమాలో నౌకా రవాణా సర్వసాధారణం. పర్యాటక ప్రాంతమైన ఇండోనేసియా బాలిద్వీపంలో గతనెలలో ఒక నౌకలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదం నుండి ఆనాడు 211 మందిని రక్షించారు. ఫిలిప్పీన్స్‌లో ఒక ప్రయాణికుల ఫెర్రీ పూర్తిగా కాలిపోయి 76 మంది మరణించగా,పదిమంది గల్లంతయ్యారు. వారి ఆచూకీ ఇంకా తెలియలేదు. ఈ ఘటన జరిగిన నాలుగు రోజులకే ఇండోనేసియా నౌక ప్రమాదం సంభవించింది.

## పాకిస్థాన్‌లో పట్టాలు తప్పిన రైలు

• ఆరుగురు ప్రయాణికులు మృతి

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్‌లో మంగళవారం తెల్లవారుజామున రెహమాన్ బాబా ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడంతో ఆరుగురు ప్రయాణికులు మరణించారు. మరో 40 మంది గాయపడ్డారు.కరాచీ నుండి పెషావర్‌కు వెళుతున్న ఈ ఎక్స్‌ప్రెస్ పంజాబ్ రాష్ట్రం ముల్తాన్ జిల్లా పెర్‌షా బ్రిడ్జి వద్ద పట్టాలు తప్పింది.గాయపడిన వారిని నిష్తార్ ఆసుపత్రికి తరలించారు.పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ,ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ ఈ ఘటనపట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు.మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు.పాకిస్థాన్‌లో రైలు ప్రమాదాలు సహజంగా మారాయి.కాలం చెల్లిన పట్టాలు,పెట్టుబడులు లేకపోవడం,నిర్వహణావ్యవస్థలోపాలవల్లతరుచుగా రైలు ప్రమాదాలు జరుగుతున్నాయి.2023లో దక్షిణ పాకిస్థాన్‌లో జరిగిన రైలు ప్రమాదంలో 30 మంది మరణించారు.90 మంది గాయపడ్డారు.

ఓట్లనే కాదు...

## పొదుపునూ దోచుకుంటోంది!

• ద్రవ్యోల్బణం పెరుగుదలపై జైరామ్ రమేశ్ తీవ్ర విమర్శలు



**న్యూఢిల్లీ :** దేశంలో ద్రవ్యోల్బణం పెరుగుదలపై కాంగ్రెస్ మంగళవారం కేంద్రంపై విమర్శలు గుప్పించింది. 'అచ్చే దిన్' ఇస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఓట్లను దొంగిలించడమే కాకుండా పొదుపును కూడా దోచుకుంటోందని మండిపడింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'జోలా' (చేపల తొట్టి) పట్టుకుని వెళ్లిపోవాల్సిన సమయం ఆసన్నమైందని పేర్కొంది. ద్రవ్యోల్బణం పెరుగుతూనే ఉందని, 'ఓటు దొంగతనం'పై ప్రజాగ్రహం అధికమవుతూనే ఉందని, కానీ ప్రధానమంత్రి మాత్రం ఒక 'మౌనీ బాబా'లా కూర్చున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. జాతీయ గణాంకాల కార్యాలయం (ఎన్‌ఎస్‌ఒ) ప్రకారం, ఆహార ద్రవ్యోల్బణం గత నెలలో 5.97 శాతం నుంచి సెప్టెంబర్‌లో 7.74 శాతానికి పెరిగింది. 'ఓట్ల దొంగతనం నిజం, నడుము విరిచే ద్రవ్యోల్బణం వాస్తవం. సెప్టెంబర్‌లో ద్రవ్యోల్బణం 5.54 శాతానికి చేరిందని వార్తా శీర్షికలు నివేదిస్తున్నాయి, కానీ అసలు విషయం ఏమిటంటే ఆహార ద్రవ్యోల్బణం 7.74 శాతానికి చేరింది. అంటే దాదాపు ప్రతి ఆహార పదార్థం ధర అన్ని హద్దులు దాటింది. ఉదాహరణకు, ఉల్లిపాయల ధరలు 108 శాతం, వెల్లుల్లి 55, అల్లం 63, నిమ్మకాయల ధరలు 36 శాతం పెరిగాయి' అని రమేశ్ ఎక్స్‌లో హిందీలో పేర్కొన్నారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, రిటైల్ ద్రవ్యోల్బణం మార్చిలో 3.40 శాతం నుండి సెప్టెంబర్‌లో 5.54 శాతానికి స్థిరంగా పెరిగిందని, ఇది గత 23 నెలల్లో అత్యధిక స్థాయికి చేరిందని ఆయన తెలిపారు. 'ద్రవ్యోల్బణం ప్రభావం కేవలం భోజనానికే పరిమితం కాలేదు. రవాణా, విద్య, బట్టలుబూట్లు, గృహోపకరణాలు వంటి నిత్యావసరాల ధరలు కూడా పెరుగుతున్నాయి' అని రమేష్ పేర్కొన్నారు. 'పేదలు తమ తిండిని కోల్పోతున్నారు, మధ్యతరగతి ప్రజల జేబుల్లోని పొదుపు కనుమరుగవుతోంది, అప్పుల భారం పెరుగుతూనే ఉంది, కానీ ప్రధానమంత్రి అహంకారంలో మునిగిపోయి ప్రజల కష్టాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. 'అచ్చే దిన్' ఇస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఓట్లను దొంగిలించడమే కాకుండా పొదుపును కూడా దోచుకుంటోంది' అని రమేష్ అన్నారు. 'ఓట్లను దొంగిలించే ప్రభుత్వానికి ప్రజల ఆగ్రహానికి గానీ, ఓట్లు కోల్పోతామనే భయం గానీ లేనప్పుడు, అది ప్రజల గురించి ఎందుకు పట్టించుకుంటుంది?' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రశ్నించారు. 'ఇప్పుడు సరిగ్గా అదే జరుగుతోంది. ద్రవ్యోల్బణం పెరుగుతూనే ఉంది, ఓట్ల అపహరణపై ప్రజల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది, కానీ ప్రధాన మంత్రి మాత్రం మౌన మునిలా ఉండిపోయారు' అని రమేశ్ అన్నారు. జనవరిలో 2024 ఆధార సంవత్సరంతో కూడిన కొత్త శ్రేణి అమల్లోకి వచ్చినప్పటి నుండి సెప్టెంబర్ ద్రవ్యోల్బణ గణాంకాలు అత్యధిక స్థాయికి చేరాయి. గత వారం, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన కీలక రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 5.50 శాతానికి చేర్చింది; దాదాపు నాలుగేళ్లలో రేటును పెంచడం ఇదే మొదటిసారి. అదే సమయంలో, పెరుగుతున్న ద్రవ్యోల్బణం, బలహీనపడిన రూపాయి విలువ, ముడి చమురు ధరల నేపథ్యంలో, సమీప భవిష్యత్తులో వడ్డీ రేట్ల తగ్గింపు ఉండదని, మరిన్ని పెంపుదలలు ఉండవచ్చని కూడా అది సంకేతాలు ఇచ్చింది.

మెట్రో, రైలు సర్వీసుల ఆంక్షల పిటిషన్లపై...

## విచారణను అక్టోబరు 15కు 'సుప్రీం' వాయిదా

**న్యూఢిల్లీ :** ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా అక్టోబరు 10న జరుగనున్న ఆందోళనల నేపథ్యంలో, నిరసనలు, మెట్రో స్టేషన్ల మూసివేత, రైలు సర్వీసుల అంతరాయాలకు సంబంధించిన పిటిషన్లపై విచారణను జస్టిస్ వి.మోహన అనారోగ్యం కారణంగా సుప్రీంకోర్టు గురువారానికి వాయిదా వేసింది. మంగళవారం (అక్టోబరు 13) ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన పలు కీలక పిటిషన్లపై విచారణ జరపాల్సి ఉంది. అనారోగ్యంతో ఉన్న జస్టిస్ వి.మోహన విచారణలో పాల్గొన్నారు. ప్రారంభంలో, జస్టిస్ వి.మోహన అనారోగ్యంతో ఉన్నప్పటికీ కోర్టుకు వచ్చారని సిజెఐ సూర్యకాంత్ న్యాయవాదులకు చెప్పారు. ఆరోగ్య సమస్యలను విస్మరించకూడదని చెబుతూ, విచారణను వాయిదావేయాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనాన్ని కోరారు. గోపాల్ శంకరనారాయణ సహా ఇతర సీనియర్ న్యాయవాదులు కూడా ఈ వాయిదాకు అంగీకరించారు. అక్టోబరు 10వ తేదీ నిరసనలకు ముందు మెట్రో, రైలు సేవలను పూర్తిగా నిలిపివేయవద్దని సుప్రీంకోర్టు ఇచ్చి ఆదేశాన్ని ధిక్కరించినందుకు కోర్టు ధిక్కరణ కింద దాఖలైన పిటిషన్‌పై స్పందన దాఖలు చేయడానికి కేంద్రానికి మంగళవారం వరకు గడువు ఇచ్చారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి తెలిపారు. 'అఫిడవిట్ సిద్ధంగా ఉంది. దానిని మరింత సమగ్రంగా చేయడానికి నేను కొన్ని విషయాలు జోడించాలని అనుకుంటున్నాను' అని తుషార్ మెహతా చెప్పారు. అఫిడవిట్‌ను దాఖలు చేయడానికి బెంచ్ గడువు పొడిగించింది. దానిని పిటిషనర్ల తరపున హాజరయ్యే న్యాయవాదులకు అందజేయాలని ఆదేశించింది.

## ఎన్‌ఎస్‌యుఐ మెరుపు నిరసన



**న్యూఢిల్లీ :** ఎన్నికల అవకతవకల ఆరోపణల నేపథ్యంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) జ్ఞానేష్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ, కాంగ్రెస్ విద్యార్థి విభాగమైన నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఎస్‌యుఐ) మంగళవారం రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్ వద్ద ఆకస్మిక నిరసన చేపట్టింది. ఈ నిరసనకు ఎన్‌ఎస్‌యుఐ జాతీయ అధ్యక్షుడు వినోద్ జాఖర్ నాయకత్వం వహించగా, వందలాది మంది కార్యకర్తలతో పాటు ఆయనను కూడా అదుపులోకి తీసుకున్నారని ఆ విద్యార్థి సంఘం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. రాజీవ్ చౌక్ మెట్రో స్టేషన్ గేట్ 7 వద్ద నిరసనకారులు గుమిగూడి సిఇసి జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో, జంతర్ మంతర్‌కు సమీపంలో ఉన్న కన్నాట్ ప్లేస్‌లో భారీ పోలీసు బలగాలను మోహరించారు. శాంతియుత నిరసనలను అణచివేయడానికి అధికారులు బల ప్రయోగం చేస్తున్నారని ఆరోపిస్తూ, ఎన్నికల సంఘం జవాబుదారీతనం కోసం తాము చేస్తున్న డిమాండ్‌ను విద్యార్థి కార్యకర్తల నిర్బంధం అణచివేయలేదని జాఖర్ అన్నారు. ఈ అరెస్టులను ఎన్‌ఎస్‌యుఐ జాతీయ మీడియా ఇన్‌చార్జ్ రవి హనుమాన్ పాండే ఖండించారు. కుమార్ రాజీనామా చేసే వరకు 'ఓటు దొంగతనం'కు వ్యతిరేకంగా తమ సంస్థ చేపట్టిన ఉద్యమం మరింత తీవ్రమవుతుందని ఆయన అన్నారు. ఎన్నికల పారదర్శకత, జవాబుదారీతనంపై తమ ఆందోళనలను శాంతియుత, ప్రజాస్వామ్య మార్గాల ద్వారా లేవనెత్తుతూనే ఉంటామని ఆ సంస్థ తెలిపింది.

**పాస్‌పోర్ట్ పోయినది**

నేను, **కాసాని నాగ మనిష్ తండ్రి కె.సైదులు,** ఇ.నెం. 11-13-1059/2, రోడ్ నెం.8, వాసవి కాలనీ, కొత్తపేట్, హైదరాబాద్ - 500035, తెలంగాణ. నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం. **L6597904.** నేను తేది: 05.10.2026న సరూర్‌నగర్ నుండి కొత్తపేట్‌కు ఇంటిని షిఫ్ట్ చేస్తుండగా ఎక్కడో పడిపోయినది. ఎవరికైనా దొరికినచో పై చిరునామాకు తెలియజేయగలరు.

సెల్ నెం. **7569383581**

**PUBLIC NOTICE**

I, **Returi Urmila Rao,** R/o H.No. 3-1-187, Plot No. 23, Goutham Nagar, Saroornagar, Ranga Reddy District, hereby inform the public that on 22-12-2025, I noticed the loss of a folder containing original Sale Deeds bearing Document Nos. 1156/2004, 13267/2016, 4035/2012 and Rectification Deed No. 10513/2013, registered at SRO Ibrahimpatnam, pertaining to properties situated at Dream City-II, Sagar Block, Jan Harsha.

A complaint has been lodged with the concerned authorities. Anyone who finds or has possession of the above documents is requested to contact me. Any misuse of these documents will be dealt with as per law.

Sd/-
**Returi Urmila Rao,**
Goutham Nagar, Saroornagar,
Ranga Reddy District,
**Cell No.: 9951885253**

# బల్గేరియా తీరంలో డ్రోన్ దాడి : నౌక మునక

తొమ్మిదిమంది సిరియన్లు సహా పదిమంది గల్లంతు
రెండో నౌకలో 15 మంది సిబ్బంది క్షేమం
రష్యా రాయబారికి తీవ్ర నిరసన
యూరోపియన్ యూనియన్ తీవ్ర ఖండన



**సోఫియా :** నల్ల సముద్రంలోని బల్గేరియా ప్రాదేశిక జలాలలో రెండు నౌకలపై రష్యా డ్రోన్ దాడి చేసింది. టోగోలీస్ (పశ్చిమ ఆఫ్రికా దేశం) జెండాతో వెళుతున్న అల్బానతన్ అనే ఒక వాణిజ్య నౌక బ్రాపెట్స్‌కు తూర్పున 17 నాటికల్ మైళ్ళదూరంలో డ్రోన్ దాడితో నీట మునిగిపోయింది. ఈ నౌకలో ఉన్న తొమ్మిదిమంది సిరియన్ నావికులు,సిబ్బంది సహా 10 మంది కూడా మరణించి ఉంటారని భావిస్తున్నారు.వారి ఆచూకీ గల్లంతు కావడంతో గాలింపు నిలిపివేశారు.ఐతే పూర్తి వివరాలు వెల్లడి కాలేదు. రెండో నౌకపై కూడా డ్రోన్ దాడి జరిగింది.బ్యాలా పట్టణానికి సమీప జలాల్లో వెళుతున్న ఉక్రేన్ సొంతనౌకలో ఉన్న ఏడుగురు ఉక్రేనియన్లు, ఎనిమిదిమంది అజర్‌బైజాన్ సిబ్బందిని రక్షించారు. ఐదుగురు గాయపడ్డారు. వారందరినీ వర్న పోర్టుకు తరలించారు.
డ్రోన్‌దాడి ఘటనను యూరోపియన్ యూనియన్ కమిషన్ చైర్మన్ ఉర్సులా వోండర్ లేయన్ తీవ్రంగా ఖండించారు.ఈ యుద్ధం తీవ్రరూపం దాల్చే ఒక కొత్త కోణం కనిపిస్తోందని ఆయన అన్నారు.ఈ దాడులు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని అన్నారు. బల్గేరియా జలాల్లో నౌక మునిగిపోవడానికి రష్యా కారణమని ఉక్రేన్ ప్రభుత్వం ప్రత్యక్షంగా తప్పుపట్టింది.ఈ విషయంపై రష్యా సైనిక విభాగం బహిరంగ వ్యాఖ్యానం చేయలేదు.ఐతే ఉక్రేన్‌తో యుద్ధంలో భాగంగా ఇటీవలికాలంలో నల్లసముద్రంలో నౌకలపై దాడులు ఉద్ధృతం చేసింది. ఉక్రేన్ ఓడరేవులకు ఆయుధాలను, బహుముఖ ప్రయోజనాలు చేకూర్చే సరుకులు రవాణా చేసే నౌకలను లక్ష్యంగా చేసుకుని తాము దాడులు చేస్తున్నట్లు రష్యా చెబుతోంది. గతవారం మైకోలేవ్, ఖోమా మెర్క్స్ ఓడరేవులతోపాటు నల్లసముద్రంలో జరిగిన మరోదాడిని కూడా రష్యా ఉదహరించింది. ఉక్రేన్ విదేశాంగమంత్రి ఆంద్రీ సిబిహా మాట్లాడుతూ బల్గేరియా ప్రాదేశిక జలాలలో నౌకలపై రష్యా దాడులు ద్వారా పౌరుల ప్రాణాలకు విలువ ఇవ్వడంలేదని విమర్శించారు. ప్రపంచ ఆహార భద్రతకు నల్లసముద్రం జీవాధారంగా ఉందని,ఈ దాడుల ద్వారా ఆకలిని ఆయుధంగా చేసుకుని ప్రపంచాన్ని బందీగా చేయాలని చూస్తోందని, రష్యాను బలప్రయోగం ద్వారా బలంగా ప్రతిఘటించాలని అన్నారు. కాగా రష్యా-ఉక్రేన్ రెండూ ధాన్యం ఎగుమతి దేశాలని, ఈ దాడులు ఆపాలని టర్కీ పిలుపు ఇచ్చింది. బల్గేరియా ప్రత్యేక ఆర్థికమండలంలో సముద్ర డ్రోన్లు దాడులు చేసిన వారం రోజుల తర్వాత రెండు నౌకలపై మళ్ళీ దాడులు జరిగాయి.మునిగిపోయిన నౌకలో పదిమంది మరణాలపై ఇంకా ఖచ్చితమైన సమాచారం,ధృవీకరణ రావాల్సి ఉంది.ఈ ఘటనపై బల్గేరియా ప్రధానమంత్రి రూమెన్ రాదేవ్ మంగళవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. రష్యా రాయబారి ఎలియానోవ్ మిత్రోఫానోవాను పిలిపించి మాట్లాడారు.నల్లసముద్రంలో రెండు నౌకలపై డ్రోన్ దాడులు జరిగాయని, ఇందులో ఒక వాణిజ్య నౌక నీట మునిగిపోయిందని రాదేవ్ చెప్పారు. బల్గేరియా ప్రాదేశిక జలాలలో జరుగుతున్న దాడులు ఆమోదయోగ్యం కాదన్నారు. రష్యాపై నింద మోపడానికి నిశ్చయాత్మకమైన ఆధారాలు లేనప్పటికీ తర్కపరంగా చూస్తే,రష్యా దోషిగా కనిపిస్తోందని చెప్పారు. యూరప్ ఆగ్నేయప్రాంత దేశం బల్గేరియా ఉక్రేన్‌కు మద్దతుగా ఉంది. తర్కపరంగా చూస్తే ఈ దాడి వల్ల రష్యామే మేలు జరుగుతుందని రాదేవ్ అన్నారు. ఈ దాడి వెనుక రష్యా హస్తం ఉందని, రష్యా రాయబారిని పిలిపించి తమ ప్రభుత్వ ఉన్నతాధికారులు తీవ్ర నిరసన తెలియజేశారని చెప్పారు.

# ఉక్రేన్–రష్యా యుద్ధ పరిష్కారానికి ప్రణాళిక!

నాలుగు అంశాలతో అమెరికా–యూరప్ కసరత్తు
యూరప్‌కు రష్యా గ్యాస్–చమురు పైపులైన్
ఆంక్షల ఎత్తివేత, ఆర్థిక భద్రతా ఒప్పంద యత్నం



**వాషింగ్టన్ :** ఉక్రేన్ యుద్ధ పరిష్కారానికి నాలుగు అంశాలతో కూడిన ఒక ప్రణాళిక తయారు చేసేందుకు అమెరికా–యూరప్ దేశాలు కసరత్తు చేస్తున్నట్లు 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక తెలియజేసింది. ఉక్రేన్–రష్యా రెండు దేశాలకూ ఆర్థిక భద్రతాప్రయోజనాలు అందించే ఒక ఉమ్మడి శాంతి ప్రణాళిక రూపొందించే దిశగా అమెరికా–యూరప్ దేశాలు ప్రయత్నం చేస్తున్నాయని 'వాషింగ్టన్ పోస్ట్' పత్రిక కాలమిస్టు డేవిడ్ ఇగ్నేషియస్‌ను ఉటంకిస్తూ టాస్ వార్తాసంస్థ మంగళవారం ఒక వార్త ప్రచురించింది.అమెరికా ప్రభుత్వంలో విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు ఆ కాలమిస్టు ఈ ప్రత్యేక కథనం రాశారు.యుద్ధ ప్రాంతంలో రెండు దేశాలకు స్థిరత్వం చేకూర్చడంతోపాటు యూరప్ దేశాలతో రష్యా ఒక ఆర్థిక భద్రతా ఒప్పందానికి కూడా రావాలనే ముఖ్యాంశం ఈ ఒప్పందంలో ఉంటుందని సీనియర్ అమెరికా అధికారి చెప్పినట్లు ఇగ్నేసియస్ పేర్కొన్నారు.ఉక్రేన్ పునర్నిర్మాణానికి ఈ ప్రణాళిక ద్వారా కుదిరే ఒప్పందం కీలక మూలస్తంభంగా ఉంటుందని అమెరికన్ అధికారి చెప్పారు.ఈ ప్రణాళికలో భాగంగా రెండు దేశాలకు ఆర్థిక భద్రత సమకూరుతుంది.రెండు దేశాలకూ భద్రతాహామీ అనేది ఈ నాలుగు అంశాల ప్రణాళికలో రెండో ప్రధాన అంశంగా ఉంటుంది.
ఐతే రష్యాకు ఎలాంటి భద్రతా హామీలు ఇస్తారన్న విషయం బహిర్గతం కాలేదు.అదేవిధంగా ఇంధన ఒప్పందం ద్వారా రష్యా,యూరప్,ఉక్రేన్ ఆర్థిక ఏకీకరణ ఈ ప్రణాళికలో మూడవ ముఖ్యాంశం.ఇప్పటికీ యూరప్ దేశాలు రష్యా చమురు,సహజవాయువులపై ఆధారపడుతున్నాయి.2027 నాటికి రష్యా నుండి దిగుమతులను తగ్గించుకోవాలన్నది యూరప్ ప్రయాళిక.ఇది కూడా ట్రంప్ ఒత్తిడే. కానీ ఆపద్ధర్మంగా ట్రంప్ రష్యాతో దాదాపు 18 లక్షల బ్యారెళ్ళ డీజిలు సరఫరా ఒప్పందం చేసుకున్నారు. ఇతర దేశాలను రష్యా నుండి చమురు కొనుగోలు చేయవద్దని ఆంక్షలు విధించిన ట్రంప్ తనవరకూ వచ్చేసరికి స్వదేశంలో కొరతను అధిగమించేందుకు రష్యా దిగుమతులను ఆశ్రయించడం విచిత్రవ్యవహారంగా మారింది. ఈ దశలో ఈ నాలుగు అంశాల ప్రణాళిక యుద్ధ పరిష్కారానికి తెరమీదకు రాబోతోందని సమాచారం.అందువల్ల యూరప్–రష్యా మధ్య గ్యాస్,చమురు సరఫరాకు ఒక పైపులైన్ నిర్మాణాంశం కూడా ఈ ప్రణాళికలో ఉండే అవకాశం ఉంది.
దీనిద్వారా వచ్చే లాభాలను ఉక్రేన్–రష్యా పంచుకుంటాయన్నది కూడా ప్రణాళికలో ఒక అంశంగా ఉన్నట్లు ఇగ్నాషియస్ పేర్కొన్నారు.దీనివల్ల యూరప్‌కు దీర్ఘకాలికంగా చమురు,గ్యాస్ సరఫరా భద్రత వస్తుంది.రష్యాపై ఆంక్షలను ఎత్తివేసే అంశం కూడా ఈ ప్రణాళికలో ఉంది.వాషింగ్టన్ పోస్టు కథనం ప్రకారం,ఫ్లోరిడాలో ఇటీవల జరిగిన ఒక సమావేశంలో అమెరికా,యూరప్,ఉక్రేన్ సంధాన కర్తలు పాల్గొన్నారు.ఈ ప్రణాళిక రూపొందించే విషయంపై దౌత్యపరమైన తీవ్ర ఒత్తిడి ఈ సమావేశంలో వచ్చింది.2022లో ఉక్రేన్‌పై రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించింది. దీని ఫలితంగా 20 శాతం భూభాగం రష్యా అధీనంలోకి వెళ్ళింది. ఇటీవల ఈ ప్రాంతాలలో కూడా రష్యా పార్లమెంటుకు ప్రాతినిధ్య ఎన్నికలు జరిగాయి.

## శాశ్వత అధికారం కోసమే...
(మొదటి పేజీ తరువాయి)

ముందస్తు ప్రణాళికతోపాటు, పంటలు నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని కోరారు. కరువు సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులను పెంచాలని ఉందని సాంబశివరావు పేర్కొన్నారు.
ఆర్‌టిసి ఎన్నికల్లో ఎర్రజెండా సంఘాల విజయంపై అభినందనలు
తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా జరిగిన ఆర్‌టిసి ఎన్నికల్లో ఎఐటియుసి అనుబంధ సంఘం విజయం సాధించడం కార్మికవర్గ చైతన్యానికి నిదర్శనమని కూనంనేని సాంబశివరావు అన్నారు. ఆర్‌టిసిలో ఎంప్లాయీస్ యూనియన్‌కు దశాబ్దాల చరిత్ర ఉందని, సింగరేణిలోనూ కార్మికులు ఎర్రజెండా సంఘాలపై విశ్వాసాన్ని కొనసాగిస్తున్నారని ఆయన అన్నారు. విజయం సాధించిన కార్మిక సంఘాల నాయకులకు, కార్మికులకు సిపిఐ తరపున అభినందనలు తెలిపారు. ఆర్‌టిసి ఎన్నికల ఫలితాలను రాజకీయ కోణంలో చిత్రీకరించడం సరైంది కాదని, కార్మిక సంఘాల మధ్య పోటీని తాము స్నేహపూర్వక పోటీగానే చూశామని, ఎవరు గెలిచినా కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని భావించామని చెప్పారు. ఇతర పార్టీలు మద్దతు ఇచ్చాయని ఫలితాలపై అనవసర వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని ఆయన సూచించారు. కార్మికుల తీర్పును గౌరవించి, వారి సమస్యల పరిష్కారానికి సంఘాలు కృషి చేయాలని సాంబశివరావు అన్నారు.
**సిపిఐ ఎప్పుడూ ప్రజల పక్షమే :**
రాజకీయపరంగా మాత్రమే కాంగ్రెస్‌తో తమకు అవగాహన ఉందని, అయితే ప్రజా సమస్యలపై సిపిఐ ఎప్పుడూ ప్రజాపక్షమేనని కూనంనేని సాంబశివరావు స్పష్టంచేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ తమను మద్దతు కోరలేదని అయితే సిపిఐ(ఎం), స్వతంత్ర అభ్యర్థులు తమను సంప్రదిస్తున్నారని తెలిపారు. ఓట్ల నమోదు తర్వాతే మద్దతుపై నిర్ణయం తీసుకుంటామని, ముందుగా ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి సారించామని, సమావేశమై తదుపరి కార్యాచరణను నిర్ణయిస్తామన్నారు. రాజకీయాల్లో కొన్ని సందర్భాల్లో కలిసి పనిచేయడం, మరికొన్ని సందర్భాల్లో విభేదించడం సహజమని ఆయన తెలిపారు. రాజకీయ అవసరాలు, బాధ్యతలను బట్టి వివిధ అంశాలపై పార్టీలు తమ వైఖరిని నిర్ణయించుకుంటాయని చెప్పారు. సిపిఐ, కాంగ్రెస్ వేర్వేరు పార్టీలు కావడంతో ప్రతి అంశంపైనా ఒకే అభిప్రాయం ఉండాల్సిన అవసరం లేదని, ప్రజలకు మేలు చేసే అంశాలపై కాంగ్రెస్‌కు సిపిఐ మద్దతు ఇస్తుందని, ప్రజలకు నష్టం కలిగించే నిర్ణయాలను వ్యతిరేకిస్తామని సాంబశివరావు స్పష్టం చేశారు.
**విద్యుత్ రంగంపై ఆర్థిక భారం తగ్గించాలి :**
విద్యుత్ రంగానికి సంబంధించిన అంశాల్లో భారీ ఆర్థిక భారం ప్రజలపై పడకుండా చూడాలని సాంబశివరావు అన్నారు. రూ.5,000 కోట్ల అదనపు భారం పడే పరిస్థితి తలెత్తితే సంబంధిత వర్గాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటికే విద్యుత్ రంగానికి సంబంధించి రూ.56 వేల కోట్ల చెల్లింపుల భారం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అన్ని పక్షాలను సమావేశపరిచి, అందరికీ ఆమోదయోగ్యమైన మధ్యేమార్గాన్ని అన్వేషించాలని సూచించినట్లు తెలిపారు.
ఆర్‌టిసి ఎన్నికల ఫలితాలపై తప్పుడు ప్రచారం ఆపండి :ఎస్.బాబు
ఆర్‌టిసి ఎన్నికల్లో కార్మికుల తీర్పును వక్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేస్తే సహించేదిలేదని ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.బాబు హెచ్చరించారు. మొత్తం 34,174 ఓట్లు పోలవగా, జెఎసి కూటమికి 18,223 ఓట్లు వచ్చాయని, తెలంగాణ వర్కర్స్ యూనియన్‌కు 13,826 ఓట్లు మాత్రమే వచ్చాయని తెలిపారు. అధికారిక ఫలితాల పత్రం ఆధారంగానే మాట్లాడాలని, నిరాధార ఆరోపణలు మానుకోవాలని సూచించారు. ఈ నెల 17న పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ పూర్తయిన తర్వాత లేబర్ కమిషనర్ నుంచి అధికారిక పత్రం తీసుకుని ఫలితాలపై మాట్లాడుతామని, అప్పటివరకు ఎన్నికల ఫలితాలపై తప్పుడు ప్రచారం చేయవద్దని కోరారు. తమ విజయానికి రాజకీయ పార్టీల మద్దతు, డబ్బు పంపిణీ కారణం కాదని, కార్మికుల విశ్వాసమే గెలిపించిందని బాబు స్పష్టం చేశారు. సిపిఐ, ఎఐటియుసి తమకు అండగా నిలిచాయని తెలిపారు.
**ఆర్‌టిసిచరిత్రలో 2026 చిరస్థాయిలో నిలుస్తుంది : వి.ఎస్.బోస్.**
వి.ఎస్.బోస్ మాట్లాడుతూ ఎంప్లాయీస్ యూనియన్‌పై కార్మికులు విశ్వాసంతో విజయం అందించారని, ఆ తీర్పును గౌరవించాలని అన్నారు. ఒకరిపై మరొకరు ఆరోపణలు చేసుకోవడం మానుకుని, కార్మికుల సర్వీసు నిబంధనలు, వేతనాలు, ఇతర ప్రయోజనాలకు నష్టం కలగకుండా ఒప్పందం కుదుర్చుకోవాలని సూచించారు. ప్రభుత్వం, యూనియన్ సమన్వయంతో విలీన ప్రక్రియ పూర్తయితే 2026 సంవత్సరం ఆర్‌టిసి చరిత్రలో చిరస్థాయిలో నిలుస్తుందన్నారు.
**వరికి రూ.30 వేలు పత్తికి రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలి : పశ్యపద్మ**
వర్షభావ పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో 315 మండలాలో తీవ్ర కరువు నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే రైతులనుఅన్ని విధాలుగా ఆదుకోవాలని పశ్య పద్మ డిమాండ్ చేశారు. కరువు నెలకొన్న మండలాలలో వరికి ఎకరాకు రూ.30 వేలు, పత్తికి రూ.50 వేలు, కూరగాయాలు, ఇతర పంటలకు రూ.20 వేల చొప్పున నష్ట పరిహారం అందించి రైతులనుఆదుకోవాలని కోరారు. కరువు నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని అఖిలపక్ష సమావేశం తక్షణమే ఏర్పాటు చేసి రైతులను ప్రజలను ఆదుకోవడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఉమ్మడి పోరాటం(మొదటి పేజీ తరువాయి)

పాల్పడిన దోషులను చట్టం ముందు నిలబెడతామని చెప్పారు. దేశ రాజ్యాంగాన్ని ధ్వం సం చేసిన వారు అంత సులభంగా తప్పించుకోలేరని స్పష్టం చేశారు. ఓట్ల దొంగతనానికి పాల్పడినవారిపై చర్యలు తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చారు. సుప్రీంకోర్టు వరకూ తలపెట్టిన ప్రజాస్వామ్య యాత్ర కేవలం ఇక్కడ పాల్గొన్న రాజకీయపార్టీలు,నాయకుల వ్యక్తీకరణ మాత్రమే కాదు,భారతదేశ ప్రజాగళానికి ప్రతీక అని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్య ప్రక్రియ పునరుద్ధరణకోసం విడివిడిగా నిరసన ప్రదర్శనలేమీ జరగడంలేదు,అందరం కలిసి ఉమ్మడిగా పోరాటం చేస్తున్నాం అని మరోసారి స్పష్టం చేశారు. భారత ప్రధాన న్యాయమూర్తిపట్ల, భారతదేశ అత్యున్నత న్యాయస్థానంపట్ల తమకు అత్యున్నతమైన గౌరవం ఉందని,దేశంలోని ప్రజాస్వామ్య ప్రక్రియను పునరుద్ధరించడంలో వారికీ ఒక బాధ్యత ఉన్నందువల్ల ఆ బాధ్యత నిర్వర్తిస్తారని సంపూర్ణ విశ్వాసంతో ఉన్నామని చెప్పారు.''ఓట్ చోరీకి సూత్రధారులైన నరేంద్రమోదీ,అమిత్ షా,జ్ఞానేశ్ కుమార్‌ల మెడచుట్టూ ఉచ్చు బిగుసుకుంటోంది,ఈ విషయం వారు గ్రహించాలి,ఏం జరిగినా,ఏ సంస్థ పాత్ర పోషించినా,పోషించకపోయినా,ఎంతకాలమైనా,రాజకీయ ప్రతిఘటన,ప్రజా ఉద్యమం కొనసాగుతుంది,అంతిమంగా విజయం సాధిస్తుంది,రాజ్యాంగాన్ని ధ్వంసంచేసిన వారి చట్టం ముందు నిలబెడతాం,ప్రజలకు ఇదే మా హామీ'' అని రాహుల్‌గాంధీ చెప్పారు. ఢిల్లీలోని సునేహ్రీబాగ్ రోడ్(5)లో ఉన్న ఆయన నివాసంలో జరిగిన ఈ తేనీటి విందుకు కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జునఖర్గే,కాంగ్రెస్ పార్లమెంటరీపార్టీ ఛైర్‌పర్సన్ సోనియాగాంధీ,సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సిపిఐ ఎంపి సందోశ్ కుమార్,సిపిఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ,సిపిఐ(ఎం–ఎల్)నాయకుడు దీపాంకర్ భట్టాచార్య,'ఐసా' నాయకురాలు నేహాబోరా,ఆర్‌జెడి నాయకులు తేజస్వియాదవ్,మనోజ్ ఝా,సమాజ్‌వాదీపార్టీ నాయకులు హరేంద్ర మాలిక్,ఆనంద్ భదౌరియా,మొహిబుల్లానద్వి,జెఎంఎం నాయకులు మహువా మాఝి,మహువా మొయిత్రి(టిఎంసి)సహా ఇండియా కూటమికి చెందిన దిగ్గజ నాయకులు,పౌరసమాజ ప్రతినిధులు,విద్యార్థి నాయకులు,తెలంగాణ ముఖ్యమంత్రి రేవత్‌రెడ్డి,పలువురు ప్రముఖులతో ఈ సమావేశం జరిగింది.
**ప్రజాస్వామ్య రక్షణకు ఎలాంటి త్యాగాలకైనా సిద్ధం : ఖర్గే**
ఈ తేనీటి విందు సమావేశం తర్వాత ఇండియా కూటమిలోని సీనియర్ నాయకులు సమావేశమై ఈ ఉద్యమాన్ని ఎలా ముందుకు తీసుకువెళ్ళాలనే వ్యూహాలపై చర్చించినట్లు కాంగ్రెస్‌పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే పాత్రికేయులకు చెప్పారు.ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టిన ఓట్ల దొంగతనం పథకాన్ని బహిర్గతం చేసేందుకు దేశంలోని ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు.మోదీ,అమిత్ షా ఓట్ల దొంగతనానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఐక్య పోరాటాన్ని ఇండియా కూటమి ముందుకు తీసుకువెళుతుందని చెప్పారు.మోదీ–అమిత్ షా ఆదేశాల మేరకు ప్రజాస్వామ్యాన్ని అణచివేసేందుకు జ్ఞానేశ్ కుమార్ వ్యవహరిస్తున్న తీరు తెన్నులను దేశ ప్రజలందరూ కళ్ళతో ప్రత్యక్షంగా చూశారన్నారు.దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి మేమంతా ఏకమయ్యాం,ఎలాంటి త్యాగాలకైనా సిద్ధంగా ఉన్నాం అని చెప్పారు. ''ఇది మహాత్మాగాంధీజీ,లోహియాజీ,కర్పూరీ ఠాకూర్‌జీలదేశం, ఇక్కడ ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేసేందుకు కొందరు ప్రయత్నం చేస్తున్నారు,ఈ ప్రక్రియలో జ్ఞానేశ్ కుమార్ ఒక కీలుబొమ్మలా వ్యవహరించారు,ఇది ప్రభుత్వ భయాన్ని బహిర్గతం చేస్తోందన్నారు.

### జంతర్ మంతర్ పునరుద్ధరణకు పోరాడతాం డి.రాజా డిమాండ్

రాహుల్‌గాంధీ నివాసంలో జరిగిన తేనీటి విందులో పాల్గొన్న తర్వాత భారత కమ్యూనిస్టుపార్టీ ప్రధాన కార్యదర్శి డి.రాజా పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ,జ్ఞానేశ్ కుమార్ తక్షణం రాజీనామా చేయాలని,ఎన్నికల సంఘంలో సంస్కరణలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ఆయనతోపాటు సిపిఐ ఎంపీ సందోశ్ కుమార్,ఎఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్ పాల్గొన్నారు.దేశంలో తక్షణ ఎన్నికల సంస్కరణలు ప్రవేశపెట్టే విషయంపై సమావేశంలో చర్చించామని డి.రాజా పాత్రికేయులకు చెప్పారు.దేశ ప్రజలు వీధుల్లోకి వస్తున్నారని,రోజు రోజుకూ ప్రజాగ్రహం విస్తరిస్తోందని,మోదీ ప్రభుత్వం విద్యార్థులు,యువకులులపై హింసకు పాల్పడ్డారని,ఆ తర్వాత శాంతియుత నిరసనలకు కేంద్రంగా విరాజిల్లే జంతర్ మంతర్‌ను ప్రజానిరసన వేదికల జాబితా నుండి తొలగించి ప్రజాస్వామ్య హక్కును హరించివేశారని విమర్శించారు.ఎంత అణచివేతకు పాల్పడినా ఈ ఉద్యమం ఆగదని ఆయన స్పష్టం చేశారు.జంతర్ మంతర్‌ను పునరుద్ధరించేవరకూ పోరాటం చేస్తామని చెప్పారు.ప్రజాస్వామ్యంలో శాంతియుతంగా నిరసన తెలియజేయడానికి ప్రజలందరూ ఒకచోట గుమిగూడటం ఒక ప్రాథమిక హక్కు అన్నారు. ప్రజలనుండి ఈ హక్కును ఏ ప్రభుత్వమూ లాక్కోలేదని స్పష్టం చేశారు. జంతర్‌మంతర్‌ను నిరసన ప్రదేశాల జాబితా నుండి తొలగించవచ్చునేమోగానీ, దేశ ప్రజాస్వామ్యాన్ని మాత్రం రద్దుచేయలేరని అన్నారు. ఎన్నికల సంఘంలో సంస్కరణలకోసం,సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామాకోసం పోరాటాన్ని మరింత ఉధృతంగా ముందుకు తీసుకువెళతామని డి.రాజా స్పష్టం చేశారు. సిపిఐ(ఎం)నాయకుడు ఎం.ఎ.బేబీ మాట్లాడుతూ మొదట ఓట్ల దొంగతనం చేసిన మోదీ ప్రభుత్వం ఇప్పుడు జంతర్ మంతర్ నిరసన ప్రదేశాన్ని కూడా దొంగిలించే పనిలో పడిందని అన్నారు. సంజయ్ రౌత్ మాట్లాడుతూ, జ్ఞానేశ్ కుమార్ ఒక మాఫియా అనీ, దేశాన్ని ఆయన నేరమయం చేశారన్నారు. నేహాబోరా మాట్లాడుతూ,దేశ ప్రజాస్వామ్య నిర్మాణంలో ఏనాడూ భాగం పంచుకోని బిజెపి ఈనాడు ప్రజాస్వామ్య విధ్వంసానికి పాల్పడుతోందన్నారు. నిరసన తెలియజేసే హక్కు రాజ్యాంగ బద్ధమైనదని ప్రశాంత్ భూషణ్ అన్నారు.

## పరిమితులు
(మొదటి పేజీ తరువాయి)

స్పష్టం చేసింది. ఫారం–7లో పూర్తి వివరాలు, అభ్యంతరం వ్యక్తం చేసిన వారి సంతకాన్ని ఈఆర్‌ఓ పరిశీలించాలి. ఫారం–7 దరఖాస్తు చేసిన వారికి నోటీసు ఇచ్చి వారి అభ్యంతరాలను లిఖిత పూర్వకంగా నమోదు చేసి ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలని కేంద్ర ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. ఉద్దేశపూర్వంగా తప్పుడు ఫిర్యాదు చేసినట్లు తేలితే ఫారం–7 సమర్పించిన వ్యక్తిపై చర్య తీసుకోవాలని సిఇసి తెలిపింది. ఫారం–7లపై సిఇసి మార్గదర్శకాలను కలెక్టర్లు, ఇఆర్‌ఒలకు పంపించారు. వాటిని కచ్చితంగా పాటించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఫారం–7పై తప్పుడు ఫారం సమర్పిస్తున్నారనే ఆరోపణలు అధికంగా వస్తున్నాయి. దీంతో కేంద్ర ఎన్నికల సంఘం ఈ నిర్ణయం తీసుకుంది. దరఖాస్తులను పరిశీలించి, అభ్యంతరం తెలిపిన వ్యక్తిని నేరుగా విచారించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటారు. క్లెయింలు, అభ్యంతరాల స్వీకరణ సమయంలో కొత్త నిబంధన ప్రకారం ఒక ఓటరు గరిష్ఠంగా పది ఫారాలు మాత్రమే సమర్పించాలని ఉంది. ఈ నిబంధన ప్రకారం ఫారం–7 అందజేసిన వ్యక్తికి ఎన్నికల నమోదు అధికారి నోటీసు ఇస్తారు. ఒక్కో దరఖాస్తుదారుని వాంగ్మూలం నమోదు చేసుకుంటారు. ఫారం–7 పై దరఖాస్తుదారు సొంత సంతకం ఉండాలి. కేవలం రబ్బరు స్టాంప్ లేదా సీల్ ఉన్న దరఖాస్తులను స్వీకరించరు. అభ్యంతరం ఉన్న వారికి కూడా వాదన వినిపించేందుకు అవకాశం కల్పిస్తారు. ఈఆర్వోలు సంతృప్తి చెందాక ఓటర్ల నమోదు నిబంధనలు 1960లో 19, 20 నిబంధనల కింద దరఖాస్తును పరిష్కరిస్తారు. ఈ నిబంధన అమలు చేయాలని అన్నీ రాష్ట్రాల ప్రధాన ఎన్నికల అధికారులకు ఈసీ ఆదేశాలు జారీ చేసింది.

## ఎండిఆర్ చార్జీలు
(మొదటి పేజీ తరువాయి)

ఎండిఆర్‌ను దీపావళి తర్వాత అమలు చేయాలని, దీనికి సంబంధించిన తేదీని విడిగా తెలియజేస్తామని యుపిఐ సర్వీసెస్ స్టీరింగ్ కమిటీ నిర్ణయించనట్లు ఎన్‌పిసిఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఎండిఆర్‌ను వినియోగదారులు కాకుండా వ్యాపారులు చెల్లించాల్సి ఉంటుంది. రూ. 75,000 లేదా అంతకంటే ఎక్కువ విలువైన లావాదేవీలకు దీనిని గరిష్ఠంగా రూ. 300కు పరిమితం చేశారు. ప్రతిపక్షాలు దీనిని ఒక 'పన్ను'గా అభివర్ణిస్తూ, రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన నిర్దిష్ట యుపిఐ లావాదేవీలపై ఈ రుసుము వినియోగదారులపై భారం మోపుతుందని ఆరోపించిన నేపథ్యంలో ఈ వాయిదా నిర్ణయం తీసుకున్నారు. సెప్టెంబర్ 15 నాటి సర్క్యులర్ ప్రకారం, వ్యక్తుల మధ్య జరిగే చెల్లింపులు, రోజువారీ వ్యాపార లావాదేవీలలో ఎక్కువ భాగం ఉచితంగానే కొనసాగాల్సి ఉంది. రైల్వేలు, టెలికాం, ఇంధనం, బీమా వంటి అత్యవసర సేవల విషయంలో, రూ. 2,000 కంటే ఎక్కువ విలువైన లావాదేవీకి స్థిరంగా రూ. 5 రుసుము విధించాల్సి ఉండేది. క్యాపిటల్ మార్కెట్ లావాదేవీలకు (మ్యూచువల్ ఫండ్స్, స్టాక్ బ్రోకింగ్) తక్కువగా 0.02 శాతం రేటును, గరిష్ఠంగా రూ. 300 పరిమితితో నిర్ణయించారు. డిజిటల్ చెల్లింపుల వ్యవస్థకు సుస్థిరమైన ఆదాయ విధానాన్ని రూపొందించే లక్ష్యంతో, యుపిఐ ప్లాట్‌ఫారమ్‌ను నిర్వహిస్తున్న నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ కొన్ని యుపిఐ లావాదేవీలపై ఎండిఆర్ విధించాలని నిర్ణయించింది. ఎన్‌పిసిఐ ప్రకారం, వసూలు చేసిన మొత్తాన్ని బ్యాంకులు, యుపిఐ వ్యవస్థలోని ఇతర సంస్థల మధ్య పంచుకుంటారు. వసూలు చేసిన ఎండిఆర్‌లో, 40 శాతం వినియోగదారుల బ్యాంకులకు, 30 శాతం పేమెంట్ గేట్‌వేలకు, 20 శాతం యుపిఐయాప్‌కు, మిగిలిన 10 శాతం యుపిఐ యాప్ స్పాన్సర్ బ్యాంకుకు వెళ్తాయి.

## భారీ ధర్నా (మొదటి పేజీ తరువాయి)

హాయంలో సింగరేణికి జన్‌కో ట్రాన్స్‌కోలు రూ.26వేల కోట్ల బకాయిలు పడితే ఇప్పటీ కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో రూ.59వేల కోట్లకు చేరిందన్నారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్న ఇప్పటీ ఉపముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క గత ప్రభుత్వంపై నిప్పులు చెరుగుతూ మీడియా సమావేశం పెట్టారని ఇప్పుడు ఆయనే స్వయంగా ఆ శాఖకు మంత్రిగా ఉండి కూడ నిధులను విడుదల చేయకపోవడం దారుణమన్నారు. సింగరేణికి రావాల్సిన బకాయిలపై సంస్థ అధికారులు ప్రభుత్వ ఉద్యోగులు కావడంతో నీలదీయలేపోతున్నారని దీంతో సంస్థ అభివృద్ధికి అంతకు అంత కుంటుపడుతున్న నేపథ్యంలో సంస్థను కాపాడుకునేందుకు కార్మికులుగా తాము ఆందోళన నిర్వహిస్తున్నామని చెప్పారు. ఆ ధర్నా కేవలం ఆరంభం మాత్రమేనని నిధులను విడుదల చేయకపోతే తీవ్రంగా ఉంటుందని హెచ్చరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ మాట్లాడుతూ సింగరేణి అభివృద్ధి గురించి గొప్పలు చెబుతున్న ప్రభుత్వాలు, సంస్థకు రావాల్సిన బకాయిలను చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. కొత్త బొగ్గు బావుల ఏర్పాటు, ఉత్పత్తి పెంపు, కార్మికుల సంక్షేమం, భద్రతా సామగ్రి కొనుగోలుకు నిధులు లేకుండా పోతున్నాయని అన్నారు. ప్రభుత్వమే బకాయిల చెల్లింపునకు బాధ్యత వహించాలని, లేనిపక్షంలో బొగ్గు రవాణా, ఉత్పత్తిని అడ్డుకుంటామని హెచ్చరించారు. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహ్మా మాట్లాడుతూ.. సింగరేణికి బకాయిలు చెల్లించాలని పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా స్పష్టమైన స్పందన రాలేదన్నారు. అందుకే ప్రత్యక్ష ఆందోళనకు దిగాల్సి వచ్చిందని తెలిపారు. కార్మికుల శ్రమతో నడుస్తున్న సింగరేణి సంస్థను ఆర్థిక సంక్షోభం నుంచి కాపాడేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎటియుసి గౌరవ అధ్యక్షుడు ఎం.డి. యూసుప్ మాట్లాడుతూ సింగరేణిని ప్రవేటీకరించడంలో కుట్రలో భాగమే బకాయిలు చెల్లించడం లేదన్నారు. తద్వారా సింగరేణి సంస్థను నష్టాలపాలు చేసి దానిని సాకుగా చూపి సంస్థను ప్రవేటీకరించేందుకు పాలకులు యత్నిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ కుట్రలను కార్మికుల ఎప్పటికీ సఫలం కానియబోరని ఆయన స్పష్టం చేశారు. ధర్నా అనంతరం యూనియన్ ప్రతినిధుల బృందం జన్‌కో ఫైనాన్స్ డైరెక్టర్ వీర మహేందర్‌కు వినతి పత్రం అందజేశారు.
ఈ నిరసన కార్యక్రమంలో ఎఐటియుసి ఉపాధ్యక్షుడు మారగోని ప్రవీణ్ కుమార్, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.రంగయ్య, ఉప ప్రధాన కార్యదర్శులు ఎం.సమ్మయ్య 5.ఎం.ఎల్లయ్య,కేంద్ర కార్యదర్శులు వంగ వెంకటి, వై. రామ్‌గోపాల్, సంస్థాగత కార్యదర్శి కె.రాజరత్నం, శాఖ కార్యదర్శులు బాజీ సైదా, ఎం. రమేష్, ఎస్. సత్యనారాయణ, ఎం.ఆర్.సి.రెడ్డి, సభ్యులు సాంబశివరావు, డి. మల్లేష్, ఎస్. తిరుపతి , ఎం.డి. నజీర్, ఎస్.వి. రమణమూర్తి, జె.గట్టయ్య, ఎస్.సుధాకర్, ఎం.కొమరయ్య, కె.కిషన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎఐఎస్ఎఫ్,ఎఐవైఎఫ్
(మొదటి పేజీ తరువాయి)

అడ్డుకున్నారు. కాగా భారీ బారికేడ్లు, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు ఉన్నప్పటికీ మంగళవారం జంతర్ మంతర్‌కు చేరుకున్న 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) నాయకులు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దీంతో కొంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అజింక్య షిండేతో సహా ఇతర బృంద సభ్యులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్‌లో పేర్కొన్నారు. ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకునే ముందే, త్రివర్ణ పతాకాన్ని చేబూనిన 'కాక్రోచ్‌లు' (సిజెపి సభ్యులు) ఈ రోజు తెల్లవారుజామున జంతర్ మంతర్‌లోకి చొరబడ్డారు' అని దీప్కే చెప్పారు. రంకా, దాస్, షిండేలతో పాటు ఇతర బృంద సభ్యులను కూడా అదుపులోకి తీసుకున్నారని ఆయన తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీని ట్యాగ్ చేస్తూ, 'మీరు ఈ నిరసనను అణచివేయలేరు (లేదా గుర్తింపును రద్దు చేయలేరు)' అని దీప్కే వ్యాఖ్యానించారు. జంతర్ మంతర్‌లోకి ప్రవేశించడానికి సిజెపి సభ్యులు గేటు దూకుతున్న దృశ్యాలు, 'భారత్ మాతా కీ జై' వంటి నినాదాలు చేస్తున్న వీడియోను కూడా దీప్కే షేర్ చేశారు. పోలీసు సిబ్బంది వారిని పట్టుకోవడానికి వేగంగా పరిగెత్తడం ఆ వీడియోలో కనిపించింది. నిర్ణీత ప్రదేశంలో నిరసన తెలిపే తమ హక్కును చాటుకోవడానికి, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేయడానికి తాము జంతర్ మంతర్‌లోకి ప్రవేశించామని సిజెపి సభ్యులు తెలిపారు. 'జంతర్ మంతర్‌లోకి ప్రవేశించాం. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా



జంతర్ మంతర్ నుండే జరుగుతుంది. మీకు చేతనైనది చేయండి' అని రంకా అన్నారు. నిరసన ప్రదేశానికి వెళ్లే విషయంలో హోం శాఖ విధించిన ఆంక్షలను దాస్ ప్రశ్నించారు. 'మా జంతర్ మంతర్‌ను లాక్కోవడానికి హోంశాఖ ఎవరు? ఇది నిరసన కోసం కేటాయించిన ప్రదేశం, ఇక్కడి నుండే మేము జ్ఞానేశ్ కుమార్ రాజీనామాను సాధిస్తాం' అని ఆయన అన్నారు. రాజ్యాంగ ప్రతిని ప్రదర్శిస్తూ, 'రాజ్యాంగం మా వెంటే ఉంది' అని దాస్ పేర్కొన్నారు. సిజెపి సభ్యులు 'భారత్ మాతా కీ జై', 'ఇంక్విలాబ్ జిందాబాద్', 'జై భీమ్' వంటి నినాదాలు చేశారు. వారు విప్లవాత్మక కవిత 'సర్ఫరోషీ కీ తమన్నా'ను ఆలపించారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఒక ప్రకటనలో, తమ చర్యను జంతర్ మంతర్‌ను తిరిగి స్వాధీనం చేసుకోవడంగా సిజెపి అభివర్ణించింది. భారీ బారికేడ్లు ఉన్న నిరసన ప్రదేశంలోకి తమ సభ్యులు ప్రవేశించి, అక్కడ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారని ఆ పార్టీ పేర్కొంది. 'జంతర్ మంతర్ కోటను తిరిగి స్వాధీనం చేసుకున్నాము' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. శాంతిభద్రతలను కాపాడటానికి ఢిల్లీ పోలీసులు నగరం అంతటా పెద్ద సంఖ్యలో సిబ్బందిని మోహరించారు.

## పంట ధ్వంసం చేయొద్దు
(మొదటి పేజీ తరువాయి)

పంటలను ధ్వంసం చేశారు. వందలాది మంది పోలీసుల మోహరింపుతో పోచారం గ్రామం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది.సుమారు 50 మంది భూభాదిత రైతులు పోలీసులు రెవెన్యూ అధికారుల ఆగడాలపై తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేశారు. పరిహారాన్ని చెల్లించి భూములను తీసుకోవాలని పంటను ద్వాసం చేసుకోవచ్చని రైతులు అధికారుల తీరుపై తీవ్ర విమర్శలు చేశారు.
పరకాల ఆర్డిఓ వెంకన్న పరకాల ఎసిపి సతీష్ బాబు ఆధ్వర్యంలో వందలాదిమంది పోలీసులు నర్సింహులపల్లి, పోచారం గ్రామాలలో మోహరించారు. పరిసరాలకు చెందిన రైతులు భూముల వద్దకు రావద్దని ముందస్తుగా సమాచారం ఇచ్చి ఎక్కడికి అక్కడ పోలీసుల వారి ప్రయత్నాలను అడ్డుకున్నారు. దీంతో పరిసర గ్రామాలలో రైతులు ప్రభుత్వం తీరుపై తీవ్రమైన ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ దసరా పండుగ అనంతరం పరిహారంపై మాట్లాడుదాం అని చెప్పి రైతులను మభ్య పెట్టారని రైతు నాయకుడు బాధిత రైతు బూర్గుల రామచంద్రరావు ఆవేదన వ్యక్తం చేశారు.
ఓ పక్కన రైతులని బుజ్జగిస్తూనే మరో పక్కన కాంట్రాక్టర్లను పంటలమీదికి వచ్చి ధ్వంసం చేయడంపై ఆయన మండిపడ్డారు.
ప్రభుత్వం ఇప్పటికైనా భూములు కోల్పోతున్న బాధిత రైతులకు సరైన పరిహారం చెల్లించి భూములను తీసుకోవచ్చని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరకాల, ఆత్మకూర్, నడికుడ మండలాలకు చెందిన భూపతి రైతులు పాల్గొన్నారు.

## 15, 16 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో

# ఓటర్ల నమోదు ప్రత్యేక క్యాంపులు

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే కాకుండా, అనర్హుల పేర్లను జాబితా నుంచి తొలగించడమే భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి. సుదర్శన్ రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈ నెల 15, 16 తేదీల్లో (గురు, శుక్రవారాల్లో) ప్రత్యేక నమోదు క్యాంపులు నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. కొత్తగా ఓటు హక్కు పొందే యువతకు, ఇదివరకు జాబితాలో పేర్లు లేని అర్హులకు ఓటరుగా నమోదు చేసుకునే అవకాశాన్ని కల్పించడమే ఈ ప్రత్యేక డ్రైవ్ ముఖ్య ఉద్దేశమని సిఈఓ తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితాలో పేర్లు లేని వారు లేదా కొత్తగా నమోదు చేసుకోవాలనుకునే అర్హులైన పౌరులు తమ సంబంధిత పోలింగ్ కేంద్రాలకు వెళ్లి 'ఫారం6' ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఈ క్యాంపులను విజయవంతం చేయడానికి జిహెచ్ఎంసి కమిషనర్, హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు, డిఇఓలకు సిఈఓ కార్యాలయం నుంచి స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. క్యాంపులు జరిగే రోజుల్లో బూత్ లెవెల్ అధికారులు (బిఎల్ఓలు), వివిధ గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్ఏలు) తప్పనిసరిగా పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండాలన్నారు. అంతేకాకుండా, బిఎల్ఓలు ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను సేకరించాలని అధికారులు ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు ముందున్న ఓటర్ల జాబితాతో ప్రస్తుత జాబితాను సరిపోల్చి, తొలగించిన లేదా మిగిలిపోయిన ఓటర్ల వివరాలను సేకరిస్తారు. అందుకోసం ప్రతి బిఎల్ఓ వారానికి 20 నుండి 25 ఇళ్లను సందర్శించి అర్హులైన వారికి ఫారం6 ఇచ్చి నమోదు ప్రక్రియను పూర్తి చేయిస్తారు. సమాజంలో వెనుకబడిన వర్గాలు, నైట్ షెల్టర్‌లలో నివసించేవారు, కార్మిక కాలనీల వాసులు, నిరాశ్రయుల కోసం ప్రత్యేకంగా క్యాంపులు ఏర్పాటు చేయనున్నట్లు సిఈఓ తెలిపారు. ఈ డ్రైవ్‌లో ప్రజల్లో అవగాహన పెంచేందుకు విద్యాసంస్థలు, ప్రసార మాధ్యమాలు, సోషల్ మీడియా 'స్వీప్' కార్యక్రమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. రాష్ట్రంలోని అర్హులైన పౌరులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటరుగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**పట్టభద్రుల ఓటర్ల నమోదుకు 'ఎపిక్ నంబర్ తప్పనిసరి కాదు'**

పట్టభద్రుల నియోజకవర్గాల ఓటర్ల నమోదు ప్రక్రియలో దరఖాస్తుదారులకు ఊరటనిచ్చే కీలక ఆదేశాలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సిఈఓ) సి. సుదర్శన్ రెడ్డి జారీ చేశారు. గ్రాడ్యుయేట్ ఓటరుగా పేరు నమోదు చేసుకునేందుకు 'ఎపిక్' ఓటరు ఐడి నెంబర్ లేదా దాని వివరాలు అందించడం తప్పనిసరి కాదని ఆయన స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గాలకు సంబంధించి 2026 నవంబర్ 1వ తేదీని అర్హత తేదీగా పరిగణించి కొత్తగా ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోంది. అయితే, దరఖాస్తుదారులు కచ్చితంగా 'ఎపిక్' నంబర్ అందించాలని క్షేత్రస్థాయి ఎన్నికల యంత్రాంగం నిబంధనలు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని సిఈఓ తెలిపారు. ఈ నేపథ్యంలో సంబంధిత జిల్లాల ఎన్నికల అధికారులు (డిఈఓలు), ఓటర్ల నమోదు అధికారులకు (ఈఆర్ఓలు) ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కోసం ఫారమ్18 ద్వారా దరఖాస్తు చేసుకునేటప్పుడు ఎపిక్ నంబర్ సమర్పించలేదనే ఒక్క కారణంతో దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ తిరస్కరించకూడదని ఆదేశించారు. ఓటరు ఐడి నంబర్ లేకపోయినా ఇతర అర్హత ఆధారాలను పరిశీలించి దరఖాస్తులను స్వీకరించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందికి ఈ ఆదేశాలను వెంటనే చేరవేసి, ఎటువంటి విచలనం లేకుండా కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు అక్టోబర్ 12న జారీ చేసిన మెమోలో పేర్కొన్నారు. ఈ ఆదేశాల ప్రతులను సంబంధిత జిల్లాల కలెక్టర్లు, జిహెచ్ఎంసి కమిషనర్, అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు పంపినట్లు చెప్పారు.

### ప్రపంచంతో పోటీపడేలా

# విద్యారంగం.. విద్యకు ప్రభుత్వం పెద్దపీట

**ఆర్థిక వ్యవస్థ లక్ష్యంలో ఉపాధ్యాయులూ భాగస్వాములు కావాలి: భట్టి విక్రమార్క**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్య ద్వారానే సామాజిక, ఆర్థిక అసమానతలను అధిగమించి సమాజాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించవచ్చని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ విద్యార్థులను ప్రపంచంతో పోటీపడే స్థాయిలో తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యమిస్తూ, భారీగా నిధులు కేటాయించడంతోపాటు అనేక సంస్కరణలు చేపడుతోందని తెలిపారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దే ఉపాధ్యాయులే భావి తరాల నిర్మాతలని, 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లే లక్ష్య సాధనలో వారు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జీ తెలుగు న్యూస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గురు వందనం–ఎడ్యుకేషన్ కాంక్లేవ్, టీచర్స్ అవార్డ్స్–2026' కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొని మాట్లాడారు. వెనుకబడిన వర్గాలు, ఆర్థికంగా బలహీనమైన కుటుంబాల అభివృద్ధికి విద్యే ప్రధాన మార్గమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకొని విద్యారంగ అభివృద్ధిని ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. డిఎస్‌సి ద్వారా పెద్దఎత్తున ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని, జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్ల నియామకాలు పూర్తి చేశామని భట్టి విక్రమార్క వెల్లడించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఆంగ్ల మాధ్యమంలో విద్య అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేసి నిర్మాణ పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న విద్యా సంస్కరణలు భవిష్యత్తులో కీలక మార్పులకు దారితీస్తాయని భట్టి విక్రమార్క విశ్వాసం వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులందరూ ప్రభుత్వ లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, జీ న్యూస్ సీఈవో, ఎడిటర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

### 12 విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల ప్రత్యక్ష నియామక

# నిబంధనలను సవరించిన ప్రభుత్వం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 12 విశ్వవిద్యాలయాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల ప్రత్యక్ష నియామక నిబంధనలను ప్రభుత్వం సవరించింది. అభ్యర్థుల దరఖాస్తుల పరిశీలనకు యుజిసితో పాటు ఏఐసిటిఇ, పిసిఐ, బిసిఐ తదితర సంబంధిత నియంత్రణ మండళ్ల కనీస అర్హతలను చేర్చడం,అభ్యర్థుల షార్ట్ లిస్టింగ్ ప్రక్రియను తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టిజిసిహెచ్ఇ) పర్యవేక్షణలోని స్క్రూటినీ కమిటీ ఆధ్వర్యంలోకి తీసుకురావడం, అలాగే నెట్/సెట్ పరీక్షలు లేని టెక్నికల్, ఇంజనీరింగ్ విభాగాల్లో గతంలో ప్రతిపాదించిన రాతపరీక్ష నిబంధనను తొలగించి, మిగిలిన 93 మార్కుల స్కోరును 100 మార్కుల స్థాయికి లెక్కించి వెయిటేజీ ఇచ్చే విధానాన్ని ఖరారు చేసింది. డొమైన్ నాలెడ్జ్, బోధనా నైపుణ్యాల అసెస్‌మెంట్‌కు సంబంధించిన 30 మార్కుల కేటాయింపులను స్పష్టమైన ఉప విభాగాలుగా నిర్దేశించింది. గతంలో జారీ చేసిన జిఒ నంబర్ 21లోని నిబంధనలను సవరిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితా రాణా బుధవారం జిఒ నంబర్ 31ను జారీ చేశారు. హైలెవల్ కమిటీ సిఫారసులు, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ల లేఖలను పరిశీలించి ప్రభుత్వం మార్పులను ఆమోదించింది. కాగా రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ పరిధిలోని 12 విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, రిజిస్ట్రార్లు నూతన మార్గదర్శకాల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

**ప్రధాన సవరణలు ..**

**అర్హత :..** గతంలో కేవలం యుజిసి నిబంధనల వరకే ఉండగా, ప్రస్తుతం యుజిసితో పాటు ఏఐసిటిఈ, పిసిఐ), ఎన్‌సిటిఈ,సిఓఎ,బిసిఐ వంటి ఆయా విభాగాల నియంత్రణ మండళ్ల కనీస అర్హతలను కూడా చేర్చారు.

**ఉన్నత విద్యా మండలి పరిధిలోకి స్క్రూటినీ కమిటీ:..** అభ్యర్థుల దరఖాస్తులను పరిశీలించి షార్ట్‌లిస్టు 'స్క్రూటినీ కమిటీ'ని ఇకపై తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి పర్యవేక్షణలోనే ఏర్పాటు చేస్తారు.

**రాతపరీక్ష తొలగింపు : ..**

(ఇంజనీరింగ్/టెక్నికల్ విభాగాలు): నెట్/సెట్ పరీక్షలు లేని టెక్నికల్ విభాగాలకు గతంలో ప్రతిపాదించిన కంప్యూటర్ ఆధారిత రాతపరీక్ష (100 మార్కుల పరీక్ష) నిబంధనను పూర్తిగా తొలగించారు. దీనికి బదులుగా, నెట్/సెట్ లేని అభ్యర్థులకు నెట్ కేటగిరీకి ఉండే ఏడు మార్కులు మినహాయించి, మిగిలిన 93 మార్కుల స్కోరునే 100 మార్కుల స్థాయికి లెక్కించి 50 మార్కుల వెయిటేజీకి కుదిస్తారు.

**డొమైన్ నాలెడ్జ్, బోధనా నైపుణ్యాల మార్కుల స్పష్టత:..** పార్ట్‌బి లోని 30 మార్కులను డెమో బోధనకు 10 మార్కులు, డొమైన్ నాలెడ్జ్‌కు 10 మార్కులు, రీసెర్చ్ ఆప్టిట్యూడ్‌కు 5 మార్కులు, పుస్తకాల ప్రచురణకు 5 మార్కులుగా విభజిస్తూ పూర్తి స్థాయి మార్కుల వివరాలను నిర్దిష్టంగా పొందుపరిచారు.



## తెలంగాణ- లివర్‌పూల్ భాగస్వామ్యానికి కొత్త ఊపు

### పెట్టుబడులు, ఆవిష్కరణలకు మార్గం

### ట్రైకార్పొరేషన్‌ల ప్రత్యేక అధికారి జయేష్ రంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ, యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లివర్‌పూల్ ప్రాంతాల మధ్య సహకారం మరింత బలోపేతమైంది. లివర్‌పూల్ నుంచి వచ్చిన ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం హైదరాబాద్‌లో మూడు రోజుల పర్యటనను ముగించింది. ఈ పర్యటనలో ఆరోగ్య రంగం, లైఫ్ సైన్సెస్, పరిశోధన, ఆవిష్కరణలు, వాణిజ్యం, పెట్టుబడులు, నైపుణ్యాభివృద్ధి, క్రీడల రంగాల్లో ఇరు ప్రాంతాల మధ్య సహకార అవకాశాలపై చర్చలు జరిగాయి. లివర్‌పూల్ సిటీ కౌన్సిల్, లివర్‌పూల్ సిటీ రీజియన్ కంబైన్డ్ అథారిటీ, ఎన్‌హెచ్‌ఎస్ యూనివర్సిటీ హాస్పిటల్స్ లివర్‌పూల్ గ్రూప్, ఆరోగ్య సంస్థలు, పరిశోధనా సంస్థలు, వ్యాపార ప్రతినిధులు, లివర్‌పూల్ ఫుట్‌బాల్ క్లబ్ ప్రతినిధులతో కూడిన బృందం ఈ పర్యటనలో పాల్గొంది. తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆగస్టు 2026లో చేపట్టిన యూకే పర్యటన అనంతరం ఈ సహకారానికి పునాది పడింది. ఈ నేపథ్యంలో అక్టోబర్ 13న తెలంగాణ ప్రభుత్వం, లివర్‌పూల్ సిటీ కౌన్సిల్ మధ్య వ్యూహాత్మక అవగాహన ఒప్పందం (ఎంఓయు) కుదిరింది. మంగళవారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయాన్ని యునైటెడ్ కింగ్‌డమ్‌లోని లివర్‌పూల్ ప్రతినిధులు సందర్శించారు. తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ మాట్లాడుతూ తెలంగాణ, లివర్‌పూల్ ప్రాంతాలకు ఉన్న పరస్పర అనుకూల బలాలను వినియోగించుకుని ఈ భాగస్వామ్యం ద్వారా స్పష్టమైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ పర్యటన తెలంగాణ లివర్‌పూల్ సంబంధాల్లో కీలక మలుపుగా నిలిచిందని, భవిష్యత్తులో పెట్టుబడులు, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక వృద్ధికి కొత్త మార్గాలు తెరుచుకోనున్నాయని అన్నారు. ఈ సమావేశంలో జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఎంఎంసి కమిషనర్ టి.వినయ్ కృష్ణా రెడ్డి, సిఎంసి కమిషనర్ డాక్టర్ జి. సృజన పాల్గొన్నారు.

## ఓటరు జాబితా ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో అందే ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం హైకోర్టుకు తెలిపింది. ముసాయిదా ఓటరు జాబితాలో తన పేరు లేదంటూ ఎస్.క్యూ. మసూద్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ వివరాలు వెల్లడించింది. నోటీసులకు స్పందించి అవసరమైన పత్రాలు సమర్పిస్తే, పరిశీలన అనంతరం అర్హులైన వారి పేర్లను తుది జాబితాలో చేర్చే అవకాశం ఉంటుందని పేర్కొంది. ఎన్నికల సంఘం ఇచ్చిన వివరణను పరిశీలించేందుకు విచారణ ఈ నెల 15కి వాయిదా పడింది.

### ఎల్ నినోపై ముందస్తు సమరం..

# శిఖం భూముల్లో పశుగ్రాసం సాగు !

### స్వయం సహాయక సంఘాలకు నిర్వహణ బాధ్యతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి, భవిష్యత్తులో పశుగ్రాసం కొరత ఏర్పడకుండా ప్రభుత్వం అత్యంత ముందస్తు చర్యలకు శ్రీకారం చుట్టింది. మూగజీవాలకు అవసరమైన గ్రాసాన్ని సకాలంలో అందుబాటులో ఉంచడంతో పాటు తాగునీటి ఇబ్బందులు కలగకుండా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయంతో ఒక ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేసింది. ఇందులో భాగంగా నీటి లభ్యత ఉన్న చెరువులు, కుంటల శిఖం భూముల్లో పశుగ్రాసం సాగు చేయాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమాన్ని యుద్ధప్రాతిపదికన చేపట్టి, రాబోయే 45 రోజుల్లో పశుగ్రాసాన్ని అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ మేరకు రాష్ట్ర సచివాలయంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇలంబర్తి, పంచాయతీరాజ్ కమీషనర్ దివ్య దేవ రాజన్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జాయింట్ కమిషనర్ ఎం. శ్రీనివాస్, ఐ అండ్ సిఏడి ఈఎన్‌సి రమేష్ బాబు, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ ఈఎన్‌సి మధుసూదన్, విబిజి రాంజీ తదితర ముఖ్య అధికారులు పాల్గొన్నారు. శిఖం భూముల గుర్తింపు, ఐదు నుంచి పది ఎకరాల్లో సాగు సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం, నీటి వసతి ఉన్న చెరువులు, కుంటల పరిధిలోని శిఖం భూములను వెంటనే గుర్తించనున్నారు. ఒక్కో ప్రాంతంలో ఐదు నుంచి పది ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసాన్ని సాగు చేయనున్నారు. ఇందుకు అనువైన స్థలాలను ప్రాధాన్యత ప్రాతిపదికన గుర్తించే బాధ్యతను నీటిపారుదల, కమాండ్ ఏరియా అభివృద్ధి (ఐ అండ్ సిఏడి) శాఖకు అప్పగించారు. గుర్తించిన భూముల్లో సాగుకు అవసరమైన ప్రాథమిక ఏర్పాట్లను తక్షణమే పూర్తి చేసి, నిర్ణీత 45 రోజుల గడువులోగా పంట చేతికి వచ్చేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

**ఉచిత విత్తనాలు :** ఉపాధి హామీ నిధులు ఈ పశుగ్రాస సాగుకు అవసరమైన ఆర్థిక వ్యయాన్ని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి సమకూర్చనున్నారు. తక్కువ కాలంలో అధిక దిగుబడినిచ్చే సిఎస్‌హెచ్ 24 ఎంఎఫ్ రకం పశుగ్రాసాన్ని ఎంపిక చేశారు. సాగుకు కావలసిన విత్తనాలను పశుసంవర్ధక శాఖ ద్వారా ఉచితంగా పంపిణీ చేస్తారు. దీనివల్ల రైతులకు లేదా స్థానిక సంఘాలకు విత్తన వ్యయం భారం కాకుండా చర్యలు తీసుకుంటున్నారు. స్వయం సహాయక సంఘాలకు సంరక్షణ బాధ్యతలు ఎంపిక చేసిన భూముల్లో పశుగ్రాసం విత్తడం, పంట సంరక్షణ, నీటి నిర్వహణ, కోత వంటి పనులను పర్యవేక్షించే పూర్తి బాధ్యతలను మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని ప్రభుత్వం నిశ్చయించింది. వివిధ శాఖల సమన్వయంతో ఈ ప్రక్రియ అంతా సాగనుంది. విత్తనాల పంపిణీ నుంచి పంట చేతికి వచ్చే వరకు ఎక్కడా జాప్యం జరగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయి పరిశీలన జరపాలని ఆదేశించారు. అందుబాటులో ఉన్న సహజ వనరులనే సమర్థవంతంగా వాడుకుంటూ పశుగ్రాస ఉత్పత్తిని పెంచడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం.



## ఎసిబి కస్టడీకి నిమ్స్ డాక్టర్ లక్ష్మీ భాస్కర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్ ఆస్తుల వ్యవహారంలో దర్యాప్తును మరింత వేగవంతం చేసేందుకు అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) సిద్ధమైంది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయనను మూడు రోజులపాటు కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు ఎసిబి కోర్టు అనుమతించింది. చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో ఉన్న ఆయనను కస్టడీలోకి తీసుకోనున్న అధికారులు.. ఆస్తుల సమీకరణ, వాటి కొనుగోలుకు నిధుల సమకూర్పు, బినామీలుగా అనుమానిస్తున్న వ్యక్తులతో సంబంధాలపై ప్రశ్నించనున్నట్లు సమాచారం. ఇప్పటికే నిర్వహించిన సోదాల్లో వెలుగు చూసిన ఆస్తుల వివరాల ఆధారంగా మరిన్ని అంశాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సెప్టెంబరు 22న లక్ష్మీ భాస్కర్ నివాసంతోపాటు ఆయన బంధువులు, సన్నిహితులకు సంబంధించిన పలు ప్రాంతాల్లో ఎసిబి అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్లాట్లు, స్థలాలు, పెట్టుబడులు, బంగారు ఆభరణాలు, ఖరీదైన వాహనాలకు సంబంధించిన వివరాలను గుర్తించారు. అధికారిక పత్రాల ప్రకారం గుర్తించిన ఆస్తుల విలువ తొలుత రూ.6.13 కోట్లుగా ఉండగా, వాటి మార్కెట్ విలువ రూ.100 కోట్ల వరకు ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.ఈ కేసులో భాగంగా సెప్టెంబరు 29న నిమ్స్‌కు చెందిన కొందరు ఉద్యోగుల నివాసాల్లోనూ ఎసిబి సోదాలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో ఆస్తులకు సంబంధించిన పత్రాలు, పెట్టుబడుల వివరాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. బినామీల పేర్లతో ఆస్తులు కొనుగోలు చేశారా? వాటి వెనుక ఉన్న నిధుల మూలాలేమిటి? అనే అంశాలపై కస్టడీ విచారణలో స్పష్టత తీసుకునే అవకాశం ఉంది.



## కేంద్రీకృత పిఎంయు టెండర్లు రద్దు చేయాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లలో నిత్యావసర సరుకుల సరఫరా కోసం ప్రభుత్వం చేపట్టిన కేంద్రీకృత పిఎంయు టెండర్లను తక్షణమే రద్దు చేయాలని, పాత పద్ధతిలోనే స్థానిక వెండర్ల ద్వారా సరుకులను సరఫరా చేయాలని బిఆర్ఎస్ఎల్‌పి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో తెలంగాణ గురుకుల కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులు హరీశ్ రావును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం మార్చిన టెండర్ నిబంధనల వల్ల వేల మంది స్థానిక వెండర్ల కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి నెలకొన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దీనిపైన హరీశ్‌రావు స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గురుకులాలను చిన్నచూపు చూస్తూ పేద విద్యార్థులకు పెట్టే భోజనంపై కూడా కక్కుర్తి పడుతున్నారని, రూ 800 కోట్ల టెండర్లలో కూడా కమీషన్ల దందా నడుపుతోందని ధ్వజమెత్తారు. మొత్తం రాష్ట్రాన్ని ఒకే యూనిట్‌గా చేసి పిఎంయు విధానం ద్వారా రూ. 800 కోట్ల కాంట్రాక్టును ఒకే వ్యక్తికి, బ్లాక్‌లిస్టులో పెట్టిన సంస్థకు అప్పగించడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు చేతులు మారాయని ఆయన ఆరోపించారు.నిబంధనల ప్రకారం సబ్‌కాంట్రాక్టులకు అవకాశం లేకపోయినప్పటికీ తెరవెనుక 12 మందికి సబ్ కాంట్రాక్టులు, అక్కడి నుంచి 33 జిల్లాలకు పంపకాలు చేసి, ప్రతి జిల్లాకు రూ. 2 కోట్ల చొప్పున ఏకంగా రూ. 66 కోట్ల గుడ్విల్, ప్రతినెలా బిల్లుల్లో 20 శాతం కమీషన్ల ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. పేద విద్యార్థుల ఆరోగ్యం, చిరు వ్యాపారుల పొట్టకొట్టే అవినీతి నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోకపోతే బిఆర్ఎస్ బాధిత కుటుంబాల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తామని హరీశ్ రావు హెచ్చరించారు.

## జిఎస్‌టి గుర్తింపు దుర్వినియోగం

### రూ.38 కోట్ల లావాదేవీల కలకలం!

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వ్యాపారం ప్రారంభించేందుకు జిఎస్‌టి నమోదు చేసుకున్న ఓ మహిళకు తెలియకుండానే ఆమె జిఎస్‌టి గుర్తింపు సంఖ్య (జిఎస్‌టిఐఎన్), వ్యక్తిగత వివరాలను దుర్వినియోగం చేసి సుమారు రూ.38 కోట్ల విలువైన లావాదేవీలు నిర్వహించినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. తన జీఎస్టీ ఖాతాలోని రిజిస్టర్డ్ ఈమెయిల్, మొబైల్ నంబర్లను అనధికారికంగా మార్చి, తనకు సంబంధం లేని లావాదేవీలు జరిపినట్లు టోలిచౌకికి చెందిన ఫర్హానా హసన్ లస్కర్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సిసిఎస్) పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఫిర్యాదు వివరాల ప్రకారం.. ఫర్హానా 2024 మే 10న జిఎస్‌టి నమోదు చేసుకున్నప్పటికీ, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మొదట్లో వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించలేకపోయారు. సెప్టెంబర్ 2025 వరకు కన్సల్టెంట్ ద్వారా జీరో రిటర్నులు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం అమెజాన్ ఇండియా ద్వారా కొబ్బరి చక్కెర విక్రయించేందుకు చిన్న వ్యాపారం ప్రారంభించినా, ఆశించిన స్థాయిలో అమ్మకాలు జరగలేదని తెలిపారు. ఆ తర్వాత గూగుల్ ద్వారా పరిచయమైన మరో వ్యక్తి నవంబర్ 2025 నుంచి జూన్ 2026 వరకు జిఎస్‌టి రిటర్నులు దాఖలు చేసేందుకు సహకరించారని, ఇందుకోసం వాట్సాప్ ద్వారా ఒటిపిలు పంచుకున్నట్లు ఫిర్యాదులో వివరించారు.జూలై 2026 నుంచి సదరు వ్యక్తి ఫోన్ కాల్స్, సందేశాలకు స్పందించడం మానేశారని, ఆ సమయంలో తన ఖాతా దుర్వినియోగానికి గురైన విషయం తెలియలేదని బాధితురాలు పేర్కొన్నారు. అనంతరం జిఎస్‌టి అధికారులు ఇంటికి వచ్చి తన జీఎస్టీఐఎన్‌పై సుమారు రూ.38 కోట్ల లావాదేవీలు జరిగినట్లు తెలియజేయడంతో విషయం వెలుగులోకి వచ్చిందన్నారు. తనకు అంత పెద్ద వ్యాపారం లేదని, అంతటి లావాదేవీలు నిర్వహించలేదని, వాటికి అనుమతి కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు. తన జిఎస్‌టి ఖాతాలోని ఈమెయిల్ చిరునామా, మొబైల్ నంబర్ తన అనుమతి లేకుండా మార్చినట్లు గుర్తించానని ఫిర్యాదులో తెలిపారు. తనపై అనవసర పన్ను బకాయిలు, జరిమానాలు, చట్టపరమైన చర్యలు పడకుండా వాస్తవాలను వెలికితీయాలని కోరారు. ఈ మేరకు సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు.

## ఉపాధి హామీ ఎఫ్‌టిఇ ఉద్యోగులకు గ్రాట్యుటీ

**తెలంగాణ ప్రభుత్వం జి.ఓ జారీ**

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉపాధి హామీ పథకంలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఫిక్స్‌డ్ టెన్యూర్ ఎంప్లాయిస్ (ఎఫ్‌టిఈ) ఉద్యోగులకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం తీపి కబురు అందించింది. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న గ్రాట్యుటీ సమస్యకు పరిష్కారం చూపుతూ అర్హులైన ఎఫ్‌టిఈ ఉద్యోగులకు గ్రాట్యుటీ ప్రయోజనాలు వర్తింపజేసేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జి.ఓ నెంబర్ 548ను జారీ చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో దాదాపు 20 ఏళ్లుగా ఎదురుచూస్తున్న సమస్య కొలిక్కి రావడంతో సుమారు 3,800 మంది ఉద్యోగులకు పదవీవిరమణ సమయంలో ఆర్థిక భరోసా లభించనుంది. గ్రామీణాభివృద్ధి సంస్థ (ఎస్ఆర్‌డిఎస్) పరిధిలో పనిచేస్తున్న అర్హులైన ఎఫ్‌టిఈలకు గ్రాట్యుటీ ప్రయోజనాలను విస్తరించేందుకు ఈ జి.ఓ ద్వారా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. గతంలో ఎస్ఈఆర్‌పి పరిధిలోని ఎఫ్‌టిఈలకు అందుతున్న ప్రయోజనాలకు అనుగుణంగానే ఈ నిర్ణయం తీసుకున్నారు. గ్రాట్యుటీ చెల్లింపుల కోసం ఎల్ఐసి ఆఫ్ ఇండియా లేదా ఇతర అర్హత కలిగిన బీమా సంస్థ ద్వారా గ్రూప్ గ్రాట్యుటీ, గ్రాట్యుటీ ఫండ్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సూచించింది. గ్రాట్యుటీ కోసం నెలకు సుమారు రూ. కోటి వరకు ఆర్థిక వ్యయం అవుతుందని అంచనా వేయగా, ఈ మొత్తాన్ని విబిజీ రామ్ జీ పథకం అడ్మినిస్ట్రేటివ్ కాంపోనెంట్ నుంచి భరించేందుకు అనుమతి లభించింది. ప్రాథమికంగా గ్రాట్యుటీ గరిష్ఠ పరిమితిని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రయోజనాలకు అనుగుణంగా, చట్టపరమైన నిబంధనలకు లోబడి రూ. 16 లక్షలుగా నిర్ణయించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, ఆత్మగౌరవానికి తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పునరుద్ఘాటించారు. జీవితాంతం ప్రజలకు సేవలందించిన ఉద్యోగులు పదవీ విరమణ తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకూడదన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. సర్వీసు, రిటైర్‌మెంట్ నిబంధనల ప్రకారం కనీసం రూ. 4 లక్షల గ్రాట్యుటీతో పాటు, పదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి వారి అర్హత ఆధారంగా రూ. 10 లక్షల వరకు ప్రయోజనం లభిస్తుందన్నారు. తన నియామకం లేదా ఎఫ్‌టిఈ హోదాలోకి మారిన తేదీ ఆధారంగా అర్హత సర్వీసును లెక్కిస్తారని జి.ఓలో పేర్కొన్నారు. దాదాపు రెండు దశాబ్దాల కల నెరవేరడం పట్ల ఎఫ్‌టిఈ ఉద్యోగుల సంఘం నాయకులు తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఖైరతాబాద్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ కార్యాలయంలో మంత్రి సీతక్కను కలిసి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తమ చిరకాల వాంఛను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలకు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

## సిఆర్ ఫౌండేషన్‌కు ఫ్లాట్ విరాళం

**హైదరాబాద్ :** సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు ఏరియాలో ఇంద్రేశం కాలనీలో (రూ. 40 లక్షలు విలువచేసే) 1045 చ . అడుగుల డబుల్ బెడ్ రూం ఫ్లాట్‌ను పల్లెకొండ నారాయణమ్మ సిఆర్ ఫౌండేషన్‌కు బహూకరించారు. మంగళవారం వారి కుటుంబసభ్యుల సమక్షంలో సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ ఆఫీసు కంది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేశారు. రిజిస్టర్ చేసిన డాక్యుమెంట్‌ను సిఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షులు డాక్టర్ కె. నారాయణకు అందజేశారు. నారాయణమ్మ దాతృత్వానికి నారాయణ, ట్రెజరర్ వి. చెన్నకేశవ రావు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణమ్మ మేనకోడలు జల్లా లీల, మేనకోడలు భర్త జల్లా శ్రీనివాస్, బంధువులు పాండురంగారావు, ఠాకూర్ రమేష్, సీఆర్ ఫౌండేషన్ వృద్ధాశ్రమం మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.





## ఎఇఆర్‌ఒ కార్యాలయాన్ని సందర్శించిన ఎన్నికల కమిషన్ డిప్యూటీ కలెక్టర్ జయచంద్రారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట** : సర్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసిన అధికారులను ఎన్నికల కమిషన్ డిప్యూటీ కలెక్టర్ జయచంద్రారెడ్డి అభినందించారు. మంగళవారం తూంకుంటలోని ఎఇఆర్‌ఒ కార్యాలయాన్ని ఎన్నికల కమిషన్ డిప్యూటీ కలెక్టర్ జయచంద్రారెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా సర్ ప్రక్రియకు సంబంధించి హియరింగ్, డాక్యుమెంట్‌ల అప్‌లోడ్ తదితర విషయాలను అక్కడి అధికారి ఎఇఆర్‌ఒ మధుసూదన్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. మొత్తం 7791 ఓటర్లకు నోటీసులు అందజేయగా 7691 ఓటర్ల విచారణ పూర్తి అయ్యిందని అధికారులు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సర్ ప్రక్రియను ఇంత సులువుగా, పక్కాగా పూర్తిచేసిన సూపర్‌వైజర్‌లు, బిఎల్‌ఒలను అభినందించారు. హెల్ప్ డెస్క్ నిర్వహించడంతో పాటు విచారణ చక్కగా పూర్తి చేశారని చెప్పా రు. ఈ కార్యక్రమంలో ఎఇఆర్‌ఒ మధుసూదన్‌రెడ్డి, ఆర్‌డిఒ కార్యాలయ తహశీల్దార్ సైదిరెడ్డి, సూపర్‌వైజర్‌లు రజిత, జానీ, రూప, బిఎల్‌ఒలు బార్గవ్, కవిత, స్రవంతి,భీమా, తదితరులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి : డా.సత్యం శ్రీరంగం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి**: తెలంగాణ రాష్ట్రంలోని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఉత్తమ ప్రతిభను కనబరచాలని టిపిసిసి అధికార ప్రతినిధి, తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అడహాక్ కమిటీ కన్వీనర్ డా.సత్యం శ్రీరంగం అన్నారు.



క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో పాటు జట్టుగా పని చేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అడ్‌హాక్ కమిటీ ఆధ్వర్యంలో కోల్‌కతాలో అక్టోబర్ 31 నుంచి నవంబర్ 1, 2026 వరకు నిర్వహించనున్న సబ్ జూనియర్ త్రోబాల్ టోర్నమెంట్‌లో తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొనే క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రదర్శించిన ప్రతిభ ఆధారంగా 15మంది బాలురు, 15మంది బాలికలు కలిసి మొత్తం 30మంది క్రీడాకారులను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. డా.సత్యం శ్రీరంగం అధ్యక్షతన ఆయన కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో క్రీడాకారుల ఎంపిక ప్రక్రియకు సంబంధించిన అంశాలపై చర్చించారు. అనంతరం ఎంపిక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి అడహాక్ కమిటీ సభ్యులు చిత్రా షెనాయ్, కృష్ణ రాజ్‌పుత్, భాస్కర్ రెడ్డి హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులు కోల్‌కతాలో జరిగే జాతీయ స్థాయి టోర్నమెంట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించనున్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా రాష్ట్రంలో త్రోబాల్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



## అన్నరాయుని చెరువు సమస్య పరిష్కరించాలని వినతి

**ప్రజాపక్షం/చర్లపల్లి**: నాగారం డివిజన్ పరిధిలోని అన్నరాయుని చెరువుకు ఎగువ ప్రాంతాల నుండి వచ్చు మురికి నీటితో పూర్తిగా కాలుష్యం కాసారమైంది. ఇట్టి సమస్యపై చెరువు పరిసర కాలనీల ప్రజలు, మాజీ కౌన్సిలర్ కొమిరెల్లి అనిత సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డికి వినతి పత్రం అందజేశారు. దీనికి స్పందించిన మల్లారెడ్డి హైడ్రా కమిషనర్‌కు అన్నరాయుని చెరువును కాలుష్య భూతం నుండి కాపాడాలని ఎగువ ప్రాంతాల నుండి వచ్చే మురికి నీటిని ప్రత్యేక ఫీడర్ కెనాల్ ద్వారా చెరువులోనికి రాకుండా మళ్లించి చెరువులోని గుర్రపుడెక్క, పూడికను తొలగించి, చెరువు పరిసరాలను అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సుందరీకరణ చేస్తూ అభివృద్ధి చేయాలని కోరారు. ఎమ్మెల్యే ఆదేశానుసారం స్థానిక మాజీ కౌన్సిలర్ ఎంఎంసి కమిషనర్, హైడ్రా కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొమిరెల్లి సుధాకర్‌రెడ్డి, యాకయ్య, నర్సింహగౌడ్, పంగచంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణా దేవీ అలంకారంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ తల్లి

### జోరుగా అన్నదాన కార్యక్రమాలు



**ప్రజాపక్షం/నిజాంపేట్** : విజయ దశమి వేడుకల్లో భాగంగా దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలు మూడవ రోజుకి చేరుకున్నాయి. మంగళవారం అన్నపూర్ణా దేవీ అవతారంతో దుర్గమ్మ తల్లి భక్తులకు దర్శనమిచ్చారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని నిజాంపేట్ సర్కిల్ బాచుపల్లి, కౌసల్య కాలనీలోని శ్రీ వెంకట శివ సీతా రామాలయ ఆలయంలో మాజీ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో దేవీ నవరాత్రి ఉత్సవాల ను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆలయ ఆవరణలో అమ్మవారిని నెలకొలిపి ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మంగళవారం అన్నపూర్ణా దేవీ అలంకరణతో భక్తులకు ప్రత్యేకంగా దుర్గమ్మ తల్లి దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆగం రాజు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదేవిధంగా నిజాంపేట్ గ్రామంలోని శ్రీ కనక దుర్గమ్మ దేవి ఆలయంలో ఆలయ ధర్మకర్త, కాంగ్రెస్ సీనియర్ నేత కొలను శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలను కన్నుల పండువగా నిర్వహిస్తున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన కొలను శ్రీనివాస్ రెడ్డి శివునికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆగం రాజు, శ్రీనివాస్ రెడ్డిలు మాట్లాడుతూ మంగళవారం అంటే మంగళము అంటే శుభమని, అన్నపూర్ణా దేవి అంటే అన్నం కల్పించే తల్లి కొలుస్తారని, భక్తితో అన్నపూర్ణాదేవిని కొలిస్తే ఎల్లవేళలా అందరికి అన్నం కలిగిస్తుందని అన్నారు.

# భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

### ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** కాప్రా సర్కిల్ పరిధిలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పలు మౌలిక వసతుల సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు వెంటనే తీసుకోవాలని ఎంఎంసి కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఆయన క్షేత్రస్థాయి పర్యటన ద్వారా సమస్యలను పరిశీలించారు. ఇసిఐఎల్ జంక్షన్‌లో ఫ్రీలెఫ్ట్ సౌకర్యం మెరుగుదల కోసం చేపట్టాల్సిన పనులను పరిశీలించిన ఆయన జంక్షన్ అభివృద్ధికి అవసరమైన భూ సేకరణ పనులను వేగవం తం చేయాలని సూచించారు. సోనీ సెంటర్ సమీపంలోని రహదారి క్రాసింగ్ కల్వర్టు ప్రాంతాన్ని పరిశీలించి వాహనాల రాకపోకలకు సౌలభ్యం కల్పించేలా రహదారి విస్తరణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని, రాధికా జంక్షన్ అభివృద్ధికి సంబంధించి పరివార్ రెస్టారెంట్, ఆలయం, హెల్మెట్ దుకాణం వద్ద అవసరమైన భూ సేకరణ ప్రక్రియ యుద్ధప్రాతిపదికన చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. జంక్షన్ అభివృద్ధి ద్వారా ట్రాఫిక్ నిర్వహణ మెరుగుపడేందుకు ప్రజలకు రాకపోకల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. పోచమ్మ డీ మార్ట్ జంక్షన్ వద్ద రహదారిని దాటే బాక్స్ డ్రైయిన్ నిర్మాణానికి సంబంధించి నీటి పైపులైన్ల మార్పిడి పనులను ట్రాఫిక్ పోలీసుల సమన్వయంతో త్వరితగతంగా పూర్తి చేయాలని, పైపులైన్ల మార్పిడి కారణంగా నిర్మాణ పనుల్లో ఏ మాత్రం జాప్యం కలుగకుండా చూడాలన్నారు. చిన్న చెర్లపల్లి స్మశాన వాటికను పరిశీలించిన ఆయన దాని అభివృద్ధికి ఎదురయ్యే అవరోధాలను ముందుగానే గుర్తించేందుకు పోలీసు విభాగ డిసిపి, గ్రామస్తులతో కల్సి సంయుక్త క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని ఎంఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. స్థానికుల అవసరాలను పరిగణనలోకి తీసుకొని అభివృద్ధి పనులకు అవసరమైన చర్యలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. భూసేకరణ, యుటిలిటీ లైన్ల మార్పిడి, రహదారి విస్తరణ, జంక్షన్ల అభివృద్ధి వంటి పనులను సమన్వయంతో వ్యవహరించటం ద్వారా జాప్యం లేకుండా పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

## జనగణన ప్రక్రియ నిర్ణీత గడువులోపు పూర్తి

### అదనపుకలెక్టర్ వెంకటాచారి




**ప్రజాపక్షం /వికారాబాద్** : జనగణన ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి అన్నారు. జనగణన–2027 రెండో దశపై చార్జ్, క్లర్కులు, టెక్నికల్ అసిస్టెంట్లకు కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ దేశ ప్రతిష్టను ఇనుమడించే ప్రక్రియలో పాల్గొని పనిచేయడం అదృష్టంగా భావించాలన్నారు. జనగణన ప్రక్రియలో నిర్లక్ష్యం వహించకుండా చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి సందేహాలను నివృత్తి చేసుకొని తమకు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా చేపట్టాలని సూచించారు. జనగణన విజయవంతంగానిర్వహించడంలో శిక్షణా కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఆయన తెలిపారు.

జిల్లాలో ఇంటి జాబితా తయారీ ప్రక్రియకు మొదటి దశలో 2028 ఇండ్ల జాబితా బ్లాకులు ఏర్పడ్డాయని, 1600మంది ఎన్యూమరేటర్లు 271 మంది సూపర్వైజర్‌లు విధులు నిర్వహించారని అన్నా రు. శిక్షణ కార్యక్రమంలో భాగంగా జనగణన రెండో దశకు సంబందించిన విధివిధానాలు, అధికారుల బాధ్యతలు, డిజిటల్ పద్ధతిలో సమాచార సేకరణ, సాంకేతిక సాధనాల వినియోగం, డేటా నమోదు, సమాచార గోప్యతకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఓ వెంకటేశ్వర్లు, ప్రణాళిక శాఖ రిటైర్ట్ డైరెక్టర్ దయానంద్, ఎడిరవిచంద్ర ,శిక్షణాధికారి జంగయ్య, సిబ్బంది, తదితరులు పాల్గోన్నారు.

## ఫార్మసీతో ఆరోగ్య భద్రత



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్** : ఫార్మసీ విద్యా ఔషధాల తయారీ పంపిణీకే పరిమితం కాకుండా రోగుల ఆరోగ్య పరిరక్షణ,ఔషధాల నాణ్యత, సమాజ శ్రేయస్సులో కీలకమని వక్తలు పేర్కొన్నారు. కొండా పూర్, ఘట్‌కేసర్‌లోని సంస్కృతి కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 21వ 'ఓరియంటేషన్‌డే' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి, రిహెట్ హెల్త్ కేర్ సిఇఒ డా.రఘువీర్ మాట్లాడుతూ విద్యార్థులు వృత్తిపరమైన నైపుణ్యాలు, నైతిక విలువలు, పరిశోధనా దృక్పథాన్నిపెంపొందించుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఆర్. నరసిహా రావు మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకొని ప్రయోగశాల అభ్యాసం, పరిశోధనపై దృష్టి సారించాలని తెలిపారు. కళాశాల కార్యదర్శి ఎం.రాజేంద్ర కృష్ణ మాట్లాడుతూ ఫార్మసీ రంగంలో రాణించేందుకు నిరంతర అధ్యయనం, బాధ్యతాయుతమైన వైఖరి, నైతిక ప్రమాణాలు అవసరమని పేర్కొన్నారు.

కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డా.కె శివకేశవ రెడ్డి, ప్రిన్సిపాల్ డా.పి. జానకి రాములు, విభాగాధిపతులు డా.డి.స్వాతి, డా.పి. లక్ష్మి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమానికి సహకరించిన చైర్మన్ ఏవి రమణారెడ్డి, కార్యదర్శి ఎం. రాజేంద్ర కృష్ణకు ప్రిన్సిపాల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## బొలేరో వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

**ప్రజాపక్షం/శామీర్‌పేట**: బొలేరో వాహనం ఢీకొని వృద్ధుడు మృతి చెందిన సంఘటన జీనోమ్‌వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. జీనోమ్ వ్యాలీ ఇన్‌స్పెక్టర్ గురువయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. అలియాబాద్ మున్సిపాలిటీ లాల్‌గడిమలక్‌పేటకు చెందిన కత్తి నర్సింలు(55) సోమవారం నాడు తన కుమార్తె ఇంటికి ఎదులాబాద్ వెళ్లి తిరిగి సాయంత్రం వస్తుండగా అలియాబాద్ ప్రధాన చౌరస్తాలో బస్సుదిగి శుభం గార్డెన్స్ ఎదురుగా ఉన్న రహదారికి ఎడమవైపు నడుచుకుంటు వెళ్తుండ గా వెనకాల నుంచి వచ్చిన టిఎస్ 07 యు ఎల్ 2708 నెంబర్ గల బొలేరో వాహనం డైవర్ నిర్లక్ష్యంగా, అతి వేగంగా నడపుకుంటు వచ్చి కత్తి నర్సింలును వెనకనుంచి ఢీ కొట్టాడు. ఈ ప్రమాదంలో నర్సింలు తలకు తీవ్ర గాయాలు కాగా వెంటనే స్థానికుల సహాయంతో అతడిని మెడిసిటి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

### బిఆర్‌ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద



**ప్రజాపక్షం/ నిజాంపేట్**: ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని బిఆర్‌ఎస్ ఎల్పి విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సుభాష్ నగర్ డివిజన్ వాసులే అవుట్ కాలనీలో ఎమ్మెల్యే కెపి వివేకానంద పాదయాత్ర చేశారు. స్థానికంగా నెలకొన్న సమస్యల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా కాలనీలో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని, పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదని, మౌలిక వసతులను మెరుగుపరచాలని కాలనీ వాసులు వివేక్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా వివేకానంద మాట్లాడుతూ వాసు లే అవుట్ కాలనీలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించానని, ప్రజలకు మెరుగైన మౌలిక వసతులను కల్పించి కాలనీ అభివృద్ధికి కృషి చేశామని తెలిపారు. నూతనంగా ఏర్పాటైన ఈ కాలనీలో తాగునీరు, సిమెంటు రోడ్లు వంటి కనీస సదుపాయాలను కల్పించామని అన్నారు. కాలనీలో ప్రమాద భరితంగా ఉన్న విద్యుత్ తీగలను వెంటనే మార్చాలని, దోమల బెడదను నివారించేందుకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేసేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. మిగిలిన సమస్యలను సైతం త్వరితగతిన పరిష్కరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లావణ్య, మాజీ కార్పొరేటర్ సురేశ్ రెడ్డి, నాయకులు శ్రీకాంత్, బలరాం, ఇస్మాయిల్, గుబ్బల లక్ష్మీనారాయణ, కోల శ్రీకాంత్, సరస్వతి, పద్మలతా రెడ్డి, భాస్కర్ రెడ్డి, హరీష్, రమణయ్య, రాంబాబు, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## గాయత్రీ మహా క్షేత్రంలో మధుర మీనాక్షిగా దర్శనం

**ప్రజాపక్షం/శామీర్‌పేట** : తూంకుంటలోని గాయత్రీ మహా క్షేత్రంలో శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు మధుర మీనాక్షిగా భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్‌విఎల్‌ఎన్ మూర్తి ఆధ్వర్యంలో గాయత్రీ మహా క్షేత్రంలో దేవి శరన్నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని మధుర మీనాక్షి దేవిగా అలంకరించారు. అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిస్తుండటంతో నగరం నుంచి తూంకుంట పరిసర ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## ఆధ్యాత్మిక ఉత్సవాలు ఐక్యతకు ప్రతీక

### మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా



**ప్రజాపక్షం/జవహర్‌నగర్**: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జవహర్‌నగర్‌లోని సంతోష్‌నగర్ కాలనీలో కొలువుదీరిన శ్రీ దుర్గామాత మండపం వద్ద ఆధ్యాత్మిక వాతావరణం విల్లివిరిసింది. ఈ ఉత్సవాల్లో భాగంగా మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి శాస్త్రక్తంగా అభిషేకం, కుంకుమార్చనలు జరిపారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించి స్వయంగా వడ్డించారు. ఈ సందర్భంగా రెడ్డిశెట్టి శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. నవరాత్రి ఉత్సవాలు ప్రజలలో భక్తిభావాన్ని నింపడంతో పాటు సమాజంలో ఐక్యతను, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.జవహర్‌నగర్ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రమణప్ప, నరసింహ గౌడ్, సుధాకర్, అనిరుద్, తదితరులతో పాటు శ్రీమన్నారాయణ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, భక్తులు, పూజలు నిర్వహించారు.

## బంట్వారం ఎస్‌ఐగా ఎస్‌ఐ పుండ్లిక్

**ప్రజాపక్షం/బంట్వారం**:బంట్వారం పోలీస్‌స్టేషన్‌లో ఏడాదికి పైగా విధులు నిర్వహించిన ఎస్‌ఐ పి విమల సైబారాబాద్‌కు బదిలీ పై వెళ్లడంతో ఆమె స్థానంలో నూతన ఎస్‌ఐగా పుండ్లిక్ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో నవబ్‌పేట్, వికారాబాద్‌లో ఎస్‌గా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రల దృష్ట్యా, ప్రజలుఅందుబాటులో ఉంటు ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నా అన్నారు.




## ప్రభుత్వ స్థలంలో అక్రమ కట్టడాలు చేపడితే క్రిమినల్ కేసులు

### శామీర్‌పేట తహసీల్దార్ శ్రీనివాస్

**ప్రజాపక్షం/శామీర్‌పేట**: ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాలు చేపట్టినాలేదా ఆక్రమించినా చట్టరీత్యా చర్యలు తప్పవని, క్రిమినల్ కేసులు పెడతామని శామీర్‌పేట తహసీల్దార్ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం శామీర్‌పేటలోని సర్వే నెంబర్ 1266లో అక్రమ కట్టడాలను తహసీల్దార్ ఆదేశాలతో ఆర్‌ఐ భానుచందర్ కూల్చివేతలు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఐ భానుచందర్ మాట్లాడుతూ శామీర్‌పేట మండల కేంద్రంలో సర్వే నెంబర్ 1266లో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు అక్రమ కట్టడాలకు పాల్పడుతున్నారని వచ్చిన సమాచారం అక్కడికి స్థలానికి వెళ్లి పునాది రాళ్లను కూల్చివేసి సూచిక బోర్డును ఏర్పాటు చేశామని చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాన్ని చట్ట విరుద్ధంగా ఆక్రమించిన, నిర్మాణాలు చేపట్టిన వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామపాలానాధికారి శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



## స్మశాన వాటిక అభివృద్ధి పనులకు రూ.25లక్షలు మంజూరు

**ప్రజాపక్షం/ఉప్పల్:** చిలుకానగర్ డివిజన్‌లోని క్రైస్తవ స్మశాన వాటికలో మౌలిక వసతుల అభివృద్ధి పనులకు రూ.25 లక్షలు మంజూరయ్యాయని కాంగ్రెస్ చిలుకానగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ములకపల్లి రాజేశ్ ముదిరాజ్ తెలిపారు. స్మశాన వాటికలో మంచినీరు, టాయిలెట్లు, విద్యుత్ దీపాలు, డ్రైనేజి లాంటి మౌలిక వసతులను ఈ నిధులతో త్వరలో పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వరరెడ్డి చొరవతో నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో క్రిస్టియన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు స్వర్ణలత రూపోస, జనరల్ సెక్రటరి నాగయ్య పాల్, పాస్టర్ జేమ్స్‌రాజ్, పాస్టర్ కిరణ్‌కుమార్, పాస్టర్ నాగేశ్వరరావు, ఫ్రాన్సిస్, గాంధీ, కాంగ్రెస్ శ్రేణులు బాలరాజ్, మహేందర్‌ముదిరాజ్, అమరేశ్వరి, శ్రీరాం, రఘు, భాస్కరరెడ్డి, కిరణ్, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

## నీటిని వృథా చేయవద్దు : మున్సిపల్ కమిషనర్

**ప్రజాపక్షం/వికారాబాద్** : నీటిని వృథా చేయవద్ద అని మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి ఒక ప్రకటనలో తెలిపరు. కమిషనర్ మాట్లాడుతూ వికారాబాద్ మున్సిపల్‌లోని ఆర్‌డబ్లుస్‌తో పాటు శివరెడ్డి పేట్ చెరువునుండి శుద్ధి చేసిన మంచి నీటిని ప్రతి రోజు సరఫరా చేయడం జరుగుతుంది. వివిధ వార్డుల్లో బోర్లనుండి కూడా నీటి సరఫరా, అత్యవసర పరిస్థితిలో టాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయడం జరుగుతుందన్నారు. ఎల్‌నినో ప్రభవం వల్ల నీటి సరఫరలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉన్నందున పట్టణ ప్రజలందరు నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. పట్టణ ప్రజలు తాగు నీరును రోడ్డు కడగడానికి, కార్లు, బైకులు ఇతర వాహనాలను శుభ్రం చేయడంకోసం నీటిని వృథా చేయకుండ చూడాలన్నారు. నీటిని వృథా చేసినట్లయితే ఎలాంటి నోటీసులు లేకుండానే నల్లా నీటి కనెక్షన్ తొలగించడం జరుగుతుందన్నారు. ప్రజలు, మున్సిపల్ అధికారులకు సహకరించాలని కోరారు.

## తాగునీటి పైప్‌లైన్ పనులకు శ్రీకారం

### మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్** : జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని జగద్గిరి నగర్‌లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా నూతన పైప్‌లైన్ ఏర్పాటు పనులకు మంగళవారం డివిజన్ మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కార్పొరేటర్‌గా ఎన్నికైన నాటి నుంచి జగద్గిరిగుట్ట డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేసినట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన తాగునీటి సదుపాయం కల్పించడంతో పాటు సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇచ్చినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం వర్షపాతం తక్కువగా ఉన్న నేపథ్యంలో రానున్న రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉందని, ప్రజలు నీటిని పొదుపుగా వినియోగిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు మెరుగైన తాగునీటి సదుపాయాలు అందించాలనే లక్ష్యంతో నూతన పైప్‌లైన్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి తనవంతు కృషి కొనసాగిస్తానని కొలుకుల జగన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బొగ్గుల సురేష్, తోక యాదగిరి, మనోజ్, మాయ కోటి ప్రభాకర్, బ్రహ్మయ్య, బి.ప్రభాకర్, కుమారస్వామి, సంతోష్, సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



## శరన్నవరాత్రి ఉత్సవాల్లో జనసేన నేత ముమ్మారెడ్డి ప్రేమకుమార్

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి** : కైతలాపూర్ డివిజన్‌లోని ప్రగతినగర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం నిర్వహించిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో జనసేన పార్టీ రాష్ట్ర జాయినింగ్ కమిటీ కన్వీనర్ ముమ్మారెడ్డి ప్రేమకుమార్ పాల్గొన్నారు. వినోద్ కుమార్ ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన ఆయన, అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ముమ్మారెడ్డి ప్రేమకుమార్ మాట్లాడుతూ విజయదశమి పర్వదినం ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, సుభిక్షంగా జీవించాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొల్లా శంకర్, వేముల మహేష్‌రావు, ప్రభాకర్ గౌడ్, స్థానిక జనసేన పార్టీ నాయకులు, కార్యర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## రూ.204 కోట్లు విడుదల (మొదటి పేజీ తరువాయి)

ఇబ్బందులు తలెత్తకుండా, స్కాలర్‌షిప్‌ల చెల్లింపులు సకాలంలో జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఆర్థిక పరిస్థితులు కారణంగా ఏ ఒక్క ఎస్సీ విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందని, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్కాలర్‌షిప్ ప్రక్రియలో జాప్యాన్ని తగ్గించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వ సహాయం అందేలా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు.

**హైదరాబాద్ పబ్లిక్ స్కూల్స్‌కు రూ.14.68 కోట్లు:** హైదరాబాద్ పబ్లిక్ స్కూల్స్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.14.68 కోట్లను విడుదల చేసింది. విద్యార్థుల విద్యకు సంబంధించిన ఫీజు బకాయిలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు.











































Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com